www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 20-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 323

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి ఉ.9.58 తదుపరి అష్టమి; నక్షత్రం: విశాఖ మ.1.30 తదుపరి అనూరాధ; వర్జ్యం: సా.5.54-7.39; దుర్ముహూర్తం: ఉ.10.33-11.19, మ.3.10-3.56; అమృతఘడియలు: తె.4.27-6.13; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.42; సూర్యాస్తమయం: 6.15

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సీఎం రేఖా గుప్తా

ఢిల్లీ ముఖ్యమంత్రి పీఠంపై వీడిన ఉత్కంఠ

తొలిసారి ఎమ్మెల్యేను వరించిన అదృష్టం

కలిసొచ్చిన ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ నేపథ్యం

నేడు రామ్‌లీలా మైదానంలో ప్రమాణం

హాజరుకానున్న ప్రధాని మోదీ, బీజేపీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు 2



ఢిల్లీలోని బీజేపీ ఆఫీసులో రేఖా గుప్తా విజయ సంకేతం

1 నుంచి 5 వరకు
ప్రత్యేక అసెంబ్లీ!?

ఎస్సీ వర్గీకరణ, బీసీల రిజర్వేషన్లపై మూడు బిల్లులు

సభలో చర్చ, బిల్లులకు చట్టబద్ధత.. 10 నుంచి పార్లమెంటు సమావేశాలు

అదే రోజు సీఎం రేవంత్ ఢిల్లీకి.. బీసీల రిజర్వేషన్లకు మద్దతివ్వాలని కేంద్రానికి వినతి

కేంద్రం ఆమోదం తెలపకపోతే పోరాటం.. అఖిలపక్ష నేతల్ని ఢిల్లీ తీసుకెళ్లే యోచన!

అన్ని పార్టీలకు త్వరలో సీఎం లేఖలు.. మార్చి 3వ వారంలో బడ్జెట్ సమావేశాలు



హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ, బీసీలకు రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని భావిస్తోంది. వర్గీకరణకు చట్టబద్ధతపై ఒక బిల్లు, బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లపై మరొకటి; విద్య, ఉపాధి రంగాల్లోనూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు ఉద్దేశించిన బిల్లులకు చట్టబద్ధత కల్పించనుంది. ఇందు కోసం మార్చి 1 నుంచి 5 వరకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. ఈ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ, బీసీల రిజర్వేషన్లపై మూడు బిల్లులను ప్రవేశపెట్టనుంది. వాటిపై చర్చ జరిపి, ఆమోదించిన అనంతరం చట్టబద్ధత కల్పించనుంది. ఈ నేపథ్యంలో మూడు బిల్లుల ముసాయిదా రూపకల్పనలో అధికారులు నిమగ్నమయ్యారు. త్వరలోనే ప్రభుత్వానికి ముసాయిదాలు అందనున్నాయి. అవి అందిన వెంటనే రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై చర్చించనుంది. ఆ తర్వాత వాటిని ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదింపజేయనుంది. రాష్ట్రంలోని ఎస్సీలను మూడు గ్రూపులుగా వర్గీకరించాలంటూ ఏకసభ్య కమిషన్ ప్రభుత్వానికి నివేదిక అందించిన విషయం తెలిసిందే. మాల, మాదిగల్లోని ఉపకులాలన్నింటినీ మూడు గ్రూపులుగా విభజించింది. గ్రూపు-1లో సామాజికంగా, ఆర్థికంగా, విద్యా పరంగా అత్యంత వెనకబడిన, పట్టించుకోని కులాలను చేర్చి వారికి 1 శాతం రిజర్వేషన్ కల్పించింది. గ్రూపు-2లో ఒక మోస్తరుగా లబ్ధి పొందిన కులాలను చేర్చి వారికి 9 శాతాన్ని ప్రతిపాదించింది. గ్రూపు-3లో మెరుగైన ప్రయోజనాలను పొందిన కులాలను చేర్చి వారికి 5 శాతాన్ని కేటాయించింది. మొత్తంగా కమిషన్ రాష్ట్రంలోని 59 కులాలకు 15 శాతం రిజర్వేషన్లను కేటాయించింది. సర్కారు ఈ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టి తీర్మానం చేసింది. నివేదికను బిల్లు రూపంలోకి తీసుకొచ్చి, వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని నిర్ణయించింది. అలా చేస్తే రిజర్వేషన్ల అమలులో ఎలాంటి ఇబ్బందులు ఉండవని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు, కమిషన్ గడువును తాజాగా పెంచడంతో వర్గీకరణలో ఏవైనా మార్పులు ఉంటాయా? అనే చర్చ కూడా జరుగుతోంది.

రిజర్వేషన్లపై కేంద్రంతో కొట్లాటే!

బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వం తొలుత నిర్ణయించింది. ఆ తర్వాత విద్య, ఉద్యోగాల్లోనూ 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనుకుంది. ఇప్పటివరకు విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 29 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. వాటికి అదనంగా మరో 13 శాతం పెంచాలని నిర్ణయించింది. బీసీలకు పెంచే రిజర్వేషన్‌ను ఏ, బీ, సీ, డీ, ఈ విభాగాల వారీగా పెంచాలని

మిగతా 14వ పేజీలో...



మార్చి 31లోపు ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేస్తే..
25% రాయితీ

అనధికారిక లేఅవుట్‌లో 10% శాతం ప్లాట్లు రిజిస్ట్రేషన్ అయి ఉంటే..

మిగిలిన 90% ప్లాట్ల క్రమబద్ధీకరణకు అనుమతి

దరఖాస్తుల పరిష్కారంపై ఇక రోజువారీ సమీక్ష. ప్రక్రియ వేగవంతం

డిప్యూటీ సీఎం భట్టి నేతృత్వంలోని మంత్రుల సమీక్షలో నిర్ణయాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ ప్రక్రియ వేగవంతానికి ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకుంది. మార్చి 31లోపు ఎల్ఆర్ఎస్ చేయించుకునే దరఖాస్తుదారులకు 25 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్‌పై సచివాలయంలో బుధవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన సమావేశం జరిగింది. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఈ సమీక్షలో పాల్గొన్నారు. అనధికారిక లేఅవుట్‌లో కేవలం 10 శాతం ప్లాట్లు రిజిస్టర్ అయి ఉండి.. మిగిలినవి రిజిస్టర్ కాకపోతే ఆ 90 శాతం ప్లాట్ల క్రమబద్ధీకరణకు అనుమతించాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు మంత్రులు తెలిపారు. ప్లాట్ కొనుగోలుకు సంబంధించి సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ ఉన్న వారికి కూడా 25 శాతం రాయితీ ఇస్తున్నామని వెల్లడించారు. నాలుగేళ్లుగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని, పేదల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 25.7 లక్షల

మిగతా 13వ పేజీలో...

అదనపు రుణం రూ. 1,474 కోట్లు

అంచనా కంటే ఎక్కువగా అప్పు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం

బడ్జెట్ అంచనాల్లో మార్కెట్ రుణాలు రూ.57,112 కోట్లు

జనవరి నాటికి తీసుకున్న రుణం రూ.58,586 కోట్లు 13

రాష్ట్ర రాబడులు 1,83,427 కోట్లు, వ్యయం రూ.1,78,947 కోట్లు

కాగ్ జనవరి నివేదిక

హరీశ్‌రావును ఇరికించే యత్నం!

చెప్పినట్టు వినకపోతే నరకం చూపిస్తామంటూ బెదిరింపులు

ట్యాపింగ్ కేసులో నిందితులపై పోలీసుల దారుణ హింస

హరీశ్ తరపు లాయర్ల వాదన

మా వద్ద ట్రిక్స్ ప్లే చేయొద్దు 12

పోలీసులకు హైకోర్టు చురక

దర్యాప్తుపై మార్చి 3 దాకా స్టే



16 వేల మెగావాట్లు దాటిన
విద్యుత్తు డిమాండ్

రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఇదే అత్యధికం 13



ముడా కేసులో సిద్ధూకు ఉపశమనం

ఆరోపణలకు రుజువులు లేవని లోకాయుక్త నిర్ధారణ 2

కోర్టుకు నివేదిక సమర్పించనున్న పోలీసులు

నాతో వాదనలా!

మోదీ చెప్పినా నేను వినలేదు

మీరెంత సుంకం విధిస్తే మేమూ అంతే వేస్తామని ఆయనకు గట్టిగా చెప్పా

భారత్‌కు ఎటువంటి మినహాయింపు ఉండదని స్పష్టం చేశా

ఇకపై అన్ని దేశాలతో ఇలాగే వ్యవహరిస్తాం.. అట్లాగైతేనే దారికొస్తాయి

భారత్‌లో బోలెడంత డబ్బు.. ఆ దేశంలో ఓటింగ్‌కు మనం డబ్బులు ఎందుకివ్వాలి?

భారీ పన్నులు విధించే భారత్‌లో టెస్లా ఫ్యాక్టరీ పెడితే అమెరికాకు అన్యాయమే

ఫాక్స్ ఇంటర్వ్యూలో ట్రంప్ వ్యాఖ్యలు

భారత ఫార్మాకు ట్రంప్ సుంకాల ముప్పు

ఔషధాలపై కనీసం 25% టారిఫ్



వాషింగ్టన్, ఫిబ్రవరి 19: పరస్పర సుంకాల విషయంలో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ వారిస్తున్నా తాను వినలేదని, మీరు ఎంత పన్నులు విధిస్తే తామూ అంతే విధిస్తామని ఆయన ముఖం మీదే చెప్పానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. ఈ అంశం మీద తనతో ఎవరూ వాదించటానికి వీల్లేదని పేర్కొన్నారు. తాను ప్రతిపాదించిన పరస్పర పన్నుల నుంచి భారత్‌ను మినహాయించే ప్రసక్తే లేదని తెలిపారు. ఫాక్స్ న్యూస్ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు

మిగతా 2వ పేజీలో...



బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఆ పార్టీ అధినేత కేసీఆర్

కాంగ్రెస్ గ్రాఫ్
పాతాళంలోకి..

6 నెలల్లోనే ఈ సర్కార్‌పై ప్రజల్లో వ్యతిరేకత

రేవంత్ అసమర్థతను అంతా గుర్తిస్తున్నారు

వందశాతం మళ్లీ బీఆర్ఎస్సే అధికారంలోకి

10 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు తథ్యం

కాంగ్రెస్ తొత్తులుగా కమ్యూనిస్టులు: కేసీఆర్

బీఆర్ఎస్ విస్తృతస్థాయి భేటీలో వ్యాఖ్యలు

పార్టీ పనైపోయిందంటూ బీఆర్ఎస్ నేతలే ప్రచారం చేశారని గులాబీ బాస్ ఆగ్రహం

ఏప్రిల్ 10న పార్టీ ప్రతినిధుల సభ, 27న బహిరంగ సభ నిర్వహించనున్నట్టు వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న కాంగ్రెస్ గ్రాఫ్ పాతాళానికి పడిపోయిందని.. ఈ సర్కార్‌పై ఆరు నెలల్లోనే ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అన్నారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ గెలవదని.. తమది తెలంగాణ అస్తిత్వ పార్టీ అని, వందశాతం మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సేనని ఆయన జోస్యం చెప్పారు. బుధవారం తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ముఖ్యనేతలు హరీశ్‌రావు, కల్వకుంట్ల కవిత, మధుసూదనాచారి, నిరంజన్ రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, పార్టీ రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులు, ఇతరనేతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసంగించిన కేసీఆర్.. ప్రస్తుత సీఎంపై ఇంత త్వరగా ప్రజల్లో వ్యతిరేకత వస్తుందనుకోలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర ఆదాయం ఏటా పెరిగిందన్న ఆయన.. అదే అధికారులున్నా కూడా కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ఆదాయం పూర్తిగా తగ్గిపోవడం బాధాకరమన్నారు. అధికారులతో పనిచేయించుకోలేని స్థితిలో ముఖ్యమంత్రి ఉన్నారని.. రాష్ట్ర ఆదాయం పడిపోవడంలో రేవంత్ అసమర్థతను అంతా గమనిస్తున్నారని

మిగతా 12వ పేజీలో...

పౌల్ట్రీ రంగం పట్టి

బర్డ్‌ఫ్లూతో పడిపోయిన చికెన్, గుడ్ల అమ్మకాలు

దిక్కుతోచని స్థితిలో పౌల్ట్రీ రైతులు

నెలలో 500 కోట్లకు పైగా నష్టం

దళారులు మాత్రం లాభాల్లోనే..

కోడి కిలో 90కి కొని.. చికెన్ 160కి

గుడ్డు 3.50కు కొని.. 6కు విక్రయం

అమెరికాలో గుడ్లకు కొరత..

డజను గుడ్లు 6.5 డాలర్లు

దుకాణాల ముందు బారులు తీరుతున్న జనం 3

పెన్సిల్వేనియాలో లక్ష గుడ్ల దోపిడీ



మదనాపురం మండలంలోని ఓ పౌల్ట్రీ ఫామ్‌లో చనిపోయిన కోళ్లు

వనపర్తి జిల్లాలో 4 వేల కోళ్లు మృతి

బర్డ్ ఫ్లూ కాదు.. కొక్కెర వ్యాధి కావొచ్చు

వనపర్తి పశుసంవర్ధక అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి



రాజలింగమూర్తి (ఫైల్)

సామాజిక కార్యకర్త దారుణ హత్య

రాత్రి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళుతుండగా ఘటన 12

భూపాలపల్లిలో దారుణం.. దాడిలో ఐదారుగురు దుండగులు?

మేడిగడ్డ కుంగిన ఘటనపై కేసీఆర్, హరీశ్‌పై గతంలో జిల్లా కోర్టులో పిటిషన్ వేసిన రాజలింగమూర్తి.. పలు భూ ఆక్రమణలపైనా కేసులు

డుమ్మా డాక్టర్లకు చెక్

1,869 ఆస్పత్రుల్లో బయోమెట్రిక్ హాజరు

డీహెచ్, టీవీవీపీ, ఆయుష్ ఆస్పత్రుల్లో అమలు

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా

టీజీటీఎస్ సహకారంతో యాప్‌నకు నిర్ణయం



[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విధులకు డుమ్మా కొట్టే డాక్టర్లు, వైద్య సిబ్బంది విషయంలో కఠినంగా వ్యవహరించాలని సర్కారు భావిస్తోంది. ఆ దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా 1,869 ఆస్పత్రుల్లో ముఖ గుర్తింపు(బయోమెట్రిక్) హాజరు విధానాన్ని అమలు పరిచేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే వైద్య కళాశాలల్లో ఆధార్ ఎనేబుల్డ్ బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్(అబాస్) విధానాన్ని జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) అమలు చేస్తోంది. సరిగ్గా అదే విధానాన్ని మిగతా ఆస్పత్రుల్లోనూ అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. ప్రజారోగ్య సంచాలకుల

మిగతా 14వ పేజీలో...

21 ఏళ్లుగా ఊపిరితిత్తుల్లో పెన్ను క్యాప్!

కొన్నాళ్లుగా దగ్గు, బరువు తగ్గుదల

రోగి సీటీ స్కాన్ రిపోర్టు చూసి కణితిగా భావించిన వైద్యులు 14

కిమ్స్‌లో శస్త్రచికిత్స చేసి తొలగింపు

భాగ్యనగరికి ప్రపంచమంత అందం 2

మిస్ వరల్డ్-2025 పోటీలకు ఆతిథ్యం

రాష్ట్రానికి తొలిసారి దక్కిన అవకాశం

మే7-31 దాకా హైదరాబాద్‌లో పోటీలు

ఢిల్లీ సీఎం రేఖా గుప్తా

నేడు రామ్‌లీలా మైదానంలో ప్రమాణం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి19: ఢిల్లీ కొత్త సీఎం ఎవరనే ఉత్కంఠ వీడింది. ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా(50) ఎంపిక య్యారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె షాలిమార్ బాగ్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన శాస నసభాపక్ష సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యేలు రేఖా గుప్తను తమ నాయకురాలిగా ఎన్నుకున్నారు. ఈ సమావే శానికి బీజేపీ అధిష్ఠానం ప్రతినిధులుగా మాజీ కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్, బీజేపీ కార్య దర్శి ఓం ప్రకాశ్ ధన్‌కర్ హాజరయ్యారు. సీఎం రేసులో ముందున్నారని ప్రచారం జరిగిన పర్వేశ్ వర్మ, విజేంద్ర గుప్త ఆమె పేరును శాసనసభాపక్ష నాయకురాలిగా ప్రతిపాదించారు. ఆ వెంటనే ఎమ్మెల్యేలంతా అంగీకరిం చారు. అనంతరం రేఖా గుప్త ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఏర్పాటుకు సక్సేనా ఆమెను ఆహ్వానించారు. గురువారం మధ్యాహ్నం ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనుంది. దీనికి ప్రధాని మోదీ, బీజేపీ, ఎన్డీయే పాలిత సీఎంలు, డిప్యూటీ సీఎంలు హాజరుకానున్నారు. ప్రమాణ స్వీకారం కోసం ఢిల్లీలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.



ఢిల్లీ నాలుగో మహిళా సీఎం

రేఖా గుప్తా ఢిల్లీకి నాలుగో మహిళా ముఖ్య మంత్రిగా సేవలు అందించనున్నారు. గతంలో బీజేపీ నుంచి సుష్మా స్వరాజ్, కాంగ్రెస్ తరఫున షీలాదీక్షిత్, ఆమ్ ఆద్మీ నుంచి అతిశీ ముఖ్య మంత్రులుగా పనిచేశారు. నాలుగో మహిళా ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

తొలిసారి ఎమ్మెల్యేకు అదృష్టం

1974 జులై 19న హర్యానాలోని జుల్నాలో రేఖా గుప్త జన్మించారు. ఆ తర్వాత రెండేళ్లకే ఆమె తండ్రి ఉద్యోగరీత్యా ఢిల్లీకి వచ్చారు. దీంతో ఆమె విద్యాభ్యాసమంతా ఢిల్లీలోనే సాగింది. 1992లో దౌలత్ రామ్ కాలేజీలో ఏబీవీపీలో చురుకైన పాత్ర పోషించారు. న్యాయ వాద విద్యనభ్యసించారు. 1996-97లో ఏబీవీపీ తరఫున ఢిల్లీ యూనివర్సిటీ స్టూడెంట్స్ అధ్యక్షురాలిగా గెలిచారు. ఢిల్లీ పితంపురా కౌన్సిలర్‌గా గెలిచి, ఆ తర్వాత మేయర్‌గా పని చేశారు. 2015, 2020 ఎన్నికల్లో షాలీమార్ బాగ్‌లో బీజేపీ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజా ఎన్నికల్లో 29,595 ఓట్ల తేడాతో ఆప్ అభ్యర్థి వందనపై తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు.

లోకం తీరు



సినిమాకు వెళ్తే యాడ్స్‌తో వేధించారు!

- వినియోగదారుల కోర్టును ఆశ్రయించిన ప్రేక్షకుడు
- పీవీఆర్ సినిమాస్, ఐనాక్స్, బుక్‌మైషోకు జరిమానా

బెంగళూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సినిమా చూసేందుకు థియేటర్‌కు వెళితే సుదీర్ఘ వాణిజ్య ప్రకటనతో తన విలువైన సమయాన్ని వృథా చేశారని, అందువల్ల థియేటర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బెంగుళూరులో ఓ ప్రేక్షకుడు వినియోగదారుల కోర్టును ఆశ్రయించాడు. 25 నిమిషాలకుపైగా సమయం వృథా కావడంతో ఇతర ముఖ్యమైన కార్యక్రమాలకు హాజరు కాలేకపోయానని, దీనితో తనకు మానసిక వేదన కలిగిందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇటీవల పిటిషన్‌ను విచారించిన కోర్టు.. సమయాన్ని కూడా డబ్బు అంత విలువైనదిగా భావించాలని పేర్కొంది. ఇతరుల విలువైన సమయంతో లబ్ధిపొందే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేసింది. ప్రేక్షకుడికి రూ. 65 వేల పరిహారంగా చెల్లించాలని బెంగళూరులోని పీవీఆర్, ఐనాక్స్ థియేటర్లు, బుక్‌మైషోకు జరిమానా విధించింది. 2023లో 'శ్యామ్ బహద్దూర్' అనే సినిమా చూడటానికి అభిషేక్ అనే ప్రేక్షకుడు 3 టికెట్లు బుక్ చేశాడు. అయితే 4.05 గంటల సినిమా ప్రారంభమవుతుందని ప్రకటించినా.. 4.30 వరకు యాడ్స్ కొనసాగించారు.

పరిమితికి మించి టికెట్లు ఎందుకు అమ్మారు?

- ఢిల్లీ తొక్కిసలాట ఘటనపై కోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: కుంభమేళాకు వెళ్లే ప్రయాణికులు పోటెత్తడంతో ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రిజర్వేషన్ టికెట్లను కూడా పరిమితికి మించి టికెట్లు ఎందుకు విక్రయించారని ప్రశ్నించింది. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలను నివారించేందుకు భద్రత చర్యలు, రైలు బోగీల్లో ప్రయాణికుల సంఖ్యను పరిమితం చేసే నిబంధనల అమలు కోరుతూ దాఖలైన పిల్‌పై బుధవారం కోర్టు విచారణ చేపట్టింది. ప్రయాణికులకు జారీ చేసే టికెట్ల సంఖ్యకు సీట్ల సంఖ్యకు ఎందుకు వ్యత్యాసం ఉంటోందని అటు కేంద్రాన్ని, ఇటు రైల్వే శాఖను ధర్మాసనం ప్రశ్నించింది. కేసు విచారణను మార్చి 26కు వాయిదా వేసింది.

ప్రైవేటు అంతరిక్ష సంస్థల కోసం రూ.500కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థలు అభివృద్ధి చేసిన ప్రారంభ దశ సాంకేతికతలను వాణిజ్యపరమైన లాభదాయక ఉత్పత్తులుగా మార్చడానికి ఆర్థిక చేయూతను అందిస్తామని భారత అంతరిక్ష ప్రోత్సాహక సంస్థ 'ఇన్‌స్పేస్' ప్రకటించింది. దీని కోసం రూ.500 కోట్లతో నిధి(టీఏఎఫ్-టెక్నికల్ అడాప్షన్ ఫండ్)ని ఏర్పాటు చేసింది. అంతరిక్ష రంగంలో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, దేశీయ కంపెనీలు అంతరిక్ష సాంకేతికతలను అభివృద్ధి చేసేలా ప్రోత్సహించడం ఈ నిధి ఏర్పాటు లక్ష్యమని ఇన్‌స్పేస్ బుధవారం వెల్లడించింది. 'స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలకు ప్రాజెక్టు వ్యయంలో 60% వరకు, భారీ పరిశ్రమలకు ప్రాజెక్టు వ్యయంలో 40% వరకు టీఏఎఫ్ నుంచి అందిస్తాం. ఒక్కో ప్రాజెక్టుకు గరిష్ఠంగా రూ.25 కోట్ల వరకు ఇస్తాం' అని ఇన్‌స్పేస్ ఛైర్మన్ పవన్ చెప్పారు.

బ్యాంక్ ఆఫ్ బరోడాలో 4వేల అప్రెంటిస్ ఖాళీలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: దేశంలోని ప్రముఖ బ్యాంకులైన బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలు అప్రెంటిస్ ఉద్యోగాల కోసం విడివిడిగా నోటిఫికేషన్‌లు విడుదల చేశాయి. 2025 ఫిబ్రవరి 1వ తేదీ నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్య వయసు ఉండి, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారే ఈ ఉద్యోగాలకు అర్హులు. యూనియన్ బ్యాంకులో మొత్తం 2,691 అప్రెంటిస్ ఖాళీలు ఉండగా, వీటిలో తెలంగాణలో 304, ఆంధ్రప్రదేశ్‌లో 549 ఖాళీలు ఉన్నాయి. మార్చి 5వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశమిచ్చారు. మరోవైపు బ్యాంక్ ఆఫ్ బరోడాలో 4,000 అప్రెంటిస్ ఖాళీలు ఉండగా, ఇందులో తెలంగాణలో 193, ఆంధ్రప్రదేశ్‌లో 59 ఖాళీలు ఉన్నాయి. ఈ పోస్టుల్లో చేరాలనుకునే అభ్యర్థులు నేషనల్ అప్రెంటిస్ ట్రైనింగ్ స్కీమ్‌లో తప్పని సరిగా రిజిస్టరై ఉండాలి. అర్హులైన ఆసక్తి కలిగిన అభ్యర్థులు మార్చి 11వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మరోవైపు, రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న మరో 518 పోస్టుల భర్తీకి కూడా బ్యాంక్ బరోడా నోటిఫికేషన్ ఇచ్చింది. వీటిలో సీనియర్ మేనేజర్ మొదలుకొని నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్ వరకు పలు పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టులకు మార్చి 11వ తేదీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. కాగా, సివిల్ సర్వీసెస్ పరీక్ష దరఖాస్తుల గడువును యూపీఎస్సీ శుక్రవారం వరకు పొడిగించింది.

రేపిస్టుకు ఉరిశిక్ష రద్దు.. బయటకు వచ్చి మళ్లీ రేప్

భోపాల్, ఫిబ్రవరి 19: చిన్నారులపై వరుస అత్యాచారాలకు పాల్పడుతున్న ఓ మృగాడిని న్యాయ వ్యవస్థ కఠినంగా శిక్షించకపోవడమే పాపమైంది.. అరెస్టయిన కొంతకాలానికి జైలు నుంచి బయటికి రావడం.. మరో అకృత్యానికి పాల్పడటం అతడికి పరిపాటిగా మారింది. చివరిసారి కింది కోర్టు విధించిన ఉరిశిక్షను హైకోర్టు రద్దు చేయడంతో బయటికొచ్చిన ఆ ఉన్మాది తాజాగా మరో బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు.. మధ్యప్రదేశ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. దబ్రిపురకు చెందిన రమేశ్ సింగ్ ఓ సీరియల్ రేపిస్ట్. 2003లో ఐదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. కోర్టు అతడికి పదేళ్ల జైలు శిక్ష విధించింది. శిక్ష అనంతరం బయటికొచ్చిన అతడు 2014లో 8 ఏళ్ల బాలికపై అకృత్యానికి ఒడిగట్టాడు. దీంతో కోర్టు అతడికి ఉరిశిక్ష విధించింది. అయితే 2019లో సాంకేతిక కారణాలతో హైకోర్టు అతడి ఉరిశిక్షను రద్దు చేసింది. మళ్లీ బయటకు వచ్చిన రమేశ్ మరో బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. కాగా, నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

సింగపూర్‌లో ఇళ్లల్లో కిచెన్‌లు ఉండవు

భారత్‌లో అలా చేస్తే రెస్టారెంట్లకు మేలు: నిఖిల్ కామత్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: "ఇటీవల సింగపూర్ వెళ్లినప్పుడు అక్కడ నేను కలిసినవారిలో చాలా మంది.. తాము అసలు ఇంట్లో వంట చేసుకోవట్లేదని చెప్పారు. కొంతమంది అయితే అసలు తమ ఇంట్లో వంటగదే లేదన్నారు" అని జెరోధా సహవ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ 'ఎక్స్'లో ఒక ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు. భవిష్యత్తులో.. ఆర్థిక పరిస్థితులు మారి, భారతదేశం కూడా ఈ ట్రెండ్‌ను అందిపుచ్చుకుంటే ఎలా ఉంటుందని ప్రశ్నించారు. అదే జరిగితే మాత్రం భారత్‌లో రెస్టారెంట్ల వ్యాపారం గణనీయంగా వృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతానికి మాత్రం.. ఆగ్నేయాసియా దేశాలతో పోలిస్తే మనదేశంలో అతి పెద్ద రెస్టారెంట్ బ్రాండ్లు చాలా తక్కువని గుర్తుచేశారు. అమెరికాలో వ్యవస్థీకృత ఆహార వ్యాపారం 55 శాతంగా ఉండగా.. భారతదేశంలో అది 30 శాతమేనని గుర్తుచేశారు.

నాతో వాదనలా!

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఈ నెల 13వ తేదీన మోదీతో భేటీకి ముందు ట్రంప్.. పరస్పర పన్నుల (రెసిప్రోకల్ టారిఫ్స్) గురించి ప్రకటించిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం.. తమ ఉత్పత్తులపై ఒక దేశం ఎంత సుంకం విధిస్తే ఆ దేశం ఉత్పత్తులపై అమెరికా కూడా అంతే సుంకం విధిస్తుంది. ప్రస్తుతం అమెరికాకు చెందిన వాహనాలు తదితర ఉత్పత్తుల మీద భారత్ అధిక పన్నులు వేస్తుండగా, భారత ఉత్పత్తుల మీద అమెరికా ఆ స్థాయిలో విధించటం లేదు. మోదీతో జరిగిన సమావేశంలో దీని గురించి ప్రత్యేకంగా ప్రస్తావించానని ట్రంప్ తాజాగా ఫాక్స్ ఇంటర్వ్యూలో వెల్లడించారు. 'మీరు మా మీద ఎంత పన్ను వేస్తే మేం మీ మీద అంతే పన్ను వేస్తాం అని మోదీకి స్పష్టంగా చెప్పా. దానికి మోదీ స్పందిస్తూ.. అది తనకు ఇష్టం లేదన్నారు. అయినప్పటికీ, నేను మళ్లీ అదే విషయాన్ని పునరుద్ఘాటించా. భారత్‌తోనే కాదు, ప్రతీ దేశంతోనూ ఇకపై మా వ్యవహారం ఇలాగే ఉంటుందని ఆయనకు స్పష్టం చేశా' అని తెలిపారు. పరస్పర పన్నుల గురించి తనతో ఎవరూ వాదించటానికి వీల్లేదని, ఇలా పన్నులు వేస్తేనే ఆయా దేశాలు అమెరికా మీద భారీ సుంకాలు విధించటం ఆపుతాయని ట్రంప్ చెప్పారు. భారత్‌లో జరిగే ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచటానికి ఉద్దేశించిన 2.1 కోట్ల డాలర్ల (రూ.182 కోట్లు) నిధుల్ని ఇటీవల అమెరికా నిలిపివేయటంపై స్పందిస్తూ.. 'భారత్ వద్ద బోలెడంత డబ్బు ఉంది. మనం ఆ దేశానికి 2.1 కోట్ల డాలర్లు ఎందుకివ్వాలి? మన మీద అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటి. అందువల్లే ఆ దేశ మార్కెట్లోకి దాదాపుగా వెళ్లలేకపోతున్నాం. నాకు భారత్ అన్నా, ఆ దేశ ప్రధాని అన్నా చాలా గౌరవం. కానీ, ఆ దేశంలో ఓటింగ్ శాతం పెంచటానికి మనం డబ్బులు ఎందుకివ్వాలి? అమెరికాలో ఓటింగ్ శాతం పరిస్థితి ఏమిటి?' అని వ్యాఖ్యానించారు. ఎలాన్ మస్క్ సారథ్యంలోని 'అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ' (డోజ్) భారత్‌లో ఓటింగ్‌శాతం పెంపునకు ఉద్దేశించిన 2.1 కోట్ల డాలర్ల నిధులను ఇటీవల నిలిపివేసింది. ఈ నిర్ణయాన్ని ట్రంప్ తాజాగా మరోసారి సమర్థించారు.

అక్కడ మీరు ఫ్యాక్టరీ పెట్టొద్దు

అమెరికా వాహనాలపై భారత్ 100% సుంకం విధిస్తున్నదంటూ ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అన్ని దేశాలూ అధిక సుంకాలు మోపుతూ అమెరికాతో అన్యాయంగానే వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. ఇదే ఇంటర్వ్యూలో తనతో పాటు పాల్గొంటున్న టెస్లా కంపెనీ అధిపతి ఎలాన్ మస్క్‌ను చూపిస్తూ.. భారత్‌లో ఈయన టెస్లా ఫ్యాక్టరీ పెడితే అది అమెరికాకు అన్యాయం చేసినట్లే అవుతుందని ట్రంప్ వ్యాఖ్యానించారు. కాగా, భారత్‌లో తాము కార్ల తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయబోమని, బెర్లిన్‌లో ఉన్న తమ ఫ్యాక్టరీ నుంచే 25 వేల డాలర్లలోపు (రూ.21.72 లక్షలు) ఈవీలను భారత్‌కు సరఫరా చేస్తామని టెస్లా కంపెనీ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు, అక్రమ వలసదారుల పట్ల తామెంత కఠినంగా వ్యవహరిస్తామో ప్రపంచానికి తెలుపుతూ వైట్ హౌస్ ఓ వీడియోను విడుదల చేసింది. 42 సెకన్ల నిడివి గల ఆ వీడియోను



సామాజిక మాధ్యమాల్లో మంగళవారం పోస్టు చేసింది. విమానం ఎక్కించే ముందు వలసదారుల కాళ్లకు గొలుసులు వేసే దృశ్యాలు అందులో ఉన్నాయి. అలాగే వారి చేతులకు వేయడానికి సంకెళ్లను సిద్ధం చేస్తున్నట్లు వీడియోలో కనిపిస్తోంది. అయితే విమానం ఎక్కుతున్న వలసదారుల ముఖాలు మాత్రం వీడియోలో కనిపించలేదు. అమెరికాలోకి అక్రమంగా వచ్చే వారికి హెచ్చరికగానే వైట్‌హౌస్ ఈ వీడియోను విడుదల చేసినట్లు తెలుస్తోంది. కాగా, మస్క్ ఈ వీడియోను రీపోస్టు చేస్తూ 'వావ్' అని క్యాప్షన్ పెట్టారు.

నా దేశం అమ్మకానికి లేదు



తన దేశం అమ్మకానికి లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని మొదట్లోనే చర్చలతో నిలిపివేయాల్సిందని, ఉక్రెయిన్ తీరుతోనే ఈ యుద్ధం మొదలైందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై జెలెన్‌స్కీ తీవ్రంగా స్పందించారు. "ఉక్రెయిన్-రష్యా యుద్ధం మొదలయ్యాక అమెరికా సాయం చేసింది. 67 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను సరఫరా చేసింది. 31.5 బిలియన్ డాలర్ల ఆర్థికసాయం చేసింది. అయితే.. ఇప్పుడు అమెరికా మా దేశంలోని 500 బిలియన్ డాలర్ల విలువైన వనరులను ధారాదత్తం చేయాలని కోరుతోంది. మా దేశం అమ్మకానికి లేదు" అని తీవ్రంగా వ్యాఖ్యానించారు. ట్రంప్ తన చుట్టూ ఉన్న తప్పుడు సమాచారంలో కూరుకుపోయారని జెలెన్‌స్కీ ఎద్దేవా చేశారు. "నన్ను ఉక్రెయిన్ అధ్యక్ష పదవి నుంచి దింపేయాలని ప్రయత్నిస్తున్నారు. ఆ ప్రయత్నం విఫలమవుతుంది. నా ప్రజామోదం 4% మాత్రమేనని ట్రంప్ అంటున్నారు. అది రష్యా నుంచి వచ్చిన తప్పుడు సమాచారమే" అంటూ మండిపడ్డారు. కీవ్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషియాలజీ విడుదల చేసిన సర్వే నివేదికలో తనకు 57% మేర ప్రజామోదం ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. ట్రంప్ వాస్తవాలను తెలుసుకోవాలన్నారు.

ఫిబ్రవరి 24న పీఎం కిసాన్ నిధులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: రైతులకు వ్యవసాయంలో పెట్టుబడి సాయం అందించే ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం అమలు చేస్తోన్న పీఎం కిసాన్ పథకం.. 19వ విడత నిధుల విడుదలకు తేదీ ఖరారైంది. ఈ నెల 24న రూ. 2వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. బిహార్‌లోని భాగల్పూర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. 19వ విడతలో 9.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం కలగనున్నట్లు వారు తెలిపారు. పీఎం కిసాన్ నిధులు అందుకోవాలంటే అర్హులైన రైతులు ఎన్‌పీసీఐ, ఆధార్‌తో అనుసంధానించిన బ్యాంకు ఖాతాను కలిగి ఉండాలి. అలాగే ఈ-కేవైసీ పూర్తిచేసి ఉండాలి. కేంద్రప్రభుత్వం 2018 నుంచి పీఎం కిసాన్ పథకాన్ని అమలు చేస్తోంది.

ప్రీమియం చెల్లింపులు ఇక ఈజీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: పాలసీదారుల కోసం జీవిత బీమా, ఆరోగ్య బీమా ప్రీమియం చెల్లింపుల ప్రక్రియను సులభతరం చేసేందుకు ఐఆర్‌డీఏఐ కొత్త చెల్లింపుల విధానాన్ని ప్రవేశపెట్టింది. అదే బీమా-ఏఎస్‌బీఏ (అప్లికేషన్ సపోర్టెడ్ బై బ్లాక్‌డ్ అమౌంట్). ఇది ప్రీమియం చెల్లింపులకు అవసరమైన మొత్తాన్ని యూపీఐ ద్వారా పాలసీదారుల ఖాతాల్లో బ్లాక్ చేయడానికి సహాయపడుతుంది. పాలసీ జారీ అయ్యేంత వరకు ప్రీమియం నిధులు ఖాతాలోనే ఉంటాయి. మార్చి 1వ తేదీ నుంచి ఇది అమల్లోకి రానుంది. ఒకసారి ఖాతాల్లో ప్రీమియం నిధులు బ్లాక్ అయ్యాక పాలసీ జారీ అయిన తర్వాతే నిధులు ఖాతా నుంచి డెబిట్ అవుతాయి. గడువులోగా బీమా ప్రతిపాదనకు ఆమోదం లభించకపోతే ప్రీమియం నిధులు అన్‌బ్లాక్ అవుతాయి. కాగా, బ్లాక్ చేసిన మొత్తంపై వడ్డీ కూడా వస్తుంది.

ముడా కేసులో సిద్ధూకు బిగ్ రిలీఫ్?



బెంగళూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర రాజకీయాలలో తీవ్ర కలకలం రేపిన ముడా ఇంటి స్థలాల వివాదంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఆయన భార్య పార్వతికి భారీ ఊరట లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేసును దర్యాప్తు చేస్తున్న లోకాయుక్త పోలీసులు.. కోర్టుకు బి రిపోర్టు సమర్పించేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఫిర్యాదిదారుడు, సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణకు బుధవారం నోటీసు ఇచ్చారు. సాక్ష్యాధారాల కొరత ఉందని, ఆరోపణలకు తగిన రుజువులు లేవని అందులో పేర్కొన్నారు. ఏ1 నుంచి ఏ4 నిందితుల వరకూ అందరినీ విచారించామని లోకాయుక్త ఎస్పీ ఉదేశ్ నోటీసులో పేర్కొన్నారు. ఇది సివిల్ వ్యాజ్యమని, దర్యాప్తు చేయాల్సిన అవసరం లేదని, పలు ఆరోపణలకు సాక్ష్యాలు లేవని నోటీసులో ప్రస్తావించారు. సీఎం సిద్దరామయ్య భార్యకు 2016 నుంచి 2024 వరకు 50:50 నిష్పత్తిలో ముడా పరిహారంగా ఇచ్చిన ఇంటి స్థలాలపై వచ్చిన ఆరోపణల గురించి దర్యాప్తు నివేదికను కోర్టుకు లోకాయుక్త సమర్పిస్తోందని పేర్కొన్నారు. నోటీసు అందుకున్న వారంలోగా అభ్యంతరాలు ఏమైనా ఉంటే మెజిస్ట్రేట్ ఎదుట చెప్పవచ్చునని సూచించారు.

సీఈసీగా బాధ్యతలు స్వీకరించిన జ్ఞానేశ్ కుమార్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: కేంద్ర ఎన్నికల సంఘం 26వ ప్రధాన కమిషనర్‌గా నియమితులైన జ్ఞానేశ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతి నిర్మాణంలో ఓటు వేయడం అనేది తొలి అడుగు అని చెప్పారు. 18 ఏళ్లు దాటిన ప్రతి పౌరుడు ఓటరుగా మారి ఓటుహక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం ఎల్లప్పుడూ ఓటర్లకు అండగా ఉంటుందన్నారు. మరోవైపు ఎన్నికల కమిషనర్‌గా వివేక్ జోషి కూడా పదవీ బాధ్యతలు స్వీకరించారు. మరోవైపు, ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం-2023 ప్రకారం సీఈసీ, ఈసీ నియామకాలపై దాఖలైన పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. హోలీ పండుగ తర్వాత చూస్తామని తెలిపింది.

స్నానాలకే కాదు.. తాగడానికీ అనుకూలమే

త్రివేణీ సంగమ జలాలపై యూపీ సీఎం యోగి స్పష్టీకరణ

లఖ్‌నవూ/ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 19: ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణీ సంగమం వద్ద నదిలో నీరు కలుషితమైందని సాగుతున్న ప్రచారాన్ని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఖండించారు. బుధవారం ఆయన యూపీ అసెంబ్లీలో మాట్లాడుతూ కుంభమేళా గొప్పతనాన్ని పునరుద్ఘాటించారు. సనాతన ధర్మం, గంగానది, భారతదేశం, మహా కుంభమేళాపై నిరాధార ఆరోపణలు చేస్తూ, నకిలీ వీడియోలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇది ప్రయాగ్‌రాజ్‌లో పుణ్యస్నానాలు చేసిన 56.25 కోట్ల మంది ప్రజల విశ్వాసాలతో ఆడుకోవడమే అన్నారు. త్రివేణీ సంగమంలోని నీరు స్నానాలు చేయడానికే కాదు తాగడానికి కూడా పనికొస్తుందని స్పష్టం చేశారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ఫీకల్ బ్యాక్టీరియా నివేదిక తర్వాత కుంభమేళాను కించపరిచేలా అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. నీటి నాణ్యతపై యూపీ పీసీబీ నిరంతరం పర్యవేక్షిస్తోందని చెప్పారు. బుధవారం నివేదికల ప్రకారం సంగమం వద్ద నీటిలో బీవోడీ పరిమాణం 3 కంటే తక్కువగానే ఉందని, డిజాల్వ్‌డ్ ఆక్సిజన్ (డీవో) 8 నుంచి 9 వరకూ నమోదైందని యోగి వివరించారు. దీనిప్రకారం సంగమంలోని నీరు స్నానాలకే కాదు ఆచమనానికి కూడా అనుకూలమేనని స్పష్టం చేశారు. మహాకుంభమేళాలో ఇంకా ఏడు రోజులు మిగిలి ఉన్నాయని, బుధవారం మధ్యాహ్నం వరకూ 56.25 కోట్ల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని సీఎం ప్రకటించారు. తొక్కిసలాట మృతుల కుటుంబాలకు, రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందినవారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. దీన్ని కూడా రాజకీయం చేయడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్, ఎస్పీ, ఆర్‌జేడీ, టీఎంసీ నేతలు బాధ్యతారాహిత్యంగా వ్యాఖ్యలు చేస్తున్నారని, సనాతన ధర్మానికి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించడం నేరమైతే తమ ప్రభుత్వం ఆ నేరాన్ని చేస్తూనే ఉంటుందని యోగి స్పష్టం చేశారు.

కుంభమేళాతో 3లక్షల కోట్ల వ్యాపారం

ప్రయాగ్‌రాజ్‌లో రూ.3లక్షల కోట్ల వ్యాపారాన్ని సృష్టించడం ద్వారా మహా కుంభమేళా దేశంలోనే అతిపెద్ద ఆర్థిక కార్యక్రమాల్లో ఒకటిగా మారిందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (కాయిట్) సెక్రటరీ జనరల్, ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ అన్నారు. కుంభ్ ప్రారంభానికి ముందు 40కోట్ల మంది ప్రజలు వస్తారని, సుమారు రూ.2లక్షల కోట్ల లావాదేవీలు సాగుతాయని ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. ఇప్పటికీ వెల్లువలా తరలివస్తున్న భక్తులను చూస్తుంటే ఈ నెల 26న కుంభమేళా చివరిరోజు నాటికి వీరి సంఖ్య 60 కోట్లు దాటుతుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయాగ్‌రాజ్‌తో పాటు దానికి 150 కిలోమీటర్ల పరిధిలో ఉన్న పట్టణాలు, నగరాల్లో కూడా గణనీయమైన వ్యాపారాభివృద్ధి జరిగిందని తెలిపారు.



ఖైదీలకూ కుంభ్ స్నానం

కుంభమేళాలో పవిత్ర స్నానాలు చేయాలని భావించే ఖైదీల కోసం యూపీ ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 75 జైళ్లలోని 90వేల మందికి పైగా ఖైదీలకు సంగమ జలాలతో స్నానం చేసే అవకాశం కల్పించనున్నట్లు జైళ్ల శాఖ మంత్రి దారా సింగ్ చౌహాన్ కార్యాలయం ప్రకటించింది. సంగమ ప్రాంతంలోని పవిత్ర జలాలను తీసుకొచ్చి జైళ్లలోని ట్యాంకర్లలో ఉన్న నీటిలో కలుపుతామని, ఆ నీటితో ఖైదీలు స్నానాలు చేయడంతో పాటు పూజా క్రతువులు కూడా నిర్వహించుకొనే అవకాశం కల్పిస్తామని అధికారులు చెప్పారు.

12ఏళ్ల నుంచి ఏం చేస్తున్నారు?: అవిముక్తేశ్వరానంద

ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ్.. 'మృత్యుకుంభ్'గా మారుతోందంటూ వ్యాఖ్యానించిన పశ్చిమ బెంగాల్ సీఎం మమతకు ఉత్తరాఖండ్‌లోని జ్యోతిష్ పీఠ్ 46వ శంకరాచార్య అవిముక్తేశ్వరానంద సరస్వతి మద్దతు పలికారు. కుంభమేళా నిర్వాహకులు సరైన రద్దీ నియంత్రణ చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. '300 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. ఇది నిర్వహణ వైఫల్యం కాకపోతే మరేంటి? ప్రజలు తమ సామాన్లు మోసుకుంటూ 25-30 కిలోమీటర్లు నడవాల్సి వచ్చింది' అని ఆయన ఆరోపించారు. '12ఏళ్ల తర్వాత కుంభమేళా వస్తుందని మీకు 12 ఏళ్ల క్రితమే తెలుసు. అయినా ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోలేదు' అని నిలదీశారు. తొక్కిసలాటలో భక్తులు మరణిస్తే దాన్ని కూడా దాచడానికి చూడటం తీవ్రమైన నేరమని అవిముక్తేశ్వరానంద ఆగ్రహం వ్యక్తం చేశారు.

భాగ్యనగరికి ప్రపంచమంత అందం

మిస్ వరల్డ్ పోటీలకు తెలంగాణ ఆతిథ్యం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ప్రతిష్ఠాత్మక సదస్సులు, కార్యక్రమాలకు ఆతిథ్యమిచ్చి అంతర్జాతీయ ఖ్యాతి గడించిన రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కీర్తి సిగలో మరో కలికితురాయి చేరనుంది. 120 దేశాలకు చెందిన అందాల భామలు ప్రపంచ సుందరిగా నిలవాలనే తమ కాంక్షను నెరవేర్చుకునేందుకు భాగ్యనగరికి రాబోతున్నారు. 72వ మిస్ వరల్డ్ పోటీలు హైదరాబాద్ వేదికగా జరగనున్నాయి. మిస్ వరల్డ్- 2025 పోటీలకు ఆతిథ్యమిచ్చే అరుదైన అవకాశం తెలంగాణకు దక్కింది. 72 ఏళ్లుగా జరుగుతున్న మిస్ వరల్డ్ పోటీలకు భారత్ ఆతిథ్యం ఇవ్వడం ఇది మూడోసారి కాగా.. హైదరాబాద్ వేదికగా జరగడం ఇదే ప్రథమం. భారత్‌లో తొలిసారిగా 1996లో బెంగళూరు వేదికగా మిస్ వరల్డ్ పోటీలు జరిగాయి. గత ఏడాది పోటీలను న్యూఢిల్లీ వేదికగా నిర్వహించారు. ఈ సారి మే 7వ తేదీ నుంచి మే 31 వరకు హైదరాబాద్ వేదికగా మిస్‌వరల్డ్-2025 పోటీలు నిర్వహిస్తున్నామని మిస్ వరల్డ్ లిమిటెడ్ ఛైర్‌పర్సన్, సీఈఓ జూలియా మోర్లే.. తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక, యువజన వ్యవహారాల శాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్‌తో కలిసి బుధవారం ప్రకటించారు. గొప్ప సంస్కృతి, సాంస్కృతిక సంపదకు నెలవైన తెలంగాణలో పోటీలు నిర్వహిస్తుండడం ఆనందంగా ఉందని తెలిపారు. కాగా, దాదాపు 120 దేశాల నుంచి ఎంపికైన యువతులు మిస్ వరల్డ్ టైటిల్ కోసం మే7న హైదరాబాద్ రానున్నారు. ప్రారంభోత్సవ, ముగింపు వేడుకలతో పాటు పలు పోటీలు హైదరాబాద్‌లోనే జరుగుతాయి. మే 31న జరిగే ఫైనల్‌లో మిస్ వరల్డ్-2025 టైటిల్ విజేతను ప్రకటిస్తారు.

కాంగ్రెస్‌లో జిల్లా కమిటీలకు పెద్దపీట!

ఎన్నికల ఫలితాల బాధ్యత రాష్ట్ర ఇన్‌చార్జులైన ఏఐసీసీ ఆఫీస్ బేరర్లదే: మల్లికార్జున్ ఖర్గే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: "బీజేపీని ఎదుర్కోవాలంటే.. మన జిల్లా స్థాయి కాంగ్రెస్ కమిటీ(డీసీసీ)లను బలోపేతం చేయాలి. సంస్థాగతంగా జిల్లా కమిటీలనే కేంద్రంగా మార్చాలి. ఎన్నికల ఫలితాలపై వాటినే జవాబుదారీగా చేయాలి" అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. డీసీసీలను బలోపేతం చేసేందుకు అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఏప్రిల్ 14న రిలే యాత్రలను ప్రారంభిస్తామని.. వచ్చే ఏడాది గణతంత్ర దినోత్సవం(జనవరి 26) వరకు వాటిని కొనసాగిస్తామన్నారు. బుధవారం ఢిల్లీలో పార్టీ ప్రధాన కార్యాలయమైన ఇందిరాభవన్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌చార్జులతో ఖర్గే సమావేశమయ్యారు. సుమారు ఏడు గంటలపాటు సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశంలో పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా పాల్గొన్నారు. కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నవారికే పదోన్నతుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని.. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు గట్టిగా నిలబడినవారికే పెద్ద పీట వేయాలని ఖర్గే తేల్చిచెప్పారు. కొద్ది రోజుల క్రితమే పార్టీలో భారీగా సంస్థాగత మార్పులు జరిపిన ఖర్గే.. పార్టీలో మరిన్ని మార్పులుంటాయని వెల్లడించారు. భవిష్యత్‌లో రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల ఫలితాలకు ఆ రాష్ట్రాలకు ఇన్‌చార్జులుగా ఉన్న ఏఐసీసీ ఆఫీసు బేరర్లనే జవాబుదారీ చేస్తామని స్పష్టంచేశారు. 'జైబాపు, జైభీమ్, జై సంవిధాన్' కార్యక్రమం మరో ఏడాది కొనసాగుతుందని.. ఇందులో భాగంగా పాదయాత్రలు, చర్చలు, వీధిమలుపు సమావేశాల వంటివి నిర్వహిస్తామని చెప్పారు. కాగా, అమెరికా నుంచి పంపేస్తున్న భారతీయులకు అవమానాలు జరక్కుండా నిరోధించడంలో ప్రధాని మోదీ విఫలమయ్యారని ఖర్గే అన్నారు.



ఏఐసీసీ కార్యదర్శులతో భేటీలో ఖర్గే, వేణుగోపాల్, రాహుల్

పౌల్ట్రీ రంగం పల్టీ!

బర్డ్‌ఫ్లూతో పడిపోయిన చికెన్, గుడ్ల అమ్మకాలు.. దిక్కుతోచని స్థితిలో పౌల్ట్రీ రైతులు

» నెలలో 500 కోట్లకు పైగా నష్టం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

చిల్లుగారె, రాగిముద్దతో చికెన్‌ను ఇష్టంగా తినేటోళ్లు.. లెగ్‌పీస్ లేనిదే ముద్ద దిగనోళ్లు.. చికెన్ ముక్క లేనిదే పెగ్గుతో చీర్స్ చెప్పడానికి ఇష్టపడనోళ్లు.. వారానికి రెండుమూడుసార్లయినా చికెన్ బిర్యానీ తినకుండా ఉండలేనోళ్లు.. కోడికూరతో పార్టీనోయి అని పిలిస్తే కాదనకుండా వెళ్లి ఓ పట్టుపట్టేటోళ్లు ఇప్పుడు చికెన్ పేరెత్తితేనే బాబోయ్ మాకొద్దు అంటున్నారు!! నోరూరించే కోడికూర ఇప్పుడు మాంసాహార ప్రియులకు రుచించడం లేదు. రాష్ట్రంలో చికెన్ అమ్మకాలు భారీగా పడిపోయాయి. కస్టమర్లు కన్నెత్తిచూడకపోవడంతో చికెన్ షాపులు బోసిపోతున్నాయి. దీనికి బర్డ్‌ఫ్లూ భయమే కారణం. ఏపీలో ఎక్కువగా, దేశంలో అక్కడక్కడ బర్డ్‌ఫ్లూతో కోళ్ల మృత్యువాతపడుతున్నా.. తెలంగాణలో ఆ ప్రభావం లేదు. కోడికూర తిన్నోళ్ల అస్వస్థతకు గురైనట్లు, ఆస్పత్రిపాలైనట్లు ఎక్కడా చిన్న ఘటన కూడా వెలుగుచూడలేదు. అయితే సామాజిక మాధ్యమాల్లో బర్డ్‌ఫ్లూపై లేనిపోని భయాలను సృష్టిస్తూ సాగుతున్న ప్రచారంతో ఎక్కువమంది చికెన్, గుడ్లు తినడం మానేశారు. ఫలితంగా కోళ్లు, గుడ్ల ధరలు బాగా పడిపోయా యి. దీంతో రాష్ట్రంలో పౌల్ట్రీరంగం తీవ్ర సంక్షోభంలో పడిపోయింది. రాష్ట్రంలో దాదాపు 8.5 కోట్లకుపైగా కోళ్లున్నాయి. ఇందులో బాయిలర్ కోళ్లు, లేయర్ కోళ్లు 4కోట్ల చొప్పున ఉన్నాయి. బర్డ్‌ఫ్లూ కారణగా అమ్మకాలు ఆందోళనకరరీతిలో పడిపోవడంతో కోళ్ల పెంపకందారులు దిక్కుతోచనిస్థితిలో పడిపోయారు. కొన్నిరోజుల కిందట లైవ్ కోడి కిలోధర రూ.180 పలికితే ఇప్పుడు రూ.90కి పడిపోయింది. రూ.5.50 చొప్పున అమ్ముడుపోయిన గుడ్లు ఇప్పుడు రూ.3.50కు పడిపోయాయి. కొత్తగా ఎవరూ కోళ్లపెంపకం చేపట్టడంలేదు. రాష్ట్రంలో రోజుకు రూ.10 లక్షల కిలోల చికెన్ అమ్మకాలు జరుగుతుంటాయి. ఇవి కాక బయట రాష్ట్రాలకు రోజుకు లక్షకుపైగా కోళ్ల ఎగుమతులు అవుతుంటాయి. లేయర్ కోళ్ల ద్వారా రోజుకు 4.2 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతాయి. ప్రస్తుతం పౌల్ట్రీ రంగం తీవ్ర సంక్షోభంలో పడటంతో రోజుకు రూ.15 కోట్లకుపైగానే నష్టం వాటిల్లుతోందని.. నెలరోజుల్లో రూ.500 కోట్ల మేర నష్టపోయామని కోళ్ల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోళ్ల విక్రయాలు పడిపోవడంతో ఆ ప్రభావం అనుబంధ రంగాలపైనా పడుతోంది. పౌల్ట్రీ రైతులు దాణా ఖర్చులు బాగా తగ్గించుకుంటున్నారు. ఫలితంగా మొక్కజొన్న, సోయాబీన్ అమ్మకాలు, ధరలూ తగ్గాయి. జనవరి మొదటి వారంలో కిలో రూ.28ల వరకు ఉన్న మొక్కజొన్న ఇపుడు రూ. 23కు, కిలో రూ.40లకుపైనే పలికిన సోయాబీన్ రూ.27కు పడిపోయింది.


వనపర్తి జిల్లాలో చనిపోయిన కోళ్లను పూడ్చివేసేందుకు ఎక్స్‌కవేటర్ బకెట్‌లో తీసుకెళ్తున్న దృశ్యం

అంత ఉష్ణోగ్రతలో వైరస్ బతకదు

60 డిగ్రీల వద్ద ఉడికిస్తే బర్డ్‌ఫ్లూ వైరస్ బతికి ఉండదు. సాధారణంగా మనం చికెన్‌ను 100 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలోనే ఉడికిస్తాం కాబట్టి చికెన్ నిరభ్యంతరంగా తినొచ్చు. వైరస్ కోళ్ల రెట్ట, వాటి ముక్కు నుంచి వచ్చే ద్రవం ద్వారా విస్తరిస్తుంది. మనుషులకు ఈ వైరస్ సోకడం చాల అరుదు. ఉడికించిన చికెన్ తినడం వల్ల ఇంత వరకు ఎవ్వరికి బర్డ్‌ఫ్లూ సోకలేదు.

- డాక్టర్ విజయకుమార్‌రెడ్డి,
రంగారెడ్డిజిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

దళారులు, వ్యాపారులు బాగానే ఉన్నారు

బర్డ్‌ఫ్లూ దెబ్బ కోళ్ల పెంపకందారులనే ఒడిదుడుకుల్లోకి నెట్టింది. దళారులు, వ్యాపారులు మాత్రం బాగానే ఉన్నారు. బర్డ్‌ఫ్లూ నెపంతో పౌల్ట్రీ రైతుల నుంచి కోళ్లను, గుడ్లను చాలా తక్కువ ధరకు కొని మార్కెట్లో లాభాలకు అమ్ముతున్నారు. అందుకే బహిరంగ మార్కెట్లో మాత్రం కోళ్లు, గుడ్ల ధరలపై పెద్దగా ప్రభావం పడటం లేదు. చికెన్‌ను కిలో. రూ.160 నుంచి రూ.180 వరకు, గుడ్లను రూ.6 చొప్పున విక్రయిస్తున్నారు. అంటే.. బర్డ్‌ఫ్లూ భయంతో తీవ్రంగా నష్టపోతోంది అటు పౌల్ట్రీ రైతులు, వినియోగదారులే. బయట రాష్ట్రాలకు ఎగుమతులనూ కట్టడి చేయడం కూడా పౌల్ట్రీ రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. బర్డ్‌ఫ్లూ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు కోళ్ల ఎగుమతి, దిగుమతులను పూర్తిగా ఆపేశారు. రాష్ట్ర సరిహద్దుల్లో ప్రత్యేకంగా 27 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. రాష్ట్రం నుంచి బెంగాల్, కర్ణాటక, మహారాష్ట్రకు కోళ్లు, గుడ్ల ఎగుమతులు ఎక్కువగా ఉంటాయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేక పౌల్ట్రీ రైతులు నష్టాల ఊబిలో మరింత కూరుకుపోయారు. కోళ్లు, గుడ్ల ఎగుమతులు, దిగుమతుల కోసం వినియోగించే వాహనాలను వేల సంఖ్యలో ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ఆ ప్రభావం పరోక్షంగా రవాణా రంగంపైనా పడుతోంది.

అనధికారికంగా వ్యాక్సిన్

బర్డ్‌ఫ్లూకు ఇప్పటి వరకు అధికారికంగా వ్యాక్సిన్ లేదని అధికారులు చెబుతున్నారు. అనధికారికంగా మార్కెట్‌లో అమ్ముతున్న మందులను రైతులు వాడుతున్నారు. కాగా, చికెన్ వండేటప్పుడు 60-70డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద ఉడికిస్తే ఎలాంటి ప్రమాదం ఉండదని అధికారులు చెబుతున్నారని రైతులు గుర్తుచేస్తున్నారు. అయితే సోషల్ మీడియాలో బర్డ్‌ఫ్లూపై లేనిపోని ప్రచారం కారణంగా తాము తీవ్రంగా నష్టపోతున్నామని, ఈ ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ కార్యదర్శి పాతూరి వెంకట్రావ్, రాష్ట్ర పౌల్ట్రీ అసోసియేషన్ ట్రెజరర్ వంగేటి అభిషేక్ రెడ్డి కోరారు. ప్రభుత్వం కూడా దీనిపై చొరవ తీసుకుని ప్రజలను చైతన్యం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అమెరికాలోనేమో సీన్ రివర్స్

అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం చీనోలో కి.మీపైగానే వాహనాలు వరుస కట్టాయి. ఎందుకు? అనంటే కోడిగుడ్ల కోసమే! మనదేశంలో బర్డ్‌ఫ్లూ భయంతో కోడిగుడ్ల విక్రయాలు పడిపోతే.. అమెరికాలోనేమో కోడిగుడ్లకు తీవ్ర కొరత ఏర్పడింది. అక్కడ కొన్ని నెలల కిందట బర్డ్‌ఫ్లూ కేసులు వెలుగుచూడటంతో కోళ్లన్నింటినీ చంపి.. పూడ్చిపెట్టారు. ఇప్పుడు పరిస్థితులు అదుపులోకొచ్చినా అక్కడ చికెన్‌కు, కోడిగుడ్లకు కొరత ఏర్పడింది. కోడిగుడ్ల ధరలైతే అమాంతం పెరిగాయి. డజను కోడిగుడ్ల ధర డిసెంబరులో 4డాలర్లు ఉం డగా ఇప్పుడు 6.5 డాలర్లకు పెరిగింది. కాలిఫోర్ని యా, న్యూయర్క్, షికాగో వంటి నగరాల్లో జనం షాపుల వద్ద క్యూకడుతున్నారు. కొన్నిచోట్ల పది డాలర్లు ఇవ్వజూపినా డజను గుడ్లు ఇవ్వడం లేదు. ఒకచోటైతే తలా మూడు గుడ్లే ఇస్తామని బోర్డు పెట్టారు. అధ్యక్షుడు ట్రంప్ వ్యవసాయ కార్యదర్శి బ్రూక్ రోలిన్స్ తన తొలి సమావేశంలో గుడ్ల కొరతనూ ప్రాధాన్య అంశంగా పరిగణించి సమీక్షించారు. గత పదేళ్లలో ఇలాంటి పరిస్థితి చూడలేదని ఆయన చెప్పారు. ఇటీవల పెన్సిల్వేనియాలో లక్ష గుడ్లను దుండగులు దోపిడీ చేశారు.

వనపర్తి జిల్లాలో 4 వేల కోళ్లు మృతి

మదనాపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా మదనాపురం మండలం కొన్నూరులోని ఓ పౌల్ట్రీ ఫామ్‌లో మూడు రోజుల్లో నాలుగు వేలకు పైగా కోళ్ల మృతి చెందాయి. గ్రామానికి చెందిన రైతు శివ కేశవరెడ్డి పౌల్ట్రీ ఫామ్ నిర్వహిస్తున్నారు. ఇటీవల ఫామ్‌లో కోళ్ల అకస్మాత్తుగా చనిపోవడం ప్రారంభమైంది. ఇలా గత మూడు రోజులుగా నాలుగు వేలకుపైగా కోళ్ల మృత్యువాత పడ్డాయి. ఈ విషయాన్ని శివ కేశవరెడ్డి మంగళవారం సాయంత్రం జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా బుధవారం ఆయన షెడ్డులో చనిపోయిన కోళ్లను పరిశీలించారు. పొలంలో ఎక్స్‌కవేటర్ సాయంతో గొయ్యి తవ్వి చనిపోయిన కోళ్లతో పాటు, కొనఊపిరితో ఉన్న వాటిని కూడా పూడ్చివేయించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బర్డ్ ఫ్లూ ఎక్కడా వ్యాపించలేదని, కొక్కెర వ్యాధితోనే కోళ్ల చనిపోయినట్లు ఆయన అనుమానం వ్యక్తం చేశారు.


టీస్టాల్ ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

సిరిసిల్లలో 'కేటీఆర్ టీ స్టాల్' వివాదం!

» లైసెన్స్ లేదని మూసేసిన అధికారులు .. సోషల్ మీడియాలో వైరల్

» ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదు: 'ఎక్స్'లో కేటీఆర్ పోస్ట్

సిరిసిల్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో ఓ టీ స్టాల్‌ను మునిసిపల్ అధికారులు ట్రేడ్ లైసెన్స్ లేదంటూ మూసివేయడం వివాదాస్పదంగా మారింది. బుధవారం ఉదయం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సిరిసిల్ల మునిసిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అన్ని దుకాణాల ట్రేడ్ లైసెన్స్‌లు పరిశీలించాలని, లైసెన్స్‌లేని దుకాణాలను తొలగించాలని మునిసిపల్ అధికారులకు సూచించారు. ఈ నేపథ్యంలో వారు.. బతుకమ్మ ఘాట్ వద్ద బత్తుల శ్రీనివాస్ అనే చిరు వ్యాపారి కేటీఆర్ పేరుతో నడుపుతున్న టీ స్టాల్‌ను మూసివేయించారు. దీంతో చిరు వ్యాపారిపై కలెక్టర్ ప్రతాపం అంటూ సోషల్ మీడియాలో వైరల్ అయింది. కేటీఆర్ పేరు, ఆయన ఫ్లెక్సీ పెట్టుకోవడంతోనే తన టీ స్టాల్‌ను మూసివేయించారని శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనకు మద్దతుగా బీఆర్ఎస్ నేతలు ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. దీనిపై మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని, ప్రతీది గుర్తు పెట్టుకుంటున్నానని హెచ్చరిస్తూ.. టీ స్టాల్ నిర్వాహకుడు శ్రీనివాస్ మాట్లాడిన వీడియోను పోస్ట్ చేశారు.


ఉదండాపూర్ నిర్వాసితులను అడ్డుకుంటున్న పోలీసులు

ఉదండాపూర్ నిర్వాసితుల భిక్షాటన

» జడ్చర్ల గెస్ట్ హౌస్ వద్ద అడ్డుకున్న పోలీసులు

» ఒంటిపై పెట్రోల్ పోసుకున్న ఓ నిర్వాసితుడు

జడ్చర్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పునరావాసం ప్యాకేజీని ఒన్‌టైం సెటిల్‌మెంట్‌గా చెల్లించాలని, పరిహారాన్ని పెంచి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులు చేపట్టిన భిక్షాటన కార్యక్రమం ఉద్రిక్తతకు దారి తీసింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం ఉదండాపూర్ వద్ద నిర్మిస్తున్న రిజర్వాయర్‌లో 2 గ్రామాలు, 5 తండాలు ముంపునకు గురవుతున్నాయి. ఈ తరుణంలో తమ డిమాండ్లు తీర్చాలని కోరుతూ.. నిర్వాసితులు బుధవారం జడ్చర్లలో భిక్షాటనకు సిద్ధమవ్వగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో నిర్వాసితుడు సిద్ధాపురం మల్లయ్య తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని, నిప్పంటించుకునేందుకు యత్నించాడు. పోలీసులు పెట్రోల్ డబ్బాను లాక్కొని, ఒంటిపై నీరు పోశారు. అనంతరం నిర్వాసితులు ర్యాలీగా జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ నెల 20 నుంచి 28 వరకు భిక్షాటన కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇచ్చారు.


నాగార్జునసాగర్ అటవీ ప్రాంతంలో వ్యాపించిన మంటలు

సాగర్ అటవీ ప్రాంతంలో మంటలు

» 120 ఎకరాల్లో కాలిన ఎండుగడ్డి

» అదుపులోకి తెచ్చిన అటవీ సిబ్బంది

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ అడవిలో బుధవారం సాయంత్రం మంటలు చెలరేగాయి. సాగర్ పైలాన్ కాలనీ కొత్త బ్రిడ్జీ నుంచి జమ్మన్నకోట తండాకు వెళ్లే రహదారి సమీపంలోని అటవీ ప్రాంతంలో మంటలు అంటుకున్నాయి. ఈ ప్రాంతంలోని గడ్డి పూర్తిగా ఎండిపోయి ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. డ్యామ్ ముందు భాగంలో సుమారు 2 కిలోమీటర్ల మేర 120 ఎకరాల్లో మంటలు వ్యాపించడంతో గమనించిన స్థానికులు వెంటనే అటవీ సిబ్బందికి సమాచారం చేరవేశారు. దీంతో వారు మంటలు వ్యాపిస్తున్న ప్రదేశానికి చేరుకుని గంటన్నర సేపు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకురాగలిగారు. ఎండిన గడ్డి బూడిదవడం మినహా పెద్ద నష్టమేమీ జరగలేదని అటవీ సిబ్బంది చెబుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు కావాలనే ఉద్దేశపూర్వకంగా మంట అంటించినట్టుగా అనుమానిస్తున్నామని సిబ్బంది తెలిపారు. మంటలు ఎగసిన ప్రాంతానికి కిలోమీటరు లోపు దూరంలో ఉన్న జమ్మన్నకోటతండా వాసులు భయభ్రాంతులకు గురయ్యారు.

కేసీఆర్‌కు ప్రజాస్వామ్యం అంటే విలువ లేదు..

» ఆయన అసహనంతో మాట్లాడుతున్నారు: పొన్నం

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రజాస్వామ్యం అంటే విలువ లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఆయనకు దరిదాపుల్లో అధికారం కనబడకపోవడంతో అసహనంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పాస్‌పోర్టు కార్యాలయానికి హైదరాబాద్ వచ్చారు కాబట్టి పనిలో పనిగా.. పార్టీ సమావేశం నిర్వహించారని ఎద్దేవా చేశారు. బుధవారం మీడియాతో పొన్నం మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే రెండు హామీలను అమలు చేశామని గుర్తు చేశారు. పంటలకు బోనస్, రైతు భరోసా, 55 వేల ఉద్యోగాలు, డీఎస్సీ పోస్టింగ్స్ ఇలా అనేక వాటిని అమలు చేశామన్నారు. బీఆర్ఎస్ వాళ్లు ఆర్థికంగా విధ్వంసాన్ని సృష్టించినా పాత పథకాలను రద్దు చేయకుండా అమలు చేస్తున్నామని చెప్పారు. కేంద్రం సహకరిస్తే తమ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఇంకా అభివృద్ధి చేస్తుందన్నారు. సమగ్ర కులగణనను రీ సర్వే చేయాలని డిమాండ్ చేసిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు.. ఇప్పుడెందుకు అందులో పాల్గొనట్లేదని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల పెంపు విషయమై మార్చి 10న సీఎం అధ్యక్షతన ఢిల్లీకి వెళ్లనున్నట్టు చెప్పారు. కలిసిరావాలని కోరుతూ బీఆర్ఎస్ సహా అన్ని రాజకీయ పార్టీలకు లేఖలు రాస్తామన్నారు.

బీఆర్‌ఎస్ తీరు మారకుంటే ప్రజలే తిరగబడతారు

» కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌కు ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పారని, కానీ ఆ పార్టీ నేతల్లో ఏమాత్రం మార్పురాలేదని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి విమర్శించారు. ఇకనైనా మారకుంటే ప్రజలే తిరగబడతారని హెచ్చరించారు. బుధవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ పాలనలో తెలంగాణలో స్వేచ్ఛకు సమాధి కట్టేశారని మండిపడ్డారు. పదేళ్లపాటు రాష్ట్రంలో నిర్బంధ పాలన సాగించారని, ఇప్పుడు స్వేచ్ఛాయుత, ప్రజాపాలన సాగుతోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా పాలనను చూసిన ప్రజలు మళ్లీ నియంత పాలన రాకూడదని కోరుకుంటున్నారని చెప్పారు. రైతుదీక్ష పేరుతో సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించడం తప్ప బీఆర్ఎస్ చేసిందేమీ లేదని, దీక్షలో రైతు సమస్యలు తప్ప కేటీఆర్ అన్నీ మాట్లాడారని ఎద్దేవా చేశారు. పదేళ్లలో బీఆర్ఎస్ చేయలేని అభివృద్ధి, అందించలేని సంక్షేమాన్ని ఏడాదిలోనే ప్రజలకు అందించామని తెలిపారు. ఇకనైనా ప్రజా సమస్యల గురించి ఆలోచించాలని బీఆర్ఎస్‌కు హితబోధ చేశారు.

సీఎం, మంత్రుల మధ్య భేషజాలు లేవు

సమష్టి నిర్ణయాలతోనే పథకాల అమలు.. ఆరు నెలలుగా కుంభకర్ణుడిలా కేసీఆర్ నిద్ర

» అలాంటి వ్యక్తికి ప్రతిపక్ష నేత హోదా ఎందుకు?

» బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల దుష్ప్రచారాన్ని పట్టభద్రులు నమ్మొద్దు

» స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తాం

» ఆత్మీయ సమ్మేళనంలో టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, చిత్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

నిజామాబాద్/కామారెడ్డి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులకు ఎలాంటి భేషజాలు లేవని, సమష్టి నిర్ణయాలతోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలకులపై బీజేపీ, బీఆర్ఎస్ సోషల్ మీడియాలో విష ప్రచారం చేస్తున్నాయని, వాటిని ప్రజలు నమ్మవద్దని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డిలో బుధవారం పట్టభద్రులతో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. అనంతరం నిజామాబాద్‌లో కాంగ్రెస్ నాయకులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ ఆరు నెలల పాటు కుంభకర్ణుడిలా నిద్రపోయిన కేసీఆర్.. ఇప్పుడు బయటకు వచ్చి కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని ప్రకటనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడని వ్యక్తికి ప్రతిపక్ష హోదా ఎందుకని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల గురించి మాట్లాడే హక్కు కేసీఆర్‌తోపాటు బీఆర్ఎస్ నేతలకు లేదన్నారు. రాష్ట్రంలో కులగణన చేపట్టడం ద్వారా చరిత్ర సృష్టించామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు త్వరలోనే చట్టం తెస్తామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 56 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని గుర్తు చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న మరో లక్ష ఉద్యోగాలను భర్తీ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గత పదేళ్లలో 50 వేల ఉద్యోగాలను కూడా బీఆర్ఎస్ భర్తీ చేయలేకపోయిందని గుర్తు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సైతం 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని మాట ఇచ్చి, తప్పిందన్నారు. ఆ రెండు పార్టీలను నమ్మవద్దని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి బలపరిచిన నరేందర్‌రెడ్డిని గెలిపించాలని పట్టభద్రులను కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా బీజేపీతో లోపాయికారీ ఒప్పందం కారణంగానే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను బరిలో దింపలేదన్నారు. కేవలం కాంగ్రెస్‌ను ఓడించాలన్నదే ఆ రెండు పార్టీల లక్ష్యమని విమర్శించారు. ఆర్థిక ఇబ్బందులున్నా.. ఎన్నికల వేళ ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారెంటీలను అమలులోకి తెచ్చామన్నారు. రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు ఉన్నా కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఇచ్చింది గుండుసున్నా అని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు అడగడానికి వచ్చే కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలను పట్టభద్రులు నిలదీయాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని, విజయం సాధించేందుకు కృషి చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే.. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయదుందుభి మోగించేందుకు దోహదపడుతుందన్నారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పథకాలను ఓటర్లకు వివరించి, నరేందర్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యే ప్రధాన పోటీ ఉందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. మత, కుల రాజకీయాలు చేసే బీజేపీని నమ్మవద్దని పట్టభద్రులను కోరారు. మేధావులైన పట్టభద్రులు ఆలోచించి కాంగ్రెస్ అభ్యర్థికే ఓటు వేయాలని కోరారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు ఓటువేసి గెలిపిస్తే సొంత నిధులతో పట్టభద్రులందరికీ రూ.3లక్షల మేర బీమా కార్డులు ఇస్తానని నరేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. పట్టభద్రుల, ఉపాధ్యాయుల సమస్యలు తనకు తెలుసని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

టీజేఎస్, వామపక్షాలకు మహేష్‌గౌడ్ లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కరీంగనర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని టీజేఎస్ అధినేత కోదండరాం, సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, జాన్ వెస్లీని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ కోరారు. ఈ మేరకు బుధవారం వారికి లేఖలు రాశారు.

నా బృందం ధైర్యం కోల్పోకూడదనే చిలుకూరు అర్చకుడిపై దాడి చేశా!

» రామరాజ్యానికి పూజారులు సహకరిస్తామన్నారు

» అర్చకుడు రంగరాజన్ నో చెప్పడంతోనే దాడి

» పోలీసుల విచారణలో వీరరాఘవ రెడ్డి వెల్లడి



మొయినాబాద్: ఫిబ్రవరి 19, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు, పోలీసు, న్యాయవ్యవస్థలతో తనకు న్యాయం జరగలేదని.. ఫలితంగా తానే సుప్రీంగా ఉండి వ్యవస్థను మార్చేందుకు 'రామరాజ్యం' స్థాపనకు పూనుకున్నానని పోలీసుల విచారణలో వీరరాఘవ రెడ్డి వెల్లడించినట్లు తెలిసింది. చిలుకూరు బాలాజీ దేవాలయ అర్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడి కేసులో ప్రధాన నిందితుడైన వీరరాఘవ రెడ్డిని పోలీసులు మూడు రోజుల కస్టడీకి తీసుకొని విచారణ చేస్తున్నారు. రెండురోజుల విచారణలో పలు విషయాలను అతడు వెల్లడించినట్లు తెలిసింది. 2014-15లో తన కుమార్తెను రెండో తరగతి నుంచి పై తరగతికి ప్రమోట్ చేయలేదని, ఈ విషయంలో తాను అధికారులు, న్యాయవ్యవస్థతో పోరాడినా న్యాయం దక్కలేదని.. అప్పుడే తాను ఓ కొత్త వ్యవస్థ రూపకల్పన దిశగా ఆలోచన చేసినట్లుగా అతడు వెల్లడించినట్లు సమాచారం. పదో తరగతి దాకా చదువుకున్న వీరరాఘవ రెడ్డి ఓ గురువు వద్ద ఇక్ష్వాక వంశం, భరతవంశం, రామరాజ్యం గురించి తెలుసుకున్నట్లు.. భగవద్గీత, రామాయణం, భాగవతం, శ్లోకాలు నేర్చుకున్నట్లు తెలిసింది. కాగా 'రామరాజ్యం' ఏర్పాటు చేస్తున్న క్రమంలో చాలా మంది పూజారులను తాను కలిశానని, వారంతా సహకరిస్తామని చెప్పారని, అదే క్రమంలో చిలుకూరు ఆలయ అర్చకుడు రంగరాజన్ వద్దకు వెళ్తే సహకరించేందుకు నిరాకరించాడని, అందుకే ఆయనపై దాడిచేయాల్సి వచ్చిందని వీరరాఘవ రెడ్డి వెల్లడించినట్లు సమాచారం. తనకు రంగరాజన్ సహకరించి ఉంటే ఇదంతా జరిగి ఉండేదికాదని.. అయితే తాను తయారు చేసిన సభ్యుల ముందే రంగరాజన్ గట్టిగా వాదించడంతో బృందం సభ్యులు ధైర్యం కోల్పోతారనే ఉద్దేశంతో దాడికి దిగినట్లుగా చెప్పినట్లు తెలిసింది. తాను జైలు నుంచి బయటకు వచ్చాకా హిందూధర్మ పరిరక్షణకోసం, దేశరక్షణ కోసం పనిచేస్తానని చెప్పినట్లు తెలిసింది.


భువనగిరిలో ఓ మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

నేను కలెక్టర్‌ను.. నల్లాల్లో నీళ్లు వస్తున్నాయా?

» బుధవారం తెల్లవారు జామున భువనగిరిలో కలెక్టర్ పర్యటన

» స్థానికుల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి ఆదేశాలు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు బుధవారం తెల్లవారుజామున ఐదున్నరకు భువనగిరి పట్టణంలో బస్తీ పర్యటన చేశారు. మొదట ఏడో వార్డుకి వెళ్లిన ఆయన.. స్థానికులను నిద్రలేపి "నేను జిల్లా కలెక్టర్‌ను.. ఇప్పుడే నిద్ర లేస్తున్నారా.. నల్లాల్లో సరిపడా తాగునీళ్లు వస్తున్నాయా.. మురుగు కాలువలను, రోడ్లు పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేస్తున్నారా" అని అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో పర్యటిస్తూ పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. సకాలంలో విధులకు హాజరు కావాలంటూ బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. తనకు గ్యాస్ సబ్సిడీ రావడం లేదని స్థానికుడు ఫిర్యాదు చేయగా కలెక్టర్ అక్కడినుంచే సివిల్ సప్లయ్ అధికారులకు ఫోన్ చేసి లబ్ధిదారుకు గ్యాస్ సబ్సిడీ అందేలా చూడాలని ఆదేశించారు. అలాగే 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగిస్తున్న వారందరికీ గృహజ్యోతి వర్తించేలా చర్యలు చేపట్టాలంటూ అక్కడి నుంచే ట్రాన్స్‌కో ఎస్ఈకి వాట్సాప్‌లో ఆదేశాలు జారీచేశారు. మహిళల అభ్యర్థన మేరకు నీటి ట్యాంకును నిర్మించాలంటూ మునిసిపల్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ పర్యటన రెండున్నర గంటలపాటు సాగింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బంగ్లా పీటముడి

బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్‌ను అసమర్థుడిగా, ఉగ్రవాదిగా అభివర్ణిస్తూ ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా మంగళవారం తీవ్ర విమర్శలు చేశారు. అవామీలీగ్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని ఉద్దేశించి, వర్చువల్‌గా చేసిన ప్రసంగంలో తాను స్వదేశం తిరిగివచ్చి, జరిగిన నష్టానికి ప్రతీకారం తీర్చుకుంటానని హామీ ఇచ్చారు. ఉగ్రవాద ప్రభుత్వాన్ని తరిమికొట్టాలంటూ పిలుపునిచ్చారు. ఆమె భారతదేశంలో ఆశ్రయం పొందుతున్న విషయం ప్రపంచమంతటికీ తెలుసు. మీ దేశంలో కూర్చొని మాకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయనివ్వకండి అని బంగ్లాపాలకులు మనకు ఎప్పటికప్పుడు ఓ సుతిమెత్తని హెచ్చరిక చేస్తుంటారు. ఆమె నిశ్శబ్దంగా ఉంటే సంబంధాలు మెరుగుపడతాయని ఆశపెడుతుంటారు. ఆమె నోరువిప్పినప్పుడల్లా అప్పగింత డిమాండ్‌ను గుర్తుచేస్తుంటారు. ఎప్పటిలాగానే ఆమె జూమ్‌కాల్‌లో చేసిన ఈ వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా హసీనాను వెనక్కు తీసుకురావడానికి తమ ప్రభుత్వం కంకణం కట్టుకుందని యూనస్ కార్యదర్శి ప్రకటించారు. అధికారంలో ఉండగా ఆమె చేసిన నేరాలూ ఘోరాలకు తగిన శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారాయన. స్వదేశానికి వెళ్ళి ప్రతీకారం తీర్చుకుంటానని హసీనా, వెనక్కు రప్పించి తీరుతామని యూనస్ ఎలాగూ అంటున్నందున, పంపిచేస్తే సరిపోతుంది కదా అన్నది కొందరు సరదాగా చేస్తున్న వ్యాఖ్య.

కొద్దిరోజుల క్రితం భారతవిదేశాంగ మంత్రి జయశంకర్‌తో బంగ్లాదేశ్ విదేశాంగ సలహాదారు తౌహీద్ హుస్సేన్‌తో మస్కట్‌లో చర్చలు జరిపారు. ఉభయదేశాల సంబంధాలు ప్రస్తుతం మెరుగుపడుతున్నాయని, ఏప్రిల్‌లో బిమ్స్‌టెక్ సదస్సు సందర్భంగా మోదీ, యూనస్ భేటీ జరిగినపక్షంలో ఘర్షణ మరింత తొలగిపోతుందన్నది విశ్లేషకుల అభిప్రాయం. బోర్డర్‌గార్డ్ బంగ్లాదేశ్ (బీజీబీ) ప్రతినిధి బృందం సరిహద్దు సమస్యల పరిష్కారం, సమన్వయం లక్ష్యంగా చర్చలకు మనదేశం రావడం మంచి సంకేతం. గత ఆర్నెల్లకాలంలో స్మగ్లర్లు, క్రిమినల్స్ సహా వందలాది చొరబాటు యత్నాలు జరగడం, కొందరిని బీఎస్ఎఫ్ కాల్చివేయడం ఉద్రిక్తతలకు దారితీస్తోంది. సరిహద్దు నిర్వహణ సజావుగా ఉంటే, ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడటానికి అవకాశం ఏర్పడుతుంది.

హసీనా నిష్క్రమణ తరువాత, యూనస్ ప్రభుత్వం పాకిస్తాన్‌కు అన్ని రంగాల్లో వేగంగా దగ్గరవుతోంది. పాకిస్థాన్ ప్రధానితో యూనస్ పలుమార్లు భేటీ అయ్యారు. మంత్రులు, ఉన్నతస్థాయి సైనికాధికారుల రాకపోకలు సాగుతున్నాయి. సైనికశిక్షణలు, ఉమ్మడి విన్యాసాలకు అవగాహనలు, ఒప్పందాలు కుదిరాయి. ప్రభుత్వం ఎంత దగ్గరవుతున్నప్పటికీ, ప్రజలు చారిత్రకంగా తమకు జరిగిన అన్యాయాన్ని విస్మరించి పాకిస్థాన్‌కు చేరువకాకపోవచ్చు. అంతమాత్రాన యూనస్ ప్రభుత్వంతో ఎంతోకొంత స్థాయిలో వ్యవహారాలు నడపకుండా వదిలివేయడం సరికాదు. భారతప్రధాని మోదీ ఒక్కసారి కూడా యూనస్‌తో భేటీ కాకపోవడం వల్ల మనకు కొత్తగా ఒరిగేదీ కూడా ఏమీ లేదు. సరిహద్దు ఉగ్రవాదం, ఆయుధాల అక్రమరవాణా తదితర కీలకమైన అంశాల విషయంలో నిక్కచ్చిగా ఉంటూ, మిగతా విషయాల్లో గతంలో మాదిరిగానే ఇచ్చిపుచ్చుకొనే వైఖరి చూపవచ్చు. సుదీర్ఘ సరిహద్దును పంచుకుంటున్న భారత్‌ను కాదని, పాకిస్థాన్‌తో వ్యవహరించడంలో బంగ్లాదేశ్‌కు కచ్చితంగా కొన్ని భౌగోళిక పరిమితులు ఉంటాయి. అప్పుల్లో ఉన్న పాకిస్థాన్ కంటే భారత్‌తోనే తమకు మేలు జరుగుతుందని బంగ్లాదేశ్ ప్రజలకు తెలియకపోదు. హసీనా వ్యాఖ్యానించినప్పుడల్లా బంగ్లాదేశ్‌లో మైనారిటీలమీద దాడులు జరుగుతాయి, ఢాకా నడిబొడ్డున పాలకుల పరోక్ష ఆశీస్సులతో జరిగిన బుల్‌డోజర్ మార్చ్‌లో భాగంగా ముజిబూర్ రహ్మాన్ ఇల్లు నేలమట్టమవుతుంది. యూనస్ ప్రభుత్వం పాకిస్థాన్‌కు చేరువుగా అడుగులు వేసినప్పుడల్లా హసీనా విమర్శలు చేస్తున్నారు. ఉభయ దేశాల మధ్యా ఈ విష వలయాన్ని ఛేదించాలంటే హసీనా కొంతకాలం మాట్లాడకపోవడం అవసరం. బంగ్లాదేశ్ వ్యవహారాలను అమెరికా పట్టించుకోదని, ఆ దేశాన్ని ప్రధానమంత్రికి ఇచ్చేశానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మోదీ సమక్షంలో ప్రకటించారు. చేతికందిన ఆయుధాన్ని అతిజాగ్రత్తగా వినియోగించడం మన చేతుల్లోనే ఉంది.

కెన్నెడీల వారసత్వంలో మరో అధ్యాయం

తీవ్రమైన ఆరోగ్య సమస్యలు, ఆకాశాన్నంటుతున్న వైద్య ఖర్చులు, బీమా సంస్థల ఆధిపత్యం, వైద్య సేవల అందుబాటు సమస్యలు, వైద్య లోపాలు వంటి సవాళ్లను అమెరికా ప్రస్తుతం ఎదుర్కొంటున్న తరుణంలో, ట్రంప్ ప్రభుత్వం ఆరోగ్య కార్యదర్శిగా రాబర్ట్ ఎఫ్. కెన్నెడీ జూనియర్‌ను నియమించడం సార్వజనీన ఆరోగ్య విధానంలో ఒక విప్లవాత్మక మార్పు. ఆయన నియామకాన్ని సెనేట్ 52–48 ఓట్ల తేడాతో అంగీకరించడాన్ని బట్టి అమెరికా రాజకీయాల్లో కెన్నెడీ కుటుంబం ప్రభావాన్ని అవగాహన చేసుకోవచ్చు.

ఆరోగ్య కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరిస్తున్న రాబర్ట్ ఎఫ్. కెన్నెడీ జూనియర్ తండ్రి మాజీ అటార్నీ జనరల్, సెనేటర్ రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ సీనియర్, అతని పెద్దనాన్న అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నెడీ, చిన్నాన్న టెడ్ కెన్నెడీ, అతని తల్లి మానవ హక్కుల కోసం పోరాడిన సామాజిక న్యాయ ఉద్యమకారిణి ఎథెల్ కెన్నెడీ. 1968 అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో తన తండ్రి హత్యకు గురైనప్పటికీ అది రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ జూనియర్ రాజకీయ ప్రస్థానాన్ని ఆపలేకపోయింది. 2024 అధ్యక్ష ఎన్నికల్లో స్వతంత్రుడిగా పోటీ చేసిన జూనియర్ రాబర్ట్, పోటీ నుండి విరమించుకుని, ఎన్నికలలో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్‌కు మద్దతు ప్రకటించడం కీలక రాజకీయ మలుపుగా మారింది. అమెరికా ఆరోగ్య కార్యదర్శిగా ఆయన నియామకం కెన్నెడీ కుటుంబ చరిత్రలో మరో నూతన అధ్యాయం.

నేడు నోబెల్ సాహిత్య బహుమతి గ్రహీత పర్ల్ ఎస్ బక్ జీవించి ఉన్నట్లయితే తాను ఐదున్నర దశాబ్దాల క్రితం రాసిన ప్రసిద్ధ పుస్తకం 'ది కెన్నెడీ ఉమెన్'లో రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ జూనియర్ రాజకీయ ఆరోహణ గురించి మరో ఆసక్తికరమైన అధ్యాయంగా చేర్చేవారేమో! ఈ పుస్తకంలో కెన్నెడీల రాజకీయ అస్తిత్వం, వారు ఎదుర్కొన్న దురదృష్టకర సంఘటనలు, చైనా కుంగ్ కుటుంబంతో కెన్నెడీ కుటుంబం పోలికలు, 'కర్స్ ఆఫ్ గ్రేట్‌నెస్' (గొప్పతనపు శాపం) గురించి వివిధ కోణాలలో చర్చించారు.



వంశపారంపర్యమే కీలకం కాదు, ప్రజల విశ్వాసమే అసలు ఆధారం అని–ట్రంప్ ప్రభుత్వ ఆరోగ్య కార్యదర్శిగా రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ జూనియర్ నియామకం మనకు చెబుతుంది. కెన్నెడీ వారసత్వం ఒక కథ మాత్రమే కాదు, అది ఒక విలువైన సందేశం.

మరో ఆసక్తికరమైన అంశం, కెన్నెడీ కుటుంబానికి, నెహ్రూ–గాంధీ కుటుంబానికి గల కొన్ని సారూప్యతలు. ఇరు కుటుంబాలూ తమ దేశ రాజకీయ ప్రస్థానాన్ని నిర్వచిస్తూ ముందుకు సాగాయి. అలాగే, వారసత్వ పాలనకు తలొంచిన రాజకీయ కుటుంబాల మాదిరిగానే, తీవ్రమైన విషాదాలను సహితం ఎదుర్కొన్నాయి. జాన్ ఎఫ్ కెన్నెడీ, రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ సీనియర్ హత్యకు గురైనట్లే, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలు హత్య చేయబడ్డారు. జెఎఫ్‌కె జూనియర్ విమాన ప్రమాదంలో మరణించినట్లే, సంజయ్‌గాంధీ విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. కెన్నెడీ కుటుంబ సభ్యులు ఎన్నో ముఖ్యమైన హోదాల్లో పని చేసినట్లుగానే, నెహ్రూ–గాంధీ కుటుంబ సభ్యులు కూడా అత్యున్నత పదవులను అలంకరించారు.

కెన్నెడీ కుటుంబ రాజకీయ ప్రయాణం జోసెఫ్ పి కెన్నెడీ సీనియర్ ఇంగ్లాండ్ దేశానికి అమెరికా రాయబారిగా నియామకంతో ప్రారంభమైందనవచ్చు. 1914లో ఆయన వివాహం చేసుకున్న రోస్ ఫిట్జ్‌గెరాల్డ్ కెన్నెడీ, మరో అమెరికన్ రాజకీయ నాయకుడు జాన్ ఎఫ్ ఫిట్జ్‌గెరాల్డ్ కుమార్తె. పర్ల్ ఎస్ బక్ తన పుస్తకంలో ఆమెను కాథలిక్ ఆచార వ్యవహారాలకు ప్రతిరూపంగా, క్రమశిక్షణకు, సహనానికి చిహ్నంగా చిత్రీకరించారు. జోసెఫ్, రోస్ దంపతులు తమ తొమ్మిదిమంది పిల్లలను క్రమశిక్షణ, పట్టుదల, ప్రజా సేవపై అపారమైన నిబద్ధత కలిగి ఉండేలా తీర్చిదిద్దారు. వారి నలుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు అమెరికా రాజకీయాలపై చెరగని ముద్రవేశారు.

జోసెఫ్ ప్యాట్రిక్ కెన్నెడీ అమెరికా అధ్యక్షుడు కావాలనుకున్న తన అభిలాషను కుమారుల ద్వారా నెరవేర్చాలనే సంకల్పంతో, ఆ ధైర్యాన్ని వారికిచ్చారు. 1932 అధ్యక్ష ఎన్నికల సమయానికి ఫ్రాంక్లిన్ రూజ్వెల్ట్‌కు ఆర్థిక వనరులను సమకూర్చే కీలకవ్యక్తిగా మారాడు. 1937లో గ్రేట్ బ్రిటన్‌లో అమెరికా రాయబారిగా ఆయన నియామకం కెన్నెడీ ప్రజాస్వామ్య రాజవంశం బలపడటానికి పునాది వేసింది. అమెరికా అధ్యక్షుడిగా అయ్యే అవకాశం ఉన్నా రాజకీయంగా కొంతకాలం పక్కన పడిపోయిన జోసెఫ్, తన కుమారుల భవిష్యత్తును దేశ రాజకీయాల్లో స్థిరపరిచే దిశగా పట్టుదలతో ప్రయత్నించారు. పెద్ద కుమారుడు జో జూనియర్ అమెరికా అధ్యక్షుడవుతాడనే గాఢమైన నమ్మకం ఏర్పడింది. కానీ రెండో ప్రపంచ యుద్ధంలో కూలి, పేలిపోయిన సైనిక విమానంలో జో జూనియర్ మరణించాడు. దాంతో కుటుంబ ఆశలన్నీ జాన్ ఎఫ్ కెన్నెడీ వైపు మరలాయి. యుద్ధంలో తీవ్రంగా గాయపడి, జీవితాంతం శారీరిక బాధను భరించాల్సి వచ్చినా, జాన్ ఎఫ్ కెన్నెడీ కుటుంబ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాడు. అమెరికా రాజకీయాల్లో మెట్టు మెట్టుగా ఎదిగి, ప్రతినిధుల సభకు, సెనెట్‌కు ఎన్నికై, చివరికి అత్యంత పిన్న వయస్సులో 35వ అమెరికా అధ్యక్షుడయ్యాడు.

ఇక అప్పటి నుండి కెన్నెడీ వారసత్వం సాంస్కృతిక ఆర్భాటం, మనోధైర్యం రెండూ కలిసి ఉన్న విలక్షణ సంప్రదాయంగా నిలిచింది. కెన్నెడీ అనే పేరు అధికార–అవకాశాల ప్రపంచాన్ని ప్రతిబింబించడమే కాదు, బాధ్యతతో కూడిన గొప్ప వంశపారంపర్యాన్ని సూచించసాగింది. అధికారం చేపట్టి వెయ్యి రోజులు గడవకముందే జాన్ ఎఫ్ కెన్నెడీ హత్యకు గురై అమెరికా చరిత్రలో అత్యంత పిన్న వయసులో మరణించిన అధ్యక్షుడయ్యాడు. దశాబ్దాల తరువాత, అతని 38 ఏళ్ల కుమారుడు జాన్ కెన్నెడీ జూనియర్ విమాన ప్రమాదంలో మరణించాడు. కుమార్తె క్యారోలైన్ కెన్నెడీ ఆస్ట్రేలియా, జపాన్‌లకు అమెరికా రాయబారిగా పనిచేసింది. కెన్నెడీ కథ ఇక్కడితో ముగియలేదు. జాన్ ఎఫ్ కెన్నెడీ తమ్ముడు రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ సీనియర్, అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం ప్రచారం చేస్తూ హత్యకు గురయ్యాడు. మరొక తమ్ముడు ఎడ్వర్డ్ 'టెడ్' కెన్నెడీ, సెనెట్‌లో దాదాపు 50ఏళ్ల పాటు కుటుంబ రాజకీయ వారసత్వాన్ని స్థిరపర్చాడు. ఇప్పుడు రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ జూనియర్ అమెరికా ఆరోగ్య కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించడం కెన్నెడీ వారసత్వం కొత్త దశలోకి ప్రవేశించిందనడానికి నిదర్శనం.

వంశపారంపర్యమే కీలకం కాదు, ప్రజల విశ్వాసమే అసలు ఆధారం అని రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ జూనియర్ నియామకం మనకు చెబుతుంది. కెన్నెడీ కుటుంబం చేసిన త్యాగాలు, వారి ఆత్మసంఘర్షణలు, నమ్మకాలు, ఇవన్నీ సేవాగుణానికి, నిబద్ధతకు, ప్రజాస్వామ్య న్యాయానికి నిదర్శనం. కెన్నెడీ వారసత్వం ఒక కథ మాత్రమే కాదు, అది ఒక విలువైన సందేశం. అభివృద్ధి చెందుతున్న భారతదేశం లాంటి దేశాలలో, ఒకే కుటుంబం నుంచి రాజకీయంగా ఎదుగుతున్నవారి ప్రత్యేకతలు అవగాహన చేసుకోకుండా, వారసత్వ రాజకీయాలను అసంబద్ధంగా విమర్శించడం తగదు. మంచిని మంచే అనాలి. తప్పుంటేనే నిష్పక్షపాతంగా ఎత్తిచూపాలి.

• వనం జ్వాలానరసింహారావు

కృత్రిమ మేధ: భ్రమలూ, వాస్తవాలూ!

ఈ మధ్య, 'కృత్రిమ మేధ'ని ఆకాశానికి ఎత్తేస్తూ పత్రికల్లో వ్యాసాలూ సంపాదకీయాలూ వస్తున్నాయి. దాన్ని 'శ్రేయో మేధ' అనీ, 'మేధో విప్లవం' అనీ, ఇంకేదో అనీ, చెపుతున్నారు. 'కృత్రిమ మేధ' గురించి నాకు పెద్దగా తెలియదు. అందుకని, కంప్యూటర్ రంగంలో దాదాపు 40ఏళ్ళ అనుభవం వున్నవాడు, అమెరికాలో పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పనిచేసిన జె.ప్రసాద్‌తో మాట్లాడితే, కొంచెం అర్థం అయింది. అయితే, నేను ఈ వ్యాసంలో రాయదలుచుకున్నది, ఆ సైన్స్ గురించి కాదు. నిజానికి ఏ సైన్సు అయినా, ప్రస్తుత సమాజంలో, ఏ వర్గ ప్రయోజనాల కోసం ఉపయోగపడుతుందో చెప్పాలని మాత్రమే!

'కృత్రిమ మేధ' అనేది, మనుషులు కొన్ని పనులు జరగడం కోసం రాసుకునే ఒక కంప్యూటర్ ప్రోగ్రాం అట! ఇంకా, సరిగా చెప్పాలంటే, 'మనుషులు రాసుకునే' అనే బదులు, 'పెట్టుబడిదారీ యజమానులు రాయించుకునే' అంటేనే బాగా సరిపోతుంది! మొత్తానికి, 'కృత్రిమ మేధ' అంటే, ఒక 'కంప్యూటర్ మీద పని చేసే సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాం' అనుకోవచ్చు. ఈ ప్రోగ్రాం, మానవ భాషనూ, వ్యక్తీకరణనూ అర్థం చేసుకుంటూ, అనేక రంగాలకు సంబంధించిన, ఎంతో విస్తారమైన సమాచారాన్ని పోగుచేసి, అనేక విషయాలను, అనేక కోణాల్లో వివరంగా విశ్లేషించి చెపుతుందట! 'కృత్రిమ మేధ' కూడా మానవులు తమ 'ఉత్పత్తి శక్తులు పెరగడం కోసం' తయారు చేసుకున్న ఒక సాధనమే! 'ఉత్పత్తి శక్తులు పెరగడం' అంటే మెరుగైన ఉత్పత్తి సాధనాలను చేతిలోకి తీసుకుని పనిచేసే శ్రామికులు (ఇక్కడ 'సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు') తక్కువ మంది, తక్కువ సమయంలో, ఎక్కువ పనిని, ఎక్కువ సామర్థ్యంతో చేయడం. అంతే! (వారికి పని గంటలు తగ్గేదేమీ వుండదు సుమా!)

ఈ 'కృత్రిమ మేధ' చేయగలిగే పనులు ఇన్నిన్ని కావట! ఎన్నెన్నోనట! వాటిల్లో కొన్ని మాత్రమే చూద్దాం ఇక్కడ: (1) ఏ రంగానికి సంబంధించినదైనా, అనంతమైన సమాచారాన్ని, అతితక్కువ సమయంలో, వేగంగా, ఎక్కువ ఖచ్చితత్వంతో, అనేక కోణాల్లో విశ్లేషిస్తుందట! (2) రోగ నిర్ధారణను పొరపాట్లు లేకుండా చేసి, చికిత్సా విధానాలను కూడా సూచిస్తుందట! (3) రక రకాల రచనలనూ, అనువాదాలనూ, అతి తక్కువ సమయంలో, వేగంగా, అతి తక్కువ దిద్దుబాట్లు మాత్రమే అవసరమయ్యే విధంగా, చేస్తుందట! (4) వాతావరణంలో మామూలు ఊహకు అందని ఏ మార్పులు రావచ్చునో, వాటిని ఏ విధంగా ఎదుర్కోవచ్చునో, ఖచ్చితమైన అంచనా వేసి చెపుతుందట. (5) స్కూలు పిల్లలకి హోమ్‌వర్కులు చేసి పెడుతుందట! లెక్కలు కూడా చేసి పెడుతుందట! అనేక భాషల్లో ఏ విషయం మీదైనా సరే వ్యాసాలు రాసి పెడుతుందట. (6) సాఫ్ట్‌వేర్ విద్యార్థులకు కొత్త ప్రోగ్రాములు రాసి పెడుతుందట. (7) ఒక కొత్త ప్రోగ్రాముని, ఎవరన్నా తయారు చేస్తే, దాన్ని పరిశీలించి, దాన్ని 'కృత్రిమ మేధ' రాసిందో, మనుషులు రాశారో, తేల్చి చెబుతుందట. (8) కావలిసిన విధంగా, అన్నిరకాల సినిమాలకీ–సాంఘికాలకీ, జానపదాలకీ, పౌరాణికాలకీ–కథల్నీ, సన్నివేశాల్నీ, సంభాషణల్నీ, పాటల్నీ, సంగీతాన్నీ, దృశ్యాల్నీ... ఇలా ఏ రకం సినిమా తీయదలుచుకున్నారో, ఆ రకంగా చేసిపెడుతుందట! (9) మర మనుషులతోనూ (రోబోట్స్‌తో), మానవరహిత వాహనాలతోనూ (డ్రోన్స్‌తో) రకరకాల వ్యాపారాల శాఖలలో, అతి తక్కువమంది ఉద్యోగులతో పనిచేయిస్తుందట. (10) నేలమీదే కాదు, అంతరిక్షంలో కూడా పరిశోధనల్ని తేలిగ్గా చేసిపెడుతుందట! – ఇలా, ఒకటేమిటి, ఇందు గలదందు లేదని, సందేహము వలదు! ఎందెందు వెతికి చూసిన అందందే, "కృత్రిమ మేధ"ని ఉపయోగించి, కంపెనీలు, ఎన్నో లాభాలు గడించవచ్చునట!



'కృత్రిమ మేధ' వల్ల, కొద్దికాలంలోనే, ప్రపంచవ్యాప్తంగా 30 కోట్ల మందికి ఉద్యోగాలు పోతాయనీ, కేవలం 9 కోట్ల, 70 లక్షల ఉద్యోగాలు మాత్రమే కొత్తగా వస్తాయనీ తేలింది. అయినప్పటికీ, పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు వంకర వాదనలు చేస్తూనే వున్నారు. ఈ టెక్నాలజీ వల్ల తోటి మనుషులకు పనులు పోయే, తిండిపోయే పరిస్థితులు వస్తున్నాయి. ఇదంతా, కేవలం లాభాపేక్షతో నడిచే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం వల్లనే.

కొంతమంది పెట్టుబడిదారులు, ఒక 'కృత్రిమ మేధ' కంపెనీ మొదలుపెట్టి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లని జీతాలకి పెట్టుకుని, కొత్త కొత్త సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాములు రాయిస్తారు. ఆ ప్రోగ్రాములు అనేక రకాలుగా వుంటాయి. ఆస్పత్రులకూ, సైన్సు పరిశోధనలకూ కావలిసినవి ఒక రకం! బ్యాంకులకు కావలిసినవి ఇంకో రకం! పెద్ద పెద్ద యంత్రాలతో నడిచే పరిశ్రమలకి మరో రకం! అంతరిక్ష పరిశోధనలకు ఇంకో రకం ప్రోగ్రాములు! సినిమాలకు అన్నిటినీ మించిన రకం! – ఇలా, 'కృత్రిమ మేధ' అనే సైన్సుతో, రకరకాల ప్రోగ్రాముల్ని తయారు చేయించే కంపెనీలు ప్రపంచంలో దాదాపు 70 వేల దాకా వున్నాయని ఒక లెక్క! ఈ కంపెనీల్లో తయారయ్యే ప్రోగ్రాములన్నీ అమ్మకం కోసం తయారైన సరుకులే! కాకపోతే, అవి సబ్బుల్లాగో, చెప్పులూ, చొక్కాలూ లాగో, వస్తువులుగా వుండవు.

తేలిగ్గా అర్థం చేసుకోవడానికి, 'కృత్రిమ మేధ' అనే దాన్ని, పోలిక కోసం, ఒక పనిముట్టుగా, ఒక యంత్రంగా చెప్పుకోవచ్చు. కాకపోతే, అది ఒక కదిలే యంత్రంలా వుండదు. దాన్ని చేత్తో ముట్టుకోలేము. అది యంత్రాలకి నేర్పడానికి కొన్ని సూత్రాల, సూచనల రూపంలో ('సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాం'గా) వుంటుంది. దానిని ఉపయోగిస్తూ, కొత్తగా శ్రమలు జరుగుతాయి. దాన్ని సరిగా వాడుకుంటే, దాని ఉపయోగాలు దానికుంటాయి. తక్కువ సమయంలో, తక్కువమంది మేధా శ్రామికులతో, ఎక్కువ పని జరగడానికి ఉపయోగపడుతుంది. ఈ కొత్త టెక్నాలజీ, పెట్టుబడిదారీ యజమానుల చేతుల్లో ఆస్తిగా ఉంటుంది కాబట్టి, దీన్ని 'పెట్టుబడిదారీ మేధ' అని అంటే ఎక్కువ సరిగా వుంటుంది! ఎక్కువ లాభాల్ని తెచ్చిపెట్టేదిగా వుంటుంది కాబట్టే, ఈ రంగంలో పెట్టుబడులు క్రమంగా పెరిగిపోతున్నట్టు వార్తలొస్తున్నాయి. 2025లో, ఈ రంగంలో పెట్టుబడులు దాదాపు 16 లక్షల కోట్ల రూపాయలు అవుతాయట!


ఏ కంపెనీలో పెట్టుబడి అయినా, రెండు భాగాలుగా వుంటుంది గదా? (1) సాధనాల కోసం పెట్టే డబ్బు. 'కృత్రిమ మేధ' కంపెనీలలో, ఉత్పత్తి సాధనాలుగా వుండేవి కంప్యూటర్లూ, లాప్‌టాప్‌లూ, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులూ, వగైరా. ఇవి ఎంత సామర్థ్యంగలవిగా వుండాలీ అనేది, తయారు చేయవలిసిన ప్రోగ్రాముల్ని బట్టి వుంటుంది. మామూలు కంప్యూటర్లూ, లాప్‌టాపులూ సరిపోతాయా; లేకపోతే, సూపర్ స్పీడ్ కంప్యూటర్లు కావాలా అనేది వ్యాపార స్థాయిని బట్టీ, ఆ ప్రోగ్రాముల్ని బట్టీ వుంటుంది. (2) ఆ సాధనాలను ఉపయోగించి, రకరకాల, కొత్త కొత్త ప్రోగ్రాములు తయారు చేసే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకి ఇచ్చే జీతాలు. ఈ జీతాలు, సాధారణంగా, ఇతర రంగాల్లో పనిచేసే ఉద్యోగుల జీతాలకంటే, బాగా ఎక్కువగా వుంటాయి. ఎందుకంటే, వీళ్ళు తయారు చేసే ప్రోగ్రాముల్ని వాడే పరిశ్రమల్లోగానీ, ఇతర పని స్థలాల్లో గానీ, ఎక్కువమంది ఉద్యోగులు అవసరం లేకుండానే పని జరిగేలా, 'కృత్రిమ మేధ'తో తయారైన ప్రోగ్రాములు తయారు చేస్తారు కాబట్టి! – అంటే, 'కృత్రిమ మేధ' అనే కొత్త టెక్నాలజీ ఏయే పని స్థలాల్లోకి వస్తుందో, ఆ పని స్థలాల్లో పనులు చేస్తూ వున్న అనేక మందికి ఉద్యోగాలు పోతాయి. దీనికి పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు చెప్పే పరిష్కారం ఏమిటంటే: అక్కడ పనులు పోయినా, 'కృత్రిమ మేధ' కంపెనీల్లో కొత్త ఉద్యోగాలు వస్తాయి అని! కానీ, నిజమైన లెక్కలూ, అంచనాలూ వేరేగా వుంటున్నాయి. 'కృత్రిమ మేధ'కి సంబంధించిన వెబ్‌సైట్ల సర్వేల ప్రకారం, 'కృత్రిమ మేధ'కి సంబంధించిన టెక్నాలజీ వాడడం వల్ల, కొద్ది కాలంలోనే, ప్రపంచవ్యాప్తంగా, 30కోట్ల మందికి ఉద్యోగాలు పోతాయనీ, కేవలం 9 కోట్ల, 70 లక్షల ఉద్యోగాలు మాత్రమే కొత్తగా వస్తాయనీ తేలింది! అయినప్పటికీ, పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు వంకర వాదనలు చేస్తూనే వున్నారు.

కొత్త టెక్నాలజీ వచ్చినప్పుడల్లా, ఈ రకం మాటలు, ఈ నాడే కాదు, 150 ఏళ్ళ కిందట కూడా వుండేవని, మార్క్సు 'కాపిటల్' ద్వారా ఇలా తెలుస్తుంది: "కార్మికులను పనినించీ తొలగించే యంత్రాలన్నీ, అదే తరహా కార్మికులను పనిలో నియమించడానికి తగినంత పెట్టుబడిని, అదే సమయంలో, తప్పనిసరిగా విడుదల చేస్తాయని జేమ్స్ మిల్, మాక్ కులోచ్, టోరెన్స్ సీనియర్, జాన్ స్టువర్ట్ మిల్, ఇంకా మొత్తం వరసగా బూర్జువా రాజకీయ అర్థశాస్త్రజ్ఞులు నొక్కి చెపుతున్నారు...(కానీ) యంత్రాల్లో వచ్చే ప్రతీ మెరుగుదలతోటీ, అది (ఆ పెట్టుబడి) పనిలో నియమించే వారి సంఖ్య తగ్గుతూనే వుంటుంది." ('యంత్రాలూ, ఆధునిక పరిశ్రమలూ' అనే చాప్టర్‌లో.) తేడా అల్లా, మార్క్సు కాలమేమో, ప్రధానంగా భారీ యంత్రాల కాలం. ఇప్పుడేమో, భారీగా వున్న యంత్రాల సామర్థ్యాన్ని మరింత భారీగా మెరుగుపరిచే 'పెట్టుబడిదారీ మేధ' కాలం!

చివరిగా, ఎవరైనా అనవచ్చును: "ఎన్నో గొప్ప ఉపయోగాల్ని ఇచ్చే 'కృత్రిమ మేధ' వంటి టెక్నాలజీని వ్యతిరేకించాలా? గత 200 ఏళ్ళల్లో ఎన్నో రకాల టెక్నాలజీలు రాలేదా? వాటిని ఉపయోగిస్తూనే వున్నాం గదా? కొత్త టెక్నాలజీని వదిలేస్తూ, వెనక్కి, వెనక్కి, గుహల్లో జీవించే కాలానికే తిరిగి పోదామా?" దానికి జవాబు: మంచి టెక్నాలజీని వద్దనడం లేదు. అది సమాజంలో, మానవులందరికీ మంచిదై వుండాలి! దానిని పెట్టుబడిదారీ పద్ధతుల్లో వాడడం వల్ల, శ్రమ దోపిడీ విపరీతంగా జరుగుతున్న విషయాన్ని గుర్తించాలి. తక్కువ సమయంలో, ఎక్కువ పని జరిగి, ఈ టెక్నాలజీతో నడిచే కంపెనీలకు లాభాలు పెరగవచ్చును గానీ, మెరుగైన టెక్నాలజీతో పనిచేసే శ్రామికులకు పని గంటలు తగ్గుతాయా? ఈ టెక్నాలజీ వల్ల, తోటి మనుషులకు పనులు పోయే, తిండి పోయే పరిస్తితులు వస్తున్నాయి. ఇదంతా, కేవలం లాభాపేక్షతో నడిచే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం వల్లనే! దీన్ని వ్యతిరేకించే ఆలోచనా ధోరణినీ, పోరాటాల అవసరాన్నీ గుర్తించాలి! మార్క్సు హెచ్చరించినట్టు, టెక్నాలజీలో "ప్రగతి మరింత తక్కువ కాలంలో, ఒక పద్ధతిలో, మరింత ఎక్కువ పని చేయించుకునేందుకు, అంటే, శ్రమ శక్తిని మరింత తీవ్రంగా దోచుకునేందుకు ఒక సాధనంగా ఎలా ఉపకరిస్తోందో" గమనించాలే గానీ, ఆ టెక్నాలజీ సృష్టించే భ్రమల్లో పడిపోకూడదు!



■ రంగనాయకమ్మ



మహాకుంభస్నానం

త్రివేణీసంగమస్థలిలో
సరస్వతీనది అంతర్ వాహినిగా
మునకలేస్తున్న భక్తజనసందోహం
సాధుమహారాజుల షాహీ స్నానం
అఘోరాల, నాగా సన్యాసుల ఆటవిడుపు
రాజఠీవితో మఠాధీశుల దర్శనం!
గుహల నుంచి వెలుగులోకి వచ్చిన
తాంత్రికయోగసాధకుల విన్యాసం
గంగానది తీరమంతా
అఖాడాల గుడారాల పొడవునా
జనప్రవాహమంతా
విభూతి వైభోగాల జాతరలో
క్లిక్‌మంటున్న–
విదేశీ టూరిస్టు కెమరాలు
దృశ్యాల భూమండలీకరణ!
పుష్కరకాల మహాకుంభ స్నానంతో
సజీవ గంగా ప్రవాహం సాక్షిగా
చెరగని జనుల అనాది విశ్వాసాలు!

– నిఖిలేశ్వర్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి,
800 పదాలకు మించకూడదు.

వీసీలను ముఖ్యమంత్రులే ఎందుకు నిర్ణయించాలి?

విశ్వవిద్యాలయాల ఉపకులపతులను ఎంపిక చేయడానికి గాను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ జనవరి 7న కొత్త నియమాలను విడుదల చేసింది. ఇకపైన దేశం మొత్తంలో వీసీల ఎంపిక ఈ నియమాల ప్రకారమే జరగాలని, లేకుంటే ఆ విశ్వవిద్యాలయాలకు గుర్తింపు ఉండదని, అంతేగాక యూజీసీ నుంచి నిధులు ఉండవని, అసలు ఉన్నత విద్యాసంస్థల జాబితా నుంచే ఆ విశ్వవిద్యాలయాలను తొలగిస్తామని యూజీసీ స్పష్టంగా చెప్పింది. ఈ కొత్త నియమాల ప్రకారం వీసీలను ఎంపిక చేసే సెర్చ్ కమ్ సెలెక్షన్ కమిటీని ఆయా రాష్ట్రాల గవర్నర్లు నియమిస్తారు. ఇందులో ముగ్గురి నుండి ఐదుగురు సభ్యులు ఉండవచ్చు. వీసీల ఎంపికకు దేశవ్యాప్త నోటిఫికేషన్ వస్తుంది. అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పది సంవత్సరాల అనుభవం ఉండాలి. కేవలం ప్రొఫెసర్లు మాత్రమే కాకుండా పరిశ్రమల రంగంలో కాని ఇతర విద్యా కళా శాస్త్ర రంగాలలోని సంస్థలలో పది సంవత్సరాల పాటు పనిచేసిన ప్రతిభావంతులైనవారు, అనుభవజ్ఞులు దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి 65 సంవత్సరాల లోపున ఉండాలి లేదా 70 సంవత్సరాల లోపున పదవి ముగియాలి. రెండోసారి కూడా ఎంపిక కావచ్చు. ఇవి వీసీల నియామకానికి నిర్ణయించిన నియమాలు, అర్హతలు.

ఈ కొత్త నియమాలపైన మిశ్రమ స్పందన వచ్చింది. ఇది రాష్ట్రాలకు ఉన్న అధికారాలను తీసివేసి పూర్తిగా కేంద్ర ప్రభుత్వం చేతిలోనికి తీసుకోవడమని, ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకమని వేరు వేరు రంగాల ప్రముఖులు విమర్శించారు. ప్రొఫెసర్ల నుండి కూడా ఒక పక్షం నుండి విమర్శలు వచ్చాయి. ముఖ్యమంత్రులు కొందరు వ్యతిరేకించారు. కాని ఒక రకంగా చూస్తే ఈ నియమాలు ఇంతకుముందు వాటికన్నా మంచివేనని చెప్పడానికి వీలుంది. ప్రధానంగా రాష్ట్రాలలో ఉన్న మితిమీరిన రాజకీయ జోక్యాన్ని ఇది తగ్గిస్తుందని గట్టిగా చెప్పవచ్చు.

ఇప్పటిదాకా ఉన్న నియమాల ప్రకారం వీసీల ఎంపిక నోటిఫికేషన్‌కు స్పందించి దరఖాస్తు చేసుకున్నవారి నుంచి ఎంపిక చేస్తున్నారు. సెర్చ్ కమ్ సెలెక్షన్ కమిటీ ముగ్గురు సభ్యులతో ఉంటుంది. ఒక సభ్యుడు ఆ యూనివర్సిటీకి చెందిన ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎంపిక చేసిన అభ్యర్థి, మరొకరు యూజీసీ నామినీ, ఇంకొకరు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సభ్యుడు ఉంటారు. ఈ సభ్యుడు రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి కానీ లేదా మరొక తుల్యమైన అధికారి కాని కావచ్చు. వీరు వచ్చిన దరఖాస్తుల నుండి ముగ్గురు అభ్యర్థుల జాబితాను ఎంపిక చేసి గవర్నర్‌కి పంపిస్తే అందులో ఒక పేరును గవర్నర్ ఎంపిక చేస్తే, ఆ వ్యక్తి వీసీగా నియమితుడు అవుతాడు. ఇది జరగవలసిన పద్ధతి.

కానీ ఈ జరగవలసిన పద్ధతిలో ఎప్పుడూ జరగలేదు. పోలీస్ విచారణ ద్వారా అభ్యర్థుల ఉద్యోగ వ్యక్తిగత నేపథ్యాలను, అతని కార్యనిర్వహణ దక్షత, నిజాయితీ వగైరా వివరాలను సేకరించి దాని ఆధారంగా జాబితాను కుదిస్తారు. వారిలో నుండి ముగ్గురు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సెర్చ్ కమిటీ అనే పేరు వచ్చిన కారణం ఒకటి ఉంది. గొప్ప వ్యక్తులు కాని లేదా ఆయా రంగాలలో గొప్ప సేవలు చేసినవారు కాని దరఖాస్తు చేసుకోకపోయినా కూడా అటువంటి నిపుణులను సెర్చ్ కమిటీ ఎంపిక చేసి గవర్నర్‌కి పంపించవచ్చు. అందుకే దీన్ని 'సెలక్షన్' కమిటీ అని మాత్రమే అనకుండా 'సెర్చ్ కమ్ సెలెక్షన్ కమిటీ' అన్నారు. కానీ ఇలాంటి అవకాశాన్ని ఏ కమిటీ కూడా ఉపయోగించుకున్న దాఖలాలు తెలుగు రాష్ట్రాలలో కాని ఇతర రాష్ట్రాలలో కాని కనిపించవు. ఈ దరఖాస్తు పద్ధతి లేని పూర్వపు రోజులలో ప్రభుత్వం రాజకీయ జోక్యం లేకుండా ఇలాంటి గొప్పవారిని, నిపుణులను వీసీలుగా ఎంపిక చేశాయి. జడ్జీలు, గొప్ప శాస్త్రవేత్తలు అలా వీసీలుగా ఎంపికైనారు. ఆ మంచి రోజులను నేడు ఊహించలేము.



ముఖ్యమంత్రులే నేరుగా జోక్యం చేసుకొని నచ్చిన అభ్యర్థి పేరును ప్రభుత్వ నామినీ ద్వారా సెర్చ్ కమిటీలోకి తెచ్చి తక్కిన రెండూ డమ్మీ పేర్లు పెట్టించి ఆ ముగ్గురు అభ్యర్థుల జాబితాని గవర్నర్‌కి పంపించడం, ప్రభుత్వం విషయంలో నేనెందుకు జోక్యం చేసుకోవడం అని గవర్నర్లు ప్రభుత్వ ప్రతినిధి సూచించిన వ్యక్తినే వీసీగా ఎంపిక చేసి పంపించడం అనే ప్రహసనం దాదాపు అన్ని రాష్ట్రాలలోనూ జరుగుతున్నది. ఈ పద్ధతితో పోలిస్తే వీసీల సెర్చ్ కమిటీ ఎంపిక గవర్నర్ ద్వారా జరిగితేనే రాజకీయ జోక్యం బాగా తగ్గే వీలుంది.

నేడు జరుగుతున్న ఎంపిక ఈ నియమ నిబంధనలు అన్నింటినీ తుంగలో తొక్కి పూర్తిగా రాజకీయమయంగా సాగుతున్నది. ముఖ్యమంత్రులే నేరుగా జోక్యం చేసుకొని వారికి నచ్చిన అభ్యర్థి పేరును ప్రభుత్వ నామినీ ద్వారా సెర్చ్ కమిటీలోకి తెచ్చి తక్కిన రెండూ డమ్మీ పేర్లు పెట్టించి ఆ ముగ్గురు అభ్యర్థుల జాబితాని గవర్నర్‌కి పంపించడం, ప్రభుత్వం విషయంలో నేనెందుకు జోక్యం చేసుకోవడం అని గవర్నర్లు ప్రభుత్వ ప్రతినిధి సూచించిన వ్యక్తినే వీసీగా ఎంపిక చేసి పంపించడం అనే ప్రహసనం దాదాపు అన్ని రాష్ట్రాలలోనూ జరుగుతున్నది. ఈ రాజకీయ జోక్యం అన్నిటికన్నా తమిళనాడులోనే ఎక్కువ ఉందని వార్తలు వచ్చాయి. అందుకే తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ కొత్త నియమాలను పూర్తిగా వ్యతిరేకిస్తూ ప్రకటన చేశారు.

ఈ రాజకీయ తంతు వేర్వేరు రాష్ట్రాలలో ఎన్ని రకాలుగా ఉందో ఇక్కడ ఒకసారి గమనించవచ్చు. ఒక కులసంఘం నాయకుడు తమ ప్రాపకంలోని ఒక ఆచార్యుని తమ కులానికే చెందిన లేదా తన జిల్లాకే చెందిన మంత్రివర్యుని వద్దకు తీసుకుపోయి మన అభ్యర్థిని వీసీని చేయాలని కోరడం, సదరు మంత్రి ముఖ్యమంత్రితో ఆ పని చేయించడం ఒక పద్ధతి. లేదా ఒక మంత్రే తమ అభ్యర్థిని ఏ విధమైన ప్రభావంతోనైనా, ప్రాధాన్యంతోనైనా సరే ఎంపిక చేసుకొని ముఖ్యమంత్రితో ఎంపిక చేయించడం ఇంకో పద్ధతి. ముఖ్యమంత్రి ఆశీస్సులే ఒక అభ్యర్థికి నేరుగా ఉండి ఎంపిక కావడం మరో పద్ధతి. ఈ క్రమంలోనే వీసీలుగా అగ్రకులాలవారు కొందరు, బీసీలు కొందరు, మైనారిటీలు కొందరు, ఎస్సీ ఎస్టీలు కొందరు ఎంపిక అవుతారు. మేము సామాజిక న్యాయాన్ని పాటించి అభ్యర్థులను ఎంపిక చేశాం అని ప్రభుత్వాలు గర్వంగా చెప్పుకుంటాయి. కానీ అసలు పాటించింది తమకు కావలసిన రాజకీయ న్యాయాన్ని. ఒక మంత్రిగారు "నా జిల్లాలో వీసీ పదవిని నాకు తెలియకుండా, నేను చెప్పిన వారికి కాకుండా ఎలా ఎంపిక చేస్తారు" అన్నారట! ఈ క్రమంలో నిపుణులైనవారు, పరిపాలన అనుభవం ఉన్నవారు, విజ్ఞులైనవారు కాకుండా, అయోగ్యులైన వారు ఎంపిక కావడం చాలాసార్లు జరిగింది.

ఈ పద్ధతితో పోలిస్తే వీసీల సెర్చ్ కమిటీ ఎంపిక గవర్నర్ ద్వారా జరిగితేనే రాజకీయ జోక్యం బాగా తగ్గే వీలుంది అని స్పష్టంగా చెప్పవచ్చు. ఎన్నో గ్రంథాలు రాసి, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది, నిజాయితీ కలిగిన అభ్యర్థులు ఎంపిక కాకుండా, ఒక్క పుస్తకం కూడా రాయనివారు, కొద్ది నెలలు కూడా పరిపాలన అనుభవం లేనివారు వీసీలుగా ఎంపికైన దుర్మార్గపు పరిస్థితులు ఇప్పటిదాకా చాలా జరిగాయి. వీసీలను ముఖ్యమంత్రి, మంత్రులు ఎంపిక చేసే ఈ దుష్ట రాజకీయ సంప్రదాయం కన్నా గవర్నర్ ద్వారా చేసే పద్ధతిలోనే రాజకీయ జోక్యం దూరంగా ఉండే అవకాశం ఉంటుంది. అంతే కాదు, కొత్త నియమాల ద్వారా శాస్త్ర కళా రంగాలకు, పరిశ్రమల రంగానికి కూడా చెందిన నిపుణులు అనుభవజ్ఞులు కూడా వీసీలు అయ్యే అవకాశం ఉంది. కనుక ఈ యూజీసీ కొత్త నియమాలను, కనీసం ఒక ప్రయోగ స్థాయికైనా అంగీకరించి అమలు చేస్తే మంచిది. రాజకీయ జోక్యం రాష్ట్ర మంత్రులు, ముఖ్యమంత్రుల స్థాయిలో జరిగే దానికీ దీనికీ ఉన్న తేడాని గమనించి ఏది ఉత్తమమైనదో నిర్ణయించుకునే అవకాశమైనా దీనివల్ల దొరుకుతుంది. కనుక కొత్త యూజీసీ నియమాలకు స్వాగతం చెబుదాం.

◆ ప్రొఫెసర్ పులికొండ సుబ్బాచారి

మేడారంలో ఘనంగా తిరుగువారం
• ప్రత్యేక పూజలు నిర్వహించిన పూజారులు 7



గద్దెల వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



గులాబీలో.. డైలమా!

- ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంపై శ్రేణుల్లో అసంతృప్తి
- ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాల్లో స్వతంత్రులుగా బీఆర్ఎస్ నేతలు
- వరంగల్ నుంచి సుందర్‌రాజ్, కరీంనగర్ నుంచి రవీందర్‌సింగ్, శేషగిరిరావు పోటీ
- పార్టీ మద్దతు లేకుండానే బరిలో దిగిన నేతలు
- క్యాడర్ తమ పార్టీ నేతలవైపా? బీజేపీ వైపా?
- మద్దతు ఎవరికనేదానిపై అయోమయం
- 2019లో పీఆర్‌టీయూ, స్వతంత్రులకు మద్దతిచ్చిన గులాబీదళం
- ఈసారి వారి మద్దతు కోరని ఉపాధ్యాయ సంఘాలు
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో కాంగ్రెస్ అపన్నహస్తం ఎవరికో?
- మద్దతు విషయమై ఆ పార్టీ నాయకుల్లోనూ ఉత్కంఠ 7

ఓ వైపు వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు.. మరోవైపు కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉపాధ్యాయ, పట్టభద్రుల పోరుతో సర్వత్రా రాజకీయ సందడి కనిపిస్తోంది. ఆయా నియోజకవర్గాల్లో బీజేపీ ప్రచారంలో జోష్ చూపుతుండగా.. కరీంనగర్ పట్టభద్రుల స్థానంలో కాంగ్రెస్ కూడా ప్రచారం పర్వంలో ముందుకు సాగుతోంది. కానీ 'గులాబీ' కేడర్ మాత్రం డైలమాలో ఉంది. ఈ ఎన్నికల్లో తమ పార్టీ విధానం ఏంటనే దానిపై స్పష్టత లేక.. ఏ పార్టీకి, ఏ సంఘానికి, ఏ అభ్యర్థికి మద్దతివ్వాలనే దానిపై అధిష్ఠానం నుంచి అధికారిక ప్రకటన లేక శ్రేణులు అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. మరోవైపు అధిష్ఠానం పోటీకి దూరమని ప్రకటించిన నేపథ్యంలో పార్టీ టికెట్ ఆశించిన పలువురు నేతలు స్వతంత్రులుగా బరిలో దిగగా.. వారికి కూడా పార్టీ మద్దతు ప్రకటించకపోవడం మరింత గందరగోళానికి దారితీస్తోంది. ప్రస్తుతం బీఆర్ఎస్ ఉన్న రాజకీయ పరిస్థితులను బేరీజు వేసుకుంటున్న ఉపాధ్యాయ సంఘాలు ఆ పార్టీ మద్దతు కోసం ప్రయత్నించడం లేదు. చివరకు గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీ మద్దతు పొందిన ఉపాధ్యాయ సంఘాలు కూడా ఆసక్తి చూపడం లేదనే ప్రచారం జరుగుతోంది. ఇక రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో అభ్యర్థులను బరిలో దించని కాంగ్రెస్.. కేవలం కరీంనగర్ పట్టభద్రుల స్థానంలో మాత్రమే అభ్యర్థిని పోటీకి పెట్టింది. ఈ క్రమంలో వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల్లో విలీనమైన పూర్వ కరీంనగర్ జిల్లాకు చెందిన ఎనిమిది మండలాల్లోని 7,068మంది పట్టభద్రులు, 249మంది ఉపాధ్యాయ ఓటర్లు ఎటువైపు మొగ్గుచూపుతారోనన్న చర్చ జరుగుతోంది.

- ఆంధ్రజ్యోతి, వరంగల్ ప్రతినిధి

పీఎంశ్రీ పాఠశాలల్లో స్వీయ రక్షణలో శిక్షణ కార్యక్రమాలు

- పీవీ విజ్ఞాన కేంద్రం పనులను పూర్తి చేయాలి
- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లోని విద్యార్థులకు స్వీయ రక్షణకు సంబంధించి కరాటే, మార్షల్ ఆర్ట్స్‌లను శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. మంగళవారం రాత్రి భీమదేవరపల్లి మండలంలోని వంగరలోని డాక్టర్ పీవీ రంగారావు బాలికల గురుకుల పాఠశాలలో హాస్టల్ నిద్ర చేయగా, బుధవారం ఉదయం 5గంటల నుంచి విద్యార్థుల దైనందిన కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఉదయం వేళ యోగా, వ్యాయామం చేయగా కలెక్టర్ పరిశీ లించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నా రు. విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబర్చి జిల్లాకు మంచి పేరుకు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు మంచి ఫలితాలతో ప్రతిభ కనబర్చాలన్నారు. విద్యార్థు లకు పరీక్ష ప్యాడ్లు, నోట్స్ బుక్స్ అందజేశారు. పాఠశా లకు మిషన్ భగీరథ నీరు త్వరితగతిన వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు మంచి మా ర్కులు సాధించే విధంగా కృషి చేయాలని ప్రిన్సిపాల్ ఆఫ్రీన్, ఎంఈవో సునీతరాణి, వైస్ ప్రిన్సిపాల్ భార్గవిలకు సూచించారు.



నవోదయ విద్యాలయం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

నవోదయ విద్యాలయం కోసం స్థల పరిశీలన

మండలంలోని వంగర గ్రామ పరిధిలో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు కోసం ప్రభుత్వ భూములను కలెక్టర్ ప్రావీణ్య బుధవారం పరిశీలించారు. ఇందుకోసం 30 ఎకరాల ప్రభుత్వ భూమి వంగరలో కావాల్సి ఉండగా, అందుకు ప్రభుత్వ భూమిని పరిశీలించారు. విద్యాలయం ఏర్పాటు కోసం ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

విజ్ఞాన కేంద్రం పనులను పూర్తి చేయాలి..

వంగరలోని పీవీ విజ్ఞాన కేంద్రం పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె ఆడిటోరియం, మ్యూజియం, గ్రీనరీ, పెయింటింగ్, హైమాస్ట్ లైటింగ్ ఏర్పాట్లు తదితర వాటిని పరిశీలించారు. పీవీ విజ్ఞాన కేంద్రంలోని అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. వచ్చే నెలలో పీవీ విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

పౌల్ట్రీ షెడ్ నిర్మాణ పనుల పరిశీలన

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మహిళా శక్తి ఉపాధి భరోసా కింద భీమదేవరపల్లిలో నిర్మిస్తున్న పౌల్ట్రీ షెడ్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. మండలంలో ఎన్ని పశువుల కొట్టాలు మంజూరయ్యాయని అడిగి తెలుసుకున్నారు. 2024-25 సంవత్సరానికి జిల్లాలో 21 లక్షల పనిదినాలు కల్పించాల్సి ఉండగా, 19 లక్షల పని దినాలను కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో మేన శ్రీను, అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో వీరేశం, ఏపీవో కుమారస్వామి, ఏపీఎం దేవానంద్, పంచాయతీ కార్యదర్శి వినయ్‌కిరణ్, రైతులు మడిపల్లి సదానందం, తాళ్లపల్లి సదానందం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ సత్య శారద

ఇష్టంతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలి

ఖిలావరంగల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టంతో చదివి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. మధ్యకోటలోని ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను బుధవారం సాయంత్రం ఆమె పరిశీలించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి జవాబులను రాబట్టారు. వార్షిక పరీక్షల్లో పదికి పది పాయింట్లు సాధించాలన్నారు. పదేళ్ల తర్వాత ఎటువంటి ఉద్యోగంలో స్థిరపడాలని అనుకుంటున్నారో ఇప్పుడే నిర్ణయించుకోవాలన్నారు. క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్షప్యాడ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విజయలక్ష్మి, ఖిలావరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, ఎంఈవో ప్రసాద్, ఉపాధ్యాయులు శైలేందర్, భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ తనిఖీ

వరంగల్ కలెక్టరేట్ : హనుమకొండ రాంనగర్‌లోని వరంగల్ జిల్లాకు చెందిన ప్రభుత్వ ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ సత్యశారద బుధవారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులు, వంట గది, డార్మెట్రీ తనిఖీ చేశారు. వంట చేస్తున్న తీరును పరిశీలించి నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని వారికి సూచించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే రైతులకు నష్టపరిహారం ఇప్పిస్తాం

- బీసీ కులగణనకు బీజేపీ వ్యతిరేకం కాదు..
- బ్యూరోక్రాట్లు నిబంధనల మేరకు పనిచేయాలి
- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎంపీ ఈటల రాజేందర్

మిల్స్‌కాలనీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం రాష్ట్ర ప్రభుత్వం భూమిని కేటాయిస్తే కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. వరంగల్ - నల్లగొండ - ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన బుధవారం వరంగల్ ఓసిటీలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు నివాసంలో విలేకరులతో మాట్లాడారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూమి కోల్పోతున్న రైతులకు పార్లమెంట్‌లో చేసిన చట్టప్రకారం మూడు రెట్లు నష్టపరిహారం చెల్లించాలన్నారు. కోట్ల రూపాయల విలువైన భూములకు లక్షల రూపాయలు చెల్లిస్తాననడంతోనే సమస్య జటిలమవుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధరలను సవరించని కారణంగా రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. రైతులకు నష్టం వాటిల్లితే బీజేపీ అండగా



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

ఉంటున్నారు. బీజేపీ ప్రభుత్వం నేషనల్ హైవేలను శరవేగంగా నిర్మిస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తోందన్నారు.

కులగణనకు బీజేపీ వ్యతిరేకం కాదని ఈటల స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఒకే ప్రాతిపదికన కులగణనకు అవకాశమే లేదన్నారు. రాష్ట్రంలో కులగణన చేపట్టిన విధానం తప్పు అని కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకుందని, అందుకే మరోసారి కులగణన చేస్తోందని విమర్శించారు. శాస్త్రీయంగా, చట్టబద్ధతతో కులగణన చేపడితే బీజేపీ తప్పకుండా స్వాగతిస్తుందన్నారు. కులగణనపై రాహుల్‌కు అవగాహన ఉందా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌పై రేవంత్ రెడ్ బుక్‌రాసిన విధంగానే రేవంత్‌పై బీజేపీ ఆరంజ్ బుక్ రాస్తోందని, ఆయన చేసిన పాపపు చిట్టాలు బయటపెట్టే రోజు వస్తుందని హెచ్చరించారు. గతంలో పాలించిన బీఆర్ఎస్ ప్రజల నమ్మకాన్ని కోల్పోతే.. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో వైఫల్యం చెందిందన్నారు. బ్యూరోక్రాట్లు నిబంధనల మేరకు విధులను నిర్వర్తించాలని, ప్రభుత్వ పెద్దలు, నాయకులు చెప్పినట్లు చేయవద్దని హితవుపలికారు.

ఉపాధ్యాయ, అధ్యాపకవర్గాలు మొత్తం బీజేపీ అభ్యర్థికే మద్దతు తెలుపుతున్నాయని ఈటల పేర్కొన్నారు. కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయ, అధ్యాపకులు పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. విద్యా వ్యవస్థను గత ప్రభుత్వం భ్రష్టుపట్టిస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అదే దారిలో నడుస్తోందన్నారు. ఉపాధ్యాయులకు 5 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, 317 జీవోతో ఉపాధ్యాయ, ఉద్యోగుల్లో ప్రశాంతత కరువైందని, నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాలేదని అన్నారు. ఎమ్మెల్సీలుగా ఎన్నికైనవారు పార్టీలకు తొత్తులుగా మారుతున్న తరుణంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి ప్రజల పక్షాన నిలుస్తున్న బీజేపీ నాయకులనే గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి, మాజీ ఎంపీ సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంటా రవికుమార్, రావు పద్మ, రత్నం సతీష్‌షా, జిల్లా ప్రధానకార్యదర్శి బాకం హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు
• వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ 6

అంబాల - నేరేళ్ల మధ్య ప్రవహిస్తున్న వాగును పరిశీలిస్తున్న సీపీ

స్మార్ట్ సిటీ నిధులు సద్వినియోగం చేసుకోండి

- జాతీయ హౌసింగ్ సొసైటీ జాయింట్ సెక్రెటరీ రూపా మిశ్రా
- ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణ

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ సిటీ నిధులను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ ఎఫైర్ జాయింట్ సెక్రెటరీ రూపామిశ్రా కోరారు. దేశవ్యాప్తంగా స్మార్ట్‌సిటీ పథకంలో భాగంగా ఎంపికైన నగరాల మేనేజింగ్ డైరెక్టర్లు, కమిషనర్లు, అధికారులతో బుధవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ నుంచి బల్దియా కమిషన్ అశ్విని తానాజీ వాకడే పాల్గొని స్మార్ట్ సిటీ పథకంలో బాగంగా కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా రూపామిశ్రా మాట్లాడుతూ.. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా వివిధ అబివృదిధ పనులకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను మార్చి 2025 నాటికి ఖర్చు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, స్మార్ట్‌సిటీ పీఎంసీ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీ పనులను గడువులోపు పూర్తి చేయండి

స్మార్ట్‌సిటీ పనులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. వరంగల్ నగరంలో స్మార్ట్‌సిటీ పథకంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను బుధవారం కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా



రాజాజీనగర్‌లో స్మార్ట్‌సిటీ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

టీచర్స్‌కాలనీ ఫేజ్-1లో సీసీ రోడ్డు, 52వ డివిజన్ రాజాజీనగర్ కల్వర్టు పనులు, పద్మాక్షి రోడ్డులో సీసీ రోడ్డు, డ్రైన్, నయీంనగర్‌లో రిటైనింగ్ పనులతో పాటు వడ్డెపల్లి బండ్‌పై కొనసాగుతున్న పనులను కమిషనర్ కొలతల ద్వారా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, డీఈలు రవికిరణ్, అజ్మీరా శ్రీకాంత్, స్మార్ట్‌సిటి పీఎంజీ భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరాజులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు కోసం పని చేయండి

స్వచ్ఛ సర్వేక్షణ్-2024లో మెరుగైన ర్యాంకు కోసం పని చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. బుధవారం బల్దియా కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం 54 ఇండికేటర్స్, 166 సబ్ ఇండికేటర్స్ లక్ష్యాలను సూచించిందన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. సీఎంహెచ్‌వో, ఎంహెచ్‌వో సహకారంతో 66డివిజన్‌ల పరిధిలోని అన్ని కాలనీలలో స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్‌లు ప్రసన్నరెడ్డి, రవీందర్, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, టెంసీ కంజర్ల రమేష్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పార్కుల పునరుద్ధరణ పనులు చేపట్టాలి

పార్కుల పునరుద్ధరణ పనులలో వేగం పెంచాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. బుధవారం బల్దియా కార్యాలయంలో హార్టికల్చర్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలోని పార్కులలో సివిల్, ఎలక్ట్రికల్ పనులతోపాటు ఓపెన్ జిమ్‌లను మరమ్మతు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో చీఫ్ హార్టికల్చర్ అధికారి పలాస రమేష్, అధికారి లక్ష్మారెడ్డి, అసిస్టెంట్లు ప్రిన్సి, ప్రవళిక, ప్రియాంక, అనూహ్యతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించండి


శివరాత్రి వేడుకల ఆహ్వానపత్రాన్ని మంత్రికి అందిస్తున్న ఉపేంద్రశర్మ

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాకతీయుల కాలం నుంచి అనాదిగా ప్రసిద్ధి పొందిన శివాలయాలకు నిలయమైన ఓరుగల్లు ఉమ్మడి జిల్లాలోని అన్ని ఆలయాల్లో మహాశివరాత్రి పర్వదిన వేడుకలను భక్తుల మనోభావాలకు అనుగుణంగా నిర్వహించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. బుధవారం వేయిస్తంభాల ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఈ నెల 25 నుంచి రుద్రేశ్వరాలయంలో జరిగే మహాశివరాత్రి పర్వదిన వేడుకలకు ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మహాశివరాత్రి వేడుకలు జరిగే అన్ని ఆలయాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం సహకారం తీసుకోవాలని దేవాదాయ శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. జాగరణ ఉండే భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు, రద్దీ అధికంగా ఉండే వేయిస్తంభాల గుడిలాంటి ఆలయాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.

ఈవోగా అనిల్ కుమార్

ఒకవైపు మహాశివరాత్రి వేడుకలు ప్రారంభం కానున్న తరుణంలో చారిత్రక వేయిస్తంభాల ఆలయ ఈవోగా పని చేస్తున్న వెంకటయ్యను ఆలయ ఎఫ్ఏసీ ఈవోగా బాధ్యతల నుంచి తప్పించారు. ఈ మేరకు దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కె.జ్యోతి పేరిట బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇదే క్రమంలో జిల్లా దేవాదాయ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న డి.అనిల్ కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు ఇస్తూ వేయిస్తంభాల ఆలయ ఈవోగా విధులు నిర్వహించాలని తక్షణమే ఉత్తర్వులు అమలులోకి వస్తాయని అడిషనల్ కమిషనర్ ఉత్తర్వులో పేర్కొన్నారు.


అంబాల చెక్ పోస్ట్ వద్ద సూచనలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

కమలాపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు. బుధవారం మండలంలో అంబాల - నేరెళ్ల గ్రామాల మధ్య వాగును సీపీ పరిశీలించారు. ప్రధానంగా రవాణా దారులు ఇసుకను అక్రమంగా తరలించే మార్గాలపై సీఐ హరికృష్ణను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా అక్రమంగా ఇసుక తరలించే వారి సమాచారాన్ని అందుబాటులో ఉంచుకోవడంతో పాటు వారి కార్యకలాపాలపై దృష్టి సారించాలని సీపీ ఆదేశించారు.

అంబాల చెక్ పోస్ట్ తనిఖీ

అక్రమ ఇసుక రవాణా కట్టడి కోసం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా కమలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబాల శివారు ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఇసుక చెక్‌పోస్ట్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా సీపీ తనిఖీ నిర్వహిస్తున్న తీరును చెక్ పోస్ట్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తనిఖీలు జరిపే సమయంలో సిబ్బంది తప్పనిసరిగా తనిఖీ చేసిన వాహన వివరాలను నమోదు చేసుకోవాలని, ఇసుక తరలించే వాహనాలకు అనుమతి పత్రాలు ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. నిరంతరం ఇసుక రవాణా వాహనాలపై నిఘా పెట్టాలని సూచించారు.

నేటి నుంచి ఎస్డీఎల్‌సీఈ జర్నలిజం పరీక్షలు షురూ

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం అందిస్తున్న ఎంఏ జర్నలిజం మాస్ కమ్యూనికేషన్ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ 2023-24 ఏడాది విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పద్మజలు తెలిపారు. ఫిబ్రవరి 20, 22, 24, 27, మార్చి 1, 2వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడలని కోరారు.

మార్చి 4 నుంచి సైకాలజీ సెమిస్టర్ పరీక్షలు

కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం అందిస్తున్న ఎంఎస్సీ సైకాలజీ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ 2023-24 ఏడాది విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. మార్చి 4, 6, 10, 12వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు.అలాగే ప్రాక్టికల్స్ పరీక్షలు మార్చి 15, 16, 17, 18, 19, 20 తేదీల్లో బ్యాచ్‌ల వారికీగా జరుగుతాయని వెల్లడించారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడలని కోరారు.

- కేయూ దూరవిద్య కేంద్రం అందిస్తున్న ఎంఏ, ఎంకామ్ కోర్సుల మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ 2023-24 ఏడాది విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ఎంఏ ఇంగ్లీష్, తెలుగు, హిందీ, సంస్కృతం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, ఎంహెచ్ఆర్ఎం, ఎంకామ్ పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. పరీక్షలు ఫిబ్రవరి 20, 22, 24, మార్చి 1, 2, 3వ తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడలని కోరారు.

27వ తేదీన జరగాల్సిన పరీక్ష వాయిదా

ఫిబ్రవరి 27వ తేదీన జరగాల్సిన దూరవిద్య కేంద్రం పీజీ కోర్సుల పరీక్ష వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా 27న జరిగే ఒక్క రోజు పరీక్షను మార్చి 5వ తేదీకి వాయిదా వేసినట్లు స్పష్టం చేశారు. మిగతా పరీక్షలన్నీ యథావిధిగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులు

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కేంద్రంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో కొత్త కోర్సులు ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నర్సయ్య బుధవా రం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం బీఏ, బీకామ్, బీఎస్సీ(లైఫ్ సైన్స్), బీఎస్సీ (ఫిజికల్ సైన్స్) కోర్సులు నడుస్తుండగా 2025-26 విద్యా సంవత్సరం నుంచి బీబీఏ (జనరల్), బీఎస్సీ (ఫార్మసీ), కం ప్యూటర్ సైన్స్‌లో డేటా సైన్స్, ఆర్టిఫిషీయల్ ఇంటిలిజెన్స్ కోర్సులు ప్రారంభిస్తామన్నారు. విద్యార్థులు దోస్త్ ద్వారా కళాశాలలో అడ్మిషన్ పొందాలన్నారు.

సేవాలాల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- తండాల అభివృద్ధికి కృషి చేస్తా: ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- వేడుకల్లో ఎమ్మెల్యే, ఎంపీ నృత్యం


సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలతో ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ జీవితాన్ని బంజారా, గిరిజనులే కాకుండా ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. ఘన్‌పూర్‌లోని పద్మావతి గార్డెన్‌లో బుధవారం ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన సేవాలాల్ జయంతి వేడుకలకు ఎంపీ కడియం కావ్యతో కలిసి పాల్గొన్నారు. అంతకుముందు బంజారా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి ఎంపీ, ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఎంపీ బంజారాల సంప్రదాయ దుస్తులు ధరించి వారితో సంప్రదాయ పద్ధతిలో నృత్యం చేశారు. కడియం సైతం బంజారాలతో కలిసి స్టెప్పులు వేశారు. సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గిరిజన సంప్రదాయాల ప్రకారం భోగ్ బండార్ సమర్పించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ సేవాలాల్ బోధనలు సమాజ శ్రేయస్సుకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. రాష్ట్రం జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గంలోని అన్ని తండాల్లో రూ.50 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 22 తండాలను జీపీలుగా మార్చానని, 22 తండాల్లో జీపీ భవనాల నిర్మాణానికి రూ.25లక్షల చొప్పున నిధులు మంజూరి చేయించానన్నారు.

బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ : ఎంపీ

బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ అని ఎంపీ కడియం కావ్య అన్నారు. సేవాలాల్ మార్గదర్శకంలో గిరిజన, బంజారాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. జంతుబలులు, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా గిరిజనులను చైతన్య పరిచిన మహనీయుడు సేవాలాల్ అని కొనియాడారు. నియోజకవర్గంలో రోడ్లు, కమ్యూనిటీహాల్స్ నిర్మాణానికి ఎంపీ నిధులు కేటాయిస్తానని తెలిపారు. త్వరలోనే కడియం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ ఏర్పాటు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ జూలకుంట్ల లావణ్య-శిరీష్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రాంబాబు, గోర్ బంజార గురువు మహేష్ మహరాజ్, బానోతు రాజేష్ నాయక్, భూక్య స్వామినాయక్, భూక్య రమేష్ నాయక్, లకావత్ చిరంజీవి నాయక్, కొర్ర వెంకటేష్, భూక్ర శ్రీనివాస్, బదావత్ రవి, హుస్సేన్ నాయక్, భిక్షపతి నాయక్, లక్ష్మణ్, లచ్చిరాం, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

దూడపై హైనా దాడి!


హైనా దాడిలో మృతి చెందిన దూడ

జఫర్‌గడ్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలంలోని ఏబీ తండా(శంకర్ తండా)లో మంగళవారం రాత్రి ఓ దూడపై హైనా దాడి చేసి చంపింది. ఏబీతం డాకు చెందిన రైతు లకావత్ తిరుపతి మంగళవారం తండా చివరన తన వ్యవసాయ పంట క్షేత్రంలో పనులు ముగించుకుని రాత్రి ఓ బర్రె, దూడను జొన్న చేనులో కట్టేసి ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి సమయంలో హైనా దూడపై దాడి చేసి చంపేసి వెళ్లిపోయింది. రైతు తిరుపతి బుధవారం ఉదయం వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి చూసేసరికి దూడ మృతి చెంది ఉంది. వెంటనే అటవీ శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వగా సిబ్బంది (వాచర్లు) మోహన్, సంతోష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చుట్టూ పరిసరాలను పరిశీలించిన వారు హైనాయే ఈ ప్రాంతంలో సంచరిస్తూ దూడపై దాడి చేసినట్టు ప్రాథమిక అంచనాకు వచ్చారు. విషయాన్ని అటవీ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ ఘటనతో రైతులు భయాందోళన చెందుతున్నారు.

ఆటోడ్రైవర్ అనుమానాస్పద మృతి


ఉప్పలయ్య మృతదేహం

హనుమకొండటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని సుబేదారి పోలీసుస్టేషన్ పరిధి హంటర్‌రోడ్‌లో ఆటోడ్రైవర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. సుబేదారి సీఐ సత్యనారాయణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లాకు చెందిన ఉప్పలయ్య (60) సుమారు 30 ఏళ్లుగా హైదరాబాద్‌లో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఉప్పలయ్య మంగళవారం హనుమకొండకు వచ్చి ఇక్కడ ఆటో నడుపుతున్నట్లు స్థానికులు తెలిపారు. కాగా, బుధవారం మధ్యాహ్న సమయంలో హంటర్‌రోడ్‌లోని వరంగల్ పబ్లిక్‌స్కూల్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. పోలీసులకు సమాచారం రావడంతో వెంటనే సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి, ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా సంఘటన స్థలానికి చేరుకొని మృతికి గల కారణాలు, సీసీ కెమెరాలు పరిశీలించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎంకు తరలించినట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు. అయితే ఆటో డ్రైవర్ వెనుక సీటులో మృతి చెంది ఉండటంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కూతురిని చూసేందుకు వెళ్తుండగా..

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి


మధు (ఫైల్)

ఐనవోలు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉన్న కూతురును చూసేందుకు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని తండ్రి మృతి చెందాడు. ఈ సంఘటన పున్నేలు శివారు ఏకశిల పాఠశాల ఎదుట హైవేపై బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన నాంపెల్లి మధు(35) కూరగాయల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయనకు ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు. పెద్ద కూతురు తేజస్విని హసన్‌పర్తి గురుకులంలో 6వ తరగతి చదువుతోంది. కూతురిని చూసేందుకు సాయంత్రం 4 గంటలకు ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఏకశిల పాఠశాల ఎదుట గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మధుకు భార్య మమత, ముగ్గురు చిన్న పిల్లలు, తల్లిదండ్రులు ఉన్నారు. ఇల్లంద, వర్ధన్నపేట, కట్ర్యాల గ్రామాల్లో కూరగాయలు విక్రయించే మధు అందరికీ సుపరిచితుడు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని తెలియడంతో గ్రామాల్లో విచారం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్‌కు అభినందన


నిఖిల్ స్వరూప్‌ను అభినందిస్తున్న ఆరోగ్యశ్రీ యూనియన్ సభ్యులు

వరంగల్ మెడికల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉమ్మడి జిల్లా నూతన కో ఆర్డినేటర్ డాక్టర్ నిఖిల్ స్వరూప్‌ను బుధవారం డిస్ట్రిక్ట్ మేనేజర్ విక్రమ్ ఆధ్వర్యంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ యూనియన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఆరోగ్యమిత్రలకు ఈ సందర్భంగా డాక్టర్ నిఖిల్ స్వరూప్ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్టేట్ జనరల్ సెక్రటరీ మామిడిపల్లి కుమార్, వరంగల్ ఉమ్మడి జిల్లా జనరల్ సెక్రటరీ నల్లబెల్లి అనిల్, ట్రెజరర్ రాము, జాయింట్ సెక్రటరీ రజిత, చక్రపాణి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

వరంగల్‌కు 'ఇంటర్ స్పాట్' కేటాయింపు

వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ బోర్డు వరంగల్ జిల్లాకు ఇంటర్ స్పాట్ క్యాంపును కేటాయించినట్లు డీఐఈవో డాక్టర్ జి.శ్రీధర్ సుమన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత విద్యా సంవత్సరం వరకు హనుమకొండ జిల్లా కేంద్రంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన ఇంటర్ స్పాట్ క్యాంపు నిర్వహణ కొనసాగేది. కాగా, ఈ యేడు నుంచి వరంగల్ జిల్లాలోని లాల్‌బహదూర్ కళాశాలలో ఇంటర్ స్పాట్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు బోర్డు కార్యదర్శి ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, వరంగల్‌లో ఏర్పాటు చేస్తున్న నూతన స్పాట్ క్యాంపులో వరంగల్, మహబూబాబాద్, ములుగు జిల్లాలకు కేంద్రంగా కోడింగ్, వాల్యూయేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేటి నుంచి దానాపూర్ రైలు రద్దు

కాజీపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట మీదుగా సికింద్రాబాద్ - దానాపూర్‌ల మధ్య నడిచే దానాపూర్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20 నుంచి 28 తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో మరమ్మత్తులు దృష్ట్యా ఈ రైలు రద్దు చేశారు. ఈ నెల 29 నుంచి రైలు యథావిధిగా నడుస్తుందని రైల్వే అధికారులు తెలిపారు.

నగర శివారులో చిరుత కలకలం

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ పరిధిలోని విజయలక్ష్మి కాలనీలో చిరుత కలకలం సృష్టించింది. హనుమకొండ యాదవనగర్ నుంచి ఓఆర్ఆర్ వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న విజయలక్ష్మి కాలనీలో మంగళవారం రాత్రి 10 గంటలకు సత్యనారాయణ ఇంటి ముందు నుంచి నడుచుకుంటూ వచ్చి ప్రహరీ ఎక్కి చిరుత కూర్చున్నట్లు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. చుట్టుపక్కల ప్రాంతంలో చెరువుతో పాటు పంటపొలాలు ఉండడంతో ఇండ్ల మధ్యలోకి చిరుత వచ్చినట్టు అక్కడి ప్రజలు భావిస్తున్నారు. ఇంటి యజమానికి మర్నాడు (బుధవారం) ఇంటి ముందు చిరుత అడుగు ఉన్నట్టు కుటుంబ సభ్యులు గుర్తించి సీసీ కెమెరాలు పరీక్షించడంతో చిరుత సంచరిస్తున్నట్టు గుర్తించారు. దీంతో విషయం స్థానిక ప్రజలతో పాటు అటవీ శాఖ అధికారులకు తెలిపారు. ఉదయం కాలనీకి చేరుకున్న సిబ్బంది.. చిరుతా? లేక హైనా? అనేది త్వరలో గుర్తిస్తామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ విషయం వ్యాపించడంతో ఆ కాలనీ ప్రజలు ఇతర ప్రాంతాలకు పరుగులు పెడుతున్నారు.

పోలీస్ కమిషనరేట్ ఎదుట మహిళ హల్‌చల్

తన బావపై కేసు పెట్టడం లేదని ఆత్మహత్యాయత్నం

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తన బావపై ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయడం లేదని ఓ మహిళ బుధవా రం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యకు యత్నించింది. సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లాకు చెందిన సంగీత కొంతకాలంగా సుబేదారి పోలీసుస్టేషన్ పరిధిలో నివాసం ఉంటోంది. అయితే సంగీతకు, ఆమె భర్తకు మధ్య జరిగిన వివాదంలో తనకు అనుకూలంగా పోలీస్‌స్టేషన్‌లో సాక్ష్యంగా చెప్పాలని తన అక్క భర్తపై ఒత్తిడి చేసింది. దీనికి ఆమె బావ అంగీకరించలేదు. దీంతో తన అక్కను ప్రేమ వివాహం చేసుకున్న బావపై కులం పేరుతో దూషించాడని సుమారు రెండు నెలల కిందట పోలీసులకు సంగీత ఫిర్యాదు చేసింది. కాగా, ఈ క్రమంలో పోలీసులు పట్టించుకోవడం లేదని కమిషనరేట్ కార్యాలయం వద్ద పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో సంగీతను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2322	2100
పల్లికాయ (సూక)	6770	4600
పల్లికాయ (పచ్చిది)	5000	3100
కందులు	7251	5540
పెసళ్లు	7169	4645
పత్తి	6810	5800
కొత్త పత్తి	-	-
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13400	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	16100	11500
యూఎస్ 341	13300	11500
దేశీ ఏసీ	25050	22500
దీపిక	16000	15245
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

కేయూ తెలుగు విభాగాధిపతిగా మామిడి లింగయ్య

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగాధిపతిగా డాక్టర్ మామిడి లింగయ్య నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం నియామక ఉత్తర్వులను విడుదల చేశారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు తిరిగి ఉత్తర్వులు వచ్చే వరకు విభాగాధిపతిగా కొనసాగుతారు.

చోరీలకు పాల్పడుతున్న దంపతుల అరెస్టు

రూ.7.50లక్షల ఆభరణాలు స్వాధీనం

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఒంటరి ప్రయాణికులే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న భార్యాభర్తలను బుధవారం అరెస్టు చేసి వారి నుంచి రూ.7.50లక్షల విలువగల 80.5 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సంపేట వడ్డెరకాలనీకి చెందిన భార్యాభర్తలైన బొంత జ్యోతి - కిషన్‌లు కూలీ పనిచేసేవారు. కూలీద్వారా వచ్చే ఆదాయం ఇంటి ఖర్చులకు సరిపడకపోవడంతో పాటు ఆనారోగ్య సమస్యలు తలెత్తడంతో ఖర్చుల నిమిత్తం అప్పులు చేశారు. అప్పు ఇచ్చిన వ్యక్తులు ఒత్తిడి తేవడంతో అప్పు తీర్చేందుకు రద్దీగా ఉండే ప్రాంతాల్లో దొంగతనాలు చేయాలని ప్లాన్ వేశారు. ఫిబ్రవరి నెలలో హనుమకొండ బస్టాండ్‌లో మహిళలు బస్సు ఎక్కుతున్న క్రమంలో ముగ్గురు మహిళల మెడల్లో నుంచి ఆభరణాలు లాక్కొని పారిపోయారు. చోరీలపై ఫిర్యాదులు అందుకున్న హనుమకొండ పోలీసులు నిందితుల కోసం వెతుకుతుండగా బుధవారం ఉదయం హనుమకొండ చౌరస్తాలోని బంగారంలో షాపులోకి వెళ్తున్న ఇద్దరు దంపతులపై పెట్రోలింగ్ పోలీసులకు అనుమానం వచ్చి అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నిందితులు చోరీకి పాల్పడినట్లుగా ఒప్పుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన హనుమకొండ పోలీసులను ఏసీపీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

గులాబీలో డైలమా!



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఎమ్మెల్సీ ఎన్నికలు 'గులాబీ' పార్టీ క్యాడర్‌ను డైలామాలో పడేస్తున్నాయి. ఈ ఎన్నికల్లో ఇప్పటి వరకు ఏ పార్టీకి, సంఘానికి, అభ్యర్థికి అధికారికంగా బీఆర్ఎస్ మద్దతు ప్రకటించలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్, బీజేపీ క్యాడర్ జోష్‌గా తిరుగుతుంటే.. గులాబీ కార్యకర్తలు మాత్రం తమ అభ్యర్థి బరిలో లేక.. మద్దతు ఎవరికిస్తున్నామో తెలియక లేక డీలా పడుతున్నారు. మరోవైపు అధిష్ఠానం పోటీకి దూరమని ప్రకటించిన నేపథ్యంలో పార్టీ టికెట్ ఆశించిన పలువురు నేతలు స్వతంత్రులుగా బరిలో దిగారు. వీరికి కూడా పార్టీ మద్దతు ప్రకటించలేదు. దీంతో స్వతంత్రులుగా పోటీ చేస్తున్న గులాబీ నేతలకా.. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీకి మద్దతు ఇవ్వాలా అనే అయోమయం గులాబీ శ్రేణుల్లో నెలకొంది. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో గులాబీ పార్టీ మద్దతు కోసం తహతహలాడిన ఉపాధ్యాయ సంఘాలు.. ఈసారి బీఆర్ఎస్ మద్దతు కోరేందుకు వెనుకడుగు వేస్తున్నాయనే ప్రచారం జరుగుతోంది.

స్వతంత్రులుగా గులాబీ నేతలు

వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు హనుమకొండ, భూపాలపల్లి జిల్లాలో పూర్వ కరీంనగర్ జిల్లాకు చెందిన ఎనిమిది మండలాలు విలీనమయ్యాయి. ఈ మండలాల్లో 7,068 మంది పట్టభద్రులు, 249మంది ఉపాధ్యాయ ఓటర్లున్నారు. దీంతో కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపుతారనే చర్చ జరుగుతోంది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసేందుకు పలువురు ఆసక్తి చూపారు. టికెట్ కోసం చివరి వరకు ప్రయత్నాలు చేశారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించటంతో ఆశావహులు అసంతృప్తికి గురయ్యారు. అయితే వారిలో కొందరు స్వతంత్రులుగా బరిలో దిగారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి వరంగల్ కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్ బీసీ సంఘాల మద్దతుతో పోటీలో ఉన్నారు. అలాగే చివరి వరకు బీఆర్ఎస్ టికెట్ కోసం ప్రయత్నాలు చేసిన కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్‌సింగ్ కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున పోటీకి దిగారు. అలాగే ట్రస్మా రాష్ట్ర మాజీ చైర్మన్ యాదగిరి శేషగిరిరావు కూడా బీఆర్ఎస్ టికెట్ కోసం ప్రయత్నాలు చేసి, స్వతంత్రులుగా బరిలో దిగారు. అయితే వీరికి బీఆర్ఎస్ అధికారికంగా మద్దతు ప్రకటించలేదు. అంతేకాకుండా పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా పోటీ చేస్తున్నారని వీరిపై పార్టీపరంగా ఎలాంటి చర్యలు కూడా తీసుకోవటం లేదు. దీంతో పార్టీ క్యాడర్ గందరగోళంలో పడింది. అధిష్ఠానం ఏం సందేశం ఇస్తుందో అని తెలియక అయోమయానికి గురవుతున్నారు. ఉపాధ్యాయుల్లోనూ తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పాల్గొన్నవారు అనేకమంది ఉన్నారు. ఇప్పటికి కొంత బీఆర్ఎస్‌పైనా.. కేసీఆర్‌పైనా అభిమానంతో ఉన్నవాళ్లున్నారు. అలాగే పట్టభద్రుల్లోనూ బీఆర్ఎస్ అభిమానులు, కార్యకర్తలు కూడా ఉన్నారు. వీరంతా ఎవరి వైపు మొగ్గుచూపాలో అయోమయానికి గురవుతున్నారు. పార్టీ నుంచి ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తున్న వారికి కూడా పార్టీ మద్దతు ప్రకటించలేదు. దీంతో కాంగ్రెస్‌పై ప్రతీకారం తీర్చుకునేందుకు క్యాడర్ బీజేపీ వైపు మొగ్గుచూపుతుందనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే బీజేపీ నేతలు.. బీఆర్ఎస్‌లోని ద్వితీయ శ్రేణి నేతలు, పట్టభద్రులతో సంప్రదింపులు జరుపుతున్నారని సమాచారం.

> **ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంపై శ్రేణుల్లో అసంతృప్తి**
> **ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాల్లో స్వతంత్రులుగా బీఆర్ఎస్ నేతలు**
> **పార్టీ మద్దతు లేకుండానే బరిలో దిగిన నేతలు**

ఉపాధ్యాయ సంఘాలు దూరమే..

2019లో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతు కోసం ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా ప్రయత్నాలు చేశాయి. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీ చేసిన పీఆర్‌టీయూ అభ్యర్థి పూల రవీందర్‌కు బీఆర్ఎస్ మద్దతిచ్చింది. అలాగే కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన పాతూరి సుధాకర్‌రెడ్డికి, పట్టభద్రుల ఎమ్మెల్సీగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన చంద్రశేఖర్‌గౌడ్‌కు సైతం బీఆర్ఎస్ మద్దతు ఇచ్చింది. బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిన ముగ్గురు గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. దాంతో 2019లోనే ఉపాధ్యాయులు, పట్టభద్రులు బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆగ్రహంగా ఉన్నారనే సంకేతకాలిచ్చారన్న చర్చ ఉంది. అప్పుడు అధికారంలో ఉన్నప్పుడే పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఆదరించలేదన్న అభిప్రాయాలతో.. ఇప్పుడు బీఆర్ఎస్ మద్దతు కోరేందుకు ఉపాధ్యాయ సంఘాలు, ఇండిపెండెంట్లు ఆసక్తి చూపటం లేదనే ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ కూడా వ్యూహాత్మకంగా ఎన్నికలకు దూరంగా ఉంటోందనే చర్చ ఉంది. దీంతో ఎవరి పక్షాన నిలవాలన్న సందిగ్ధంలో బీఆర్ఎస్ శ్రేణులున్నాయి.

కాంగ్రెస్ మద్దతు ఎవరికో ?

రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల బరిలో కాంగ్రెస్ అభ్యర్థులు లేరు. కాంగ్రెస్ కూడా కేవలం కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచే అభ్యర్థిని బరిలో దించింది. అయితే వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుంచి టీపీసీసీ అధికార ప్రతినిధి జీ.హర్షవర్ధన్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. దీంతో ఎన్నికల నాటికి ఏదో ఒక ఉపాధ్యాయ సంఘానికి లేదా స్వతంత్రులుగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతల్లో ఒకరికి మద్దతు ఇచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. 2019 ఎన్నికల్లో కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ నేత రఘోత్తంరెడ్డికి మద్దతు ఇచ్చింది. వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డికి వామపక్షాలతో పాటు కాంగ్రెస్ కూడా సహకరించిందనే చర్చ ఉంది. ఈసారి కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఆ పార్టీ మద్దతు కీలకం కావటంతో పలువురు అభ్యర్థులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలు..

జిల్లా	పురుషులు	మహిళలు	మొత్తం ఓటర్లు
వరంగల్	1474	878	2,352
హనుమకొండ	2943	2272	5,215
మహబూబాబాద్	1112	551	1663
జనగామ	614	388	1002
భూపాలపల్లి	215	114	329
ములుగు	405	223	628
సిద్దిపేట	123	43	166
మొత్తం	6,886	4469	11,355

కరీంనగర్ పట్టభద్రుల స్థానంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఓటర్లు

జిల్లా	పురుషులు	మహిళలు	మొత్తం
హనుమకొండ	3,162	1,423	4,585
భూపాలపల్లి	1,734	749	2483
మొత్తం	4,896	2,172	7,068

కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో ఉన్న ఓటర్లు

హనుమకొండ	126	40	166
భూపాలపల్లి	64	19	83
మొత్తం	190	59	249

జీబీఎస్.. ఫియర్!

- ప్రజల్లో 'గులియన్ బారే సిండ్రోమ్' భయం
- పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలో వేగంగా విస్తరణ
- ఇక్కడ ప్రబలకుండా యంత్రాంగం ముందస్తు జాగ్రత్తలు
- అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ
- భూపాలిపల్లి జీజీహెచ్‌లో ఐసీయూ వార్డు సిద్ధం

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) ఫియర్ వెంటాడుతోంది. కరోనా తరువాత అంతగా భయపెడుతున్న ఈ జీబీఎస్ కేసులు రాష్ట్రంలో అక్కడక్కడా నమోదవుతున్న నేపథ్యంలో రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో జీబీఎస్ వ్యాధి నివారణకు జిల్లా వైద్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించేందుకు చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో ఐసీయూ వార్డును జీబీఎస్ బాధితుల కోసం ఉపయోగించేందుకు సిద్ధం చేశారు.

వ్యాధి లక్షణాలు

గులియన్ బారే సింగ్రోమ్.. ప్రధానంగా రోగ నిరోధక వ్యవస్థ, నాడీ వ్యవస్థపై దాడి చేస్తుంది. ఈ వ్యాధి బారినపడిన వారిలో ఆయాసం, తిమ్మిర్లు, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, శ్వాససంబంధిత సమస్యలు తలెత్తడం, రోగనిరోధక శక్తి తగ్గడం, కండరాల బలహీనత కనిపిస్తాయి. ఈ లక్షణాలు బహిర్గతమైన వారు సమీపంలోని ఆస్పత్రిలో చేరి చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. సకాలంలో రోగికి వైద్యం అందకపోతే మరణించే ప్రమాదం కూడా ఉంది. వ్యాధి లక్షణాలతో తీవ్రంగా బాధపడుతున్న వారి రక్త, మూత్ర నమూనాలతో పాటు వెన్నెముక నుంచి నీరు తీసి వ్యాధి తీవ్రతను నిర్ధారిస్తారు. జీబీఎస్ వ్యాధిగ్రస్తులకు ఇమ్యునోగ్లోబులిన్ వంటి టీకాలను వేయడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించే అవకాశం ఉంటుంది. ఈవ్యాధి ఎక్కువగా నడి వయస్సు ఉన్న పురుషుల్లో ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

జీజీహెచ్‌లో ప్రత్యేక ఏర్పాట్లు


జీబీఎస్ వ్యాధి నియంత్రణపై అప్రమత్తమైన రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ జిల్లాలకు స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారిని ఎప్పటికప్పుడు గుర్తించి చికిత్స అందించాలని జిల్లా యంత్రాంగాలను ఆదేశించింది. అందుకు తగ్గట్టుగానే జిల్లా కేంద్రంలోని 200 పడకల జీజీహెచ్‌లో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యాధి బారినపడిన వారిని ఐసీయులో ఉంచి చికిత్స అందించే అవకాశం ఉన్నందున ఆస్పత్రిలోని ఐసీయు వార్డును పూర్తిగా జీబీఎస్ రోగులకు వాడనున్నారు. కొంత మందికి వెంటిలేటర్ అవసరం పడే అవకాశం ఉన్నందున ఐసీయు వార్డునే ఉపయోగించనున్నారు. ఇప్పటికే ఆస్పత్రికి వస్తున్న రోగుల్లో వ్యాధి లక్షణాలను గుర్తించేందుకు సిబ్బందికి సూపరిటెండెంట్ నవీన్ కుమార్ స్పష్టమైన ఆదేశాలను జారీచేశారు.



మహారాష్ట్రలో వేగంగా విస్తరిస్తున్న జీబీఎస్

భూపాలపల్లి జిల్లాకు పొరుగున ఉన్న మహారాష్ట్రలో జీబీఎస్ వ్యాధి వేగంగా ప్రబలుతోంది. ఇప్పటికే ఆ రాష్ట్రంలో 181పైగా పాజిటివ్ కేసులు నమోదు కావడంతో పాటు నలుగురు మృత్యువాత పడినట్టు మహారాష్ట్ర వైద్యశాఖ వర్గాలు వెల్లడించాయి. మహారాష్ట్ర నుంచి నిత్యం పదుల సంఖ్యలో రోగులు మహదేవ్‌పూర్ సీహెచ్‌సీ, జీజీహెచ్‌కు వస్తుంటారు. మహారాష్ట్రలో వ్యాధి వేగంగా వ్యాప్తి చెందుతుండం, అక్కడి నుండి రోగులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తుండటంతో జిల్లాలో వ్యాధి ప్రబాలే అవకాశం లేకపోలేదు. జీబీఎస్ అంటువ్యాధి కాకపోయిన వ్యాధి తీవ్రత పెరిగిన రోగుల వల్ల ఇతర రోగులు ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది. మరోవైపు జీబీఎస్ రోగులకు అందించే ఇమ్యునోగ్లోబులిన్ టీకాలు జీజీహెచ్‌లో అందుబాటులో లేవు. ఇలాంటి పరిస్థితుల్లో మహారాష్ట్ర నుంచి వచ్చే రోగుల్లో జీబీఎస్ లక్షణాలు ఉంటే అధికారులు అప్రమత్తం అయ్యి చికిత్స అందించకపోతే మరణాలు సంభవించే అవకాశం ఉంటుంది. వైద్యఆరోగ్యశాఖ అధికారులు పూర్తి స్థాయిలో అప్రమత్తం అయ్యి ప్రత్యేక క్యాంపులు నిర్వహించి జీబీఎస్ రోగులను గుర్తించి చికిత్స అందించాల్సిన అవసరం ఉంది.

జీజీహెచ్‌లో అన్ని ఏర్పాట్లు చేశాం



కోడూరి నవీన్‌కుమార్, సూపరింటెండెంట్

రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ఆదేశాలనుసారం జీబీఎస్ రోగుల కోసం జీజీహెచ్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. ప్రస్తుతానికి జీజీహెచ్‌లో పాజిటివ్ కేసులుయియ నమోదు కాలేదు. కేసులు నమోదైతే చికిత్స అందించేందుకు సిబ్బందిని అప్రమత్తం చేశాం. కేసులు నమోదైతే ఐసీయు వార్డులో చికిత్స అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న రోగులను గుర్తించి పరీక్షలు చేయాలని సిబ్బందికి ఆదేశించాం.



సమ్మక్క గుడి ఎదుట ముగ్గులు వేస్తున్న మహిళలు

మేడారంలో ఘనంగా తిరుగువారం

తాడ్వాయి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో తిరుగువారం పండుగను వన దేవతల పూజారులు బుధవారం ఘనంగా నిర్వహించారు. మేడారంలోని సమ్మక్క మందిరం, కన్నెపల్లిలో సారలమ్మ మందిరాన్ని, పూజాసామగ్రిని ఈ సందర్భంగా శుభ్రపరిచారు. ఈ క్రమంలో దీపదూప నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా జాతర వరకు ప్రజలను సుభిక్షంగా చూడాలని, పాడి పంటలు సమృద్ధిగా పండేలా దీవించాలని పూజారులు కుటుంబ సమేతంగా వనదేవతలను వేడుకున్నారు. అనంతరం వన దేవతల పూజాసామగ్రిని ఆయా తల్లుల మందిరాల్లో భద్రపరిచారు. దీంతో మేడారం మినీ జాతర తంతు ముగిసింది. వచ్చే ఆదివారం పూజారులు వనభోజనాలకు వెళ్లనున్నారు.



సమ్మక్కకు కల్లు నైవేద్యం సమర్పిస్తున్న పూజారులు

తిరుగు వారంలో భక్తుల సందడి

మేడారంలో బుధవారం తిరుగువారం సందర్భంగా భక్తులు సందడి చేశారు. సుమారు లక్ష మంది భక్తులు వనదేవతలను దర్శించుకున్నారు. జంపన్న వాగులో పవిత్ర స్నానాలు ఆచరించి తల్లులకు ఎత్తు బంగారం (బెల్లం), పసుపు, కుంకుమతో మొక్కులు చెల్లించుకున్నారు. 'చల్లంగా చూడు తల్లీ' అంటూ వనదేవతలను భక్తులు వేడుకున్నారు.

కరాటే మాస్టర్.. కాదు.. ప్రిన్సిపాల్!

ఈ ఫొటోలో కత్తి పట్టుకొని సాము చేస్తున్నది కరాటే మాస్టర్ కాదు. ఆయనో పాఠశాల ప్రిన్సిపాల్. చదువు చెప్పడమే కాదు స్వీయరక్షణ విద్యను నేర్పడం లోనూ ఆయన దిట్ట. ఈ ఏడాది మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల ఆదర్శ పాఠశాలకు ప్రిన్సిపాల్‌గా బదిలీపైవచ్చిన పరిమి నవీన్ మార్షల్ అర్ట్స్‌లో భాగమైన కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించారు. ఈ క్రమంలో తనకు తెలిసిన విద్యను తాను పనిచేస్తున్న పాఠశాలలోని విద్యార్థులకు పంచుతున్నారు. వారికి కరాటేలో శిక్షణినిస్తున్నారు. కటాస్‌లు, నాంచాక్‌లను ఎలా ఉపయోగించాలో వారికి తర్ఫీదునిస్తున్నారు. దీని వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, బాలికల ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని నవీన్ చెబుతున్నారు. ఇలా ప్రిన్సిపాల్ తనకు తెలిసిన స్వీయరక్షణ విద్యను విద్యార్థులకు అందించడం పట్ల స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



– కేసముద్రం, ఆంధ్రజ్యోతి



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ప్రిన్సిపాల్ నవీన్

స్వరజ్ఞాని.. సంగీత విద్వన్మణి

- భక్తి పాటల తేనె ఊట.. సాహితీవేత్త
- 'మహా ప్రాణ దీపం.. శివమ్'తో సినీ గేయ రచయితగా మరింత గుర్తింపు
- బహుముఖ ప్రజ్ఞాశాలి వేదవ్యాస రంగ భట్టర్

నేడు వేదవ్యాస రంగ భట్టర్ వర్ధంతి

హనుమకొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : భక్తిపాటలతో సంగీత సామ్రాజ్యాన్ని కొత్తపుంతలు తొక్కించి తనదైన శైలిలో అద్భుత పాటలతో ఆధ్యాత్మిక సినిమాలకు నిండుదనం తెచ్చిన సాహితీవేత్త.. సినీ గేయ రచయిత వేదవ్యాస రంగభట్టర్. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన ఆయన వాగ్గేయకారుడిగా.. సంస్కృత పండితుడిగా.. నాటక రచయితగా.. రంగస్థల నటుడిగా... బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందారు. ఆయన పూర్తి పేరు శ్రీ రంగం శ్రీ వేదవ్యాస శ్రీ రంగరాజ రంగభట్టర్. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని కోమటిపల్లి అగ్రహారంలో శ్రీరంగరాజ భట్టర్, రంగనాయకమ్మాళ్ దంపతులకు జన్మించిన రంగభట్టర్ బాల్యమంతా కోమటిపల్లిలోనే గడిచింది. అక్కడి సంస్కృత పాఠశాలలో పాఠశాల స్థాయి విద్య పూర్తి చేసిన ఆయన ఆ తర్వాత హైదరాబాద్ సీతారాం బాగ్‌లోని ప్రాచ్యకళాశాలలో సంస్కృతంలో బీవోఎల్ పూర్తి చేశారు. 1968లో తిరుమల తిరుపతి దేవస్థానం ఓరియంటల్ కాలేజీలో సంస్కృత ఆచార్యుడిగా చేరారు. ఆ తర్వాత శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో ప్రధానాచార్యులుగా బాధ్యతలు నిర్వర్తించి ఇదే కళాశాలలో సాహిత్యశాఖ అధ్యక్షుడిగా, ప్రిన్సిపాల్‌గా పని చేసి 2004లో ఉద్యోగ విరమణ చేశారు. వేద వ్యాస రంగభట్టర్‌కు ఐదుగురు సోదరులు, ఒక సోదరి ఉన్నారు. వేదవ్యాసకు ప్రముఖ సినీ గేయ రచయిత జేజే భారవి స్వయాన తమ్ముడు. మరో సోదరుడు ఆనంద్ భట్టర్ గొప్ప సంగీత విద్వాంసుడు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టులో కీలక పదవిలో ఉన్నారు. ఇంకో సోదరుడు శ్రీరామ భట్టర్ ప్రఖ్యాత హరికథా కళాకారుడు. వేదవ్యాస రంగ భట్టర్‌కు భార్య విజయలక్ష్మి, కుమారుడు శ్రీనివాస్ భట్టర్‌తో పాటు ముగ్గురు కుమార్తెలున్నారు. రంగభట్టర్ ఉద్యోగ రీత్యా తిరుపతిలోనే స్థిరపడినా తాను పుట్టి పెరిగిన ఊరు కోమటిపల్లిని ఎప్పుడూ మరిచిపోలేదు. అపుడప్పుడూ సొంత ఊరుకు వచ్చి తన చిన్ననాటి నేస్తాలను కలిసి.. బాల్యస్మృతులను నెమరు వేసుకునేవారు. అయితే ఊపిరితిత్తుల వ్యాధి బారిన పడి ఆయన తిరుపతిలోని స్విమ్స్ అస్పత్రిలో చికిత్స పొందుతూ 2019 ఫిబ్రవరి 20న కన్నుమూసారు. సంగీత, సాహిత్య, నాటక కళారంగాలతో సుసంపన్నమైన ఓరుగల్లు ప్రజలు ఇంత గొప్ప కళాకారుడు, సాహితీవేత్తను విస్మరించడం, కనీసం ఆయన వర్ధంతి, జయంతులకు కార్యక్రమాలను కూడా జరపకపోవడం విచారకరమని సాహితీ ప్రియులు అభిప్రాయపడుతున్నారు.



సత్కారాలు

సాహిత్యంలో రంగభట్టర్ చేసిన సేవలకుగాను 2003లో నాటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం నంది అవార్డుతో సత్కరించింది. వివిధ సాహితీ, సాంస్కృతిక సంస్థల నుంచి కళాతపస్వి, దర్శకరత్న, కళారత్న, సాహితీ సార్వభౌమ లాంటి బిరుదులను అందుకున్నారు. వరల్డ్ ఆమేజింగ్స్ రికార్డ్ ఆఫ్ ఇండియా, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ సంస్థ నుంచి సత్కారాలు పొందారు.



గేయ రచయితగా..

వేదవ్యాస్ రంగభట్టర్ కొన్ని వందల పాటలు రాసారు. భక్తి పాటలకు లెక్కేలేదు. అప్పట్లో ఆయన సంగీత దర్శకత్వంలో కొన్ని వందల పాటల క్యాసెట్లు వచ్చాయి. శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం స్ఫూర్తిగా ఆయన వివిధ దేవుళ్లపై 58 సుప్రభాతాలు రాశారు. అందులో విద్యార్థులను మేలుకొలుపుతూ రాసిన సుప్రభాతం కూడా ఉంది. వేదవ్యాస సంగీత దర్శకత్వంలో ఎస్పీ బాల సుబ్రమణ్యం, పి సుశీల, జానకి లాంటి ప్రముఖ గాయనీ గాయకులెందరో పాడారు. 1986లో తొలిసారి ఆయన రంగవల్లి సినిమాకు పాటలు రాశారు. ఆ తర్వాత శ్రీమంజునాథ, రామదాసు, పాండురంగడు, షిరిడీ సాయి, అనగనగా ఒక ధీరుడు, ఝుమ్మంది నాదం, ఓం నమో వెంకటేశాయ... ఇలా అనేక సినిమాలకు సాహిత్యం అందించారు. శ్రీ మంజునాథ చిత్రంలో 'మహా ప్రాణ దీపం... శివమ్.. శివమ్' పాటను రాసింది వేదవ్యాసే. ఈ పాట రంగభట్టర్‌కు మంచిపేరు తెచ్చిపెట్టింది. స్వరజ్ఞాన వర్షిణి అనే కొత్త సాహిత్య సంగీత స్వరప్రక్రియను రూపొందించి శ్రీ వేంకటేశ్వర స్వామిపై 12, 16 స్వర స్థానాలతో 320 కీర్తనలను రాశారు. అటు సంస్కృతం... ఇటు తెలుగు... ఉభయ భాషల్లో అనన్యం ఆయన ప్రావీణ్యం. భావగీతాలతోనూ భళా అనిపించుకున్నారు. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు ఆయనతో పలు సినిమాలకు అనేక పాటలు రాయించుకున్నారు. వేదవ్యాసకు భక్తిగీతాల రచయితగా పేరున్నా శృంగార రసాన్ని ఆవిష్కరించడంలోనూ ఆయన దిట్టే. ప్రేమ తపస్సు సినిమా కోసం 'ఏటేటో అవుతా ఉంది.. ఏదోదో ఇదిగా ఉంది..' అంటూ రాసిన శృంగార గీతం ఇందుకు ఉదాహరణ. సంస్కృతంలో అభినివేశం, వేదోపనిషత్తులపై పట్టు, భక్తిగీత రచయితగా అయనకు కీర్తిని తెచ్చిపెట్టాయి. 2008లో శ్రీ రామదాసులో వేదవ్యాస పాటలు అజరామరం. 'శుభకరుడు... సురుచిరుడు... భవహరుడు'.. పాట విన్న ప్రతివారిలోనూ భక్తిభావం ఉప్పొంగుతోంది. 2017లో వచ్చిన ఓం నమో వెంకటేశాయ చిత్రంలోని 'వేయి నామాల వాడ వెంకటేశుడా..' పాట కూడా శ్రీవారి నామ, రూప, సౌందర్యాన్ని సాక్షాత్కరింప జేస్తుంది. వేంగమాంబ, జగద్గురు, ఆదిశంకర, శిరిడి సాయి, పాండురంగడు తదితర భక్తిరస ప్రధాన చిత్రాల్లో అపురూపమైన పాటలు అందించారు. ఝుమ్మంది నాదం సినిమాలోని 'సరిగమపదని సప్తస్వర సంగీత సుధ.. సామవేదోనాదోపాసన..' పాట సంగీతం మీద ఆయనకు ఉన్న పట్టునూ, పాండిత్యాన్ని తెలియ జేస్తుంది. చిటికెల పందిరి అనే సినిమాకు ఆయన సంగీత దర్శకత్వం కూడా వహించారు.

నటనలో శిక్షణ

వేదవ్యాస రంగస్థల కళాకారుడు కూడా. ఆయన పలు నాటకాలను రచించారు. వాటికి దర్శకత్వం వహించారు. కొన్ని నాటకాల్లో స్వయంగా పాత్రలను వేశారు. పలువురు ఔత్సాహిక కళాకారులకు నటనలో శిక్షణ కూడా ఇచ్చారు. 1996లో తిరుపతిలోని మహతి కళామందిరంలో ఎస్వీ నట శిక్షణాలయాన్ని స్థాపించి ఔత్సాహిక కళాకారులకు పద్యపఠనం, పౌరాణిక నాటకాల్లో ఉచితంగా శిక్షన అందించారు. రోజా, సంఘవి వంటి నటీమణులకు కూడా నటనలో శిక్షణ ఇచ్చారు. అనేక నాటకాలను రాసి వాటికి దర్శకత్వం వహించారు.

మొబైల్ ఫోన్‌లతో సమయం వృథా చేయవద్దు



మాట్లాడుతున్న యుగంధర్

కాజీపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మొబైల్ ఫోన్‌లతో సమయం వృథా చేయకుండా భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ హనుమకొండ కార్యదర్శి తేరాల యుగంధర్, సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర్ అన్నారు. కాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంస్కార వికాస శిక్షణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో యుగంధర్, దామోదర్ మాట్లాడారు. ఇటీవల విద్యార్థులు ఫోన్‌లో చాటింగ్‌లు చేస్తూ, గేమ్స్ ఆడుతూ.. సమయాన్ని వృథా చేస్తున్నార న్నారు. నానమ్మ-తాతయ్యలకు యువత దూరం కావొద్దని చెప్పారు. విద్యార్థులు మహానుభావుల జీవిత్ర చరిత్రలు చదవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కొండబత్తిన రాజేందర్, రవీందర్ గౌడ్, గంగారపు యాదగిరి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కేయూలో ఈటల ఎన్నికల ప్రచారం



ప్రచారం చేస్తున్న ఈటల రాజేందర్

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్లగొండ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా బుధవారం కేయూ ఇంజనీరింగ్ కళాశాలలో మేడ్చల్ ఎంపీ ఈటల రాజేందర్ ప్రచారం నిర్వహించారు. అధ్యాపకులను కలిసి తమ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు కొండేటి శ్రీధర్, సీతారాంనాయక్, శ్రీరాం శ్యాం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేయాలి



వీసీ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రాన్ని ఇస్తున్న డాక్టరేట్ అసోసియేషన్ నేతలు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో డాక్టరేట్ పొందిన పరిశోధకులకు, స్కాలర్స్‌కు వర్సిటీలో ఉద్యోగావకాశాలు కల్పించాలని కేయూ డాక్టరేట్ అసోసియేషన్, బీఆర్ఎస్వీ, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్‌తో పాటు ఇతర విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కేయూ పరిపాలన భవనంలో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని కలిసి పలు అంశాలపై వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నేతలు మాట్లాడుతూ.. ఎస్డీఎల్‌సీఈలో కౌన్సెలర్లను నియమించాలని, అలాగే డాక్టరేట్ పూర్తిచేసిన వారితో పాటు పీహెచ్‌డీ పరిశోధకులకు తరగతులు కేటాయించాలని అన్నారు. దూరవిద్య కేంద్రం అడ్మిషన్ల పెంపునకు ప్రతీ జిల్లాకేంద్రంలో ఎగ్జామినేషన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని అన్నారు. పీహెచ్‌డీ చేస్తున్న, డాక్టరేట్ పొందిన అభ్యర్థులను పరీక్షల అబ్జర్వర్లుగా నియమించాలని పేర్కొన్నారు. పరిశోధకులకు ఎగ్జామ్ నేషన్ ప్రాక్టీస్ చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

అలాగే వర్సిటీలో పార్టుటైమ్ అధ్యాపకుల నియామకాల కోసం నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని అన్నారు. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే వర్సిటీలో ఉద్యమాలకు దిగుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నేత కలకోట సుమన్, ఎంఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జి డాక్టర్ వడ్డెపల్లి మధు, బీఆర్ఎస్వీ కేయూ ఇన్‌చార్జి జెట్టి రాజేందర్, బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఆరూరి రంజిత్, కేయూడీఏ జనరల్ సెక్రటరీ డాక్టర్ మద్దిరాల మోహన్ రెడ్డి, పరిశోధకుల సంఘం నేతలు సోమరాజు, విష్ణు, కేతపాక ప్రసాద్, కందికొండ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య లోపం.. ప్రజలకు శాపం..

- డ్రెయినేజీల నిర్వహణ లేక ఇళ్ల ముందే మురుగు
- మంచినీటి సరఫరా పైపులైన్ల కోసం రోడ్ల ధ్వంసం
- 10వ డివిజన్‌లో అపరిశుభ్ర పరిసరాలతో వ్యాధుల వ్యాప్తి



ఇరుకుగా, అసంపూర్తిగా ఉన్న సైడ్ డ్రెయిన్



మంచినీటి పైపులైన్ నిర్మాణం కోసం ధ్వంసం చేసిన రోడ్డు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): హనుమకొండ 10వ డివిజన్ మచిలీబజార్‌లోని ముదిరాజ్ కమిటీ హాల్ ఎదుట వీధిలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగు నీరు ఇళ్ల ముందు నిల్వ ఉంటోంది. దీంతో తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో ముక్కు మూసుకొని బయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. సైడ్ డ్రైన్‌లు పక్కాగా లేని కారణంగా మురుగంతా ఇళ్ల ముందే నిలిచి ఉండటంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ గల్లీలోని సమస్యలను పరిష్కరించాలని నెలల తరబడి సంబంధిత అధికారులకు మొర పెట్టుకున్నప్పటికీ పట్టించుకునే నాథుడే లేడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక కార్పొరేటర్ అధికారులకు సమస్యలను విన్నవించినప్పటికీ ఏ ఒక్క అధికారి స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరుకుగా ఉన్న గల్లీలో మంచినీటి సరఫరా కోసం నడిరోడ్డు మధ్యలో నుంచి పైపులైన్ వేసిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా పనులు చేపట్టడంతో ఉన్న చిన్నపాటి సీసీరోడ్డు పూర్తిగా దెబ్బతింది. దీంతో అటుగా నడవలేని దుస్థితి దాపురించిందని వారు ఆందోళన చెందుతున్నారు. గల్లీలో ఉన్న సీసీ రోడ్డును నీటి సరఫరా కోసం తవ్వించిన కాంట్రాక్టర్.. ఎలాంటి మరమ్మతులు చేయకపోవడంతో పూర్తిగా ధ్వంసమైన రోడ్డుపై వెళ్లే స్థానికులు ప్రమాదాల బారిన పడాల్సి వస్తోందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. స్మార్ట్‌సిటీ అంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు అభివృద్ధిపై దృష్టి సారించి తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్థానికులు కోరుకుంటున్నారు.

పట్టించుకోవడం లేదు..

కె.సరోజన, స్థానికురాలు



10వ డివిజన్ మచిలీబజార్ ముదిరాజ్ కమిటీ హాల్ ముందు గల్లీలో ఏళ్ల తరబడి సైడ్ కాలువల నిర్మాణం సరిగాలేక మురుగు సమస్య వేధిస్తోంది. ఇరుకుగా గల్లీలో కాల్వల నిర్మాణం శిథిల వ్యవస్థలోకి కూరుకుపోయింది. ఆ మురుగునీరు ముందుకు సాగకపోవడంతో ఇళ్ల మధ్యలోకి చేరి తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

మంచినీటి సరఫరా పేరుతో రోడ్ల ధ్వంసం

పులి సాంబయ్య, స్థానికుడు



ఇరుకుగా ఉన్న గల్లీలో మంచినీటి సరఫరా పైపులైన్ల నిర్మాణం పేరుతో సీసీరోడ్డును తవ్వించి ధ్వంసం చేశారు. అసలే ఇరుకు గల్లీ.. అందులో చిన్నపాటి సీసీ రోడ్డు మధ్య నుంచి పైపులైన్ల నిర్మాణం పేరుతో సదురు కాంట్రాక్టర్ తవ్వించి ఎలాంటి మరమ్మతులు చేపట్టక అసంపూర్తిగా వదిలివేయడంతో ప్రమాదాలకు గురవుతున్నాం. ఇప్పటికైనా కాంట్రాక్టర్ గల్లీలోని సీసీ రోడ్డుకు మరమ్మతులు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేపాల్ రుద్రాక్షల ఎగ్జిబిషన్ ప్రారంభం

బాలసముద్రం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రుద్రాక్షల ఎగ్జిబిషన్‌ను తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నేపాల్ రుద్రాక్షల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. రుద్రాక్షలు ధరిస్తే సత్ఫలితాలు లభిస్తాయని అన్నారు. ఈ ప్రదర్శనలో ఏకముఖి నుంచి 21 ముఖాల రుద్రాలక్షలతో పాటు స్ఫటిక, తులసీ, నవరత్న మాలలు, పంచముఖి రుద్రాక్ష మాలలు, సాలీగ్రాములు, మర్కట శివలింగాలు, కరంగళి మాలలు, దైవికమైన వస్తువులు సరసమైన ధరలకు లభిస్తాయని పేర్కొన్నారు. జన్మనక్షత్రాన్ని పరిశీలించి అసలైన రుద్రాక్షలను ఇస్తామని చెప్పారు. ఈ ప్రదర్శన ఈ నెల 26 వరకు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ జి.పద్మలత, ఏసీ రమేష్ పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న గంగు ఉపేంద్రశర్మ, దుర్గాప్రసాద్

22న ఎర్రగట్టు జాతర వేలం పాటలు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : హసన్‌పర్తిలోని ఎర్రగట్టు వెంకటేశ్వరస్వామి దేవస్థానం జాతర వేలం పాటలు ఈ నెల 22న మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎన్.వెంకట్రావ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హోలీ పర్వదినం నుంచి 5రోజుల పాటు నిర్వహించే జాతరలో కొబ్బరికాయలు, పూజా సామాగ్రి, లడ్డు, పులిహోర, ప్రసాదాలు విక్రయించేందుకు, రంగుల రాట్నం నిర్వహించేందుకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనాల పార్కింగ్, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు ఒక్కొక్కరికి రూ.10వేలు, మిగిలినవి ఒక్కొక్కరికి రూ.50వేలు డిపాజిట్ చెల్లించి టెండర్ కం బహిరంగ వేలంలో పాల్గొని జాతర విజయవంతానికి సహకరించాలని కార్యనిర్వహణ అధికారి ఎన్.వెంకట్రావ్ తెలిపారు.

ట్రంప్ వైఖరిపై పీడీఎస్‌యూ నిరసన



కేయూలో నిరసన చేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో ప్రవాస భారతీయులపై అధ్యక్షుడు ట్రంప్ అవలంబిస్తున్న దుశ్చర్యలను, ప్రధాని నరేంద్ర మోదీ అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బుధవారం కేయూ మొదటి గేటు వద్ద పీడీఎస్‌యూ నేతలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేపట్టారు. అమెరికాలో భారతీయులను అక్రమ వలసదారులు, దొంగలంటూ ట్రంప్ దుర్మార్గపూరిత చర్యలకు దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భారతీయులపై అమెరికాలో దారుణమైన అవమానాలు జరుగుతున్నప్పటికీ ప్రధాని నరేంద్రమోదీ నోరు మెదపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ట్రంప్, మోదీ వైఖరి ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, విద్యార్థులందరూ ముక్త కంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కంపాటి పృథ్వీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు, కావ్య, కన్వీనర్ బాలు, శ్రీజ, సాధన, బానుప్రియ, హర్షిత, చందన, అంజు, కుమార్, ఉమేశ్, గణేశ్, వంశీ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



మడికొండలో శోభాయాత్ర బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సరోజన



బీఆర్ఎస్ కార్యాలయంలో శివాజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న రజనీకాంత్



హసన్‌పర్తిలో శివాజీ జయంతి వేడుకల్లో బీజేపీ నాయకులు



కేయూలో నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ రామచంద్రం, మనోహర్‌రాజు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తి బస్టాండ్‌లో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు బుధవారం బీజేపీ అధ్యక్షుడు మారం తిరుపతి అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బస్టాండులో భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రైల్వే బోర్డు మెంబర్ మేకల హరిశంకర్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మారపల్లి రాంచంద్రారెడ్డి, సీనియర్ నాయకుడు దాది మధు, డివిజన్ ప్రధాన కార్యదర్శి మట్టెడ సుమన్, నాయకులు పెద్దమ్మ శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, ఆర్మీ శ్రీనివాస్, చెన్నూరి రవిందర్ పాల్గొన్నారు.

- మడికొండ: కాజీపేట మండలం మడికొండలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలను బుధవారం బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించుకున్నారు. మడికొండ మహంకాళి దేవస్థానం నుంచి ప్రారంభమయ్యే వీర శివాజీ శోభాయాత్ర బైక్ ర్యాలీని 46వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ మునిగాల సరోజన - కరుణాకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జై అనే నినాదాలతో మడికొండ మార్మోగింది. కార్యక్రమంలో బొల్లికొండ వినోద్‌కుమార్, పొనగోటి వెంకట్రావ్, గడ్డం మహేందర్, కొలిపాక కుమార్ బాబు, బుర్ర రాజన్ బాబు, కొప్పిరాల శైలశ్రీ, నాగవెల్లి గోపీకృష్ణ, శ్రావన్ యాదవ్, ఏర్పుల సదానందం, దారంగుల రాజేష్, నిఖిల్ రావు, చట్ల అజయ్ తదితరులు పాల్గొన్నారు.
- హనుమకొండ టౌన్: హిందూ పరిరక్షణ కోసం పాటుపడిన యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్ తదితరులు శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, మాజీ కార్పొరేటర్ కుసుమ లక్ష్మినారాయణ, బీఆర్ఎస్ శ్రేణులు కనకరాజు, కోటేశ్వర్‌రావు, బుద్దె వెంకన్న, రాంమూర్తి, రఘు, శ్రీనివాస్, అజయ్, రాజు, స్నేహిత్, అబి తదితరులు పాల్గొన్నారు.
- కేయూ క్యాంపస్ : ఛత్రపతి శివాజీ వీరత్వం దేశానికి గర్వకారణమని కేయూరిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అన్నారు. బుధవారం కేయూ మానవీయ శాస్త్ర భవనం ఎదుట కేయూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కేయూ ఇన్‌చార్జ్ ఆరెగంటి నాగరాజు గౌడ్ నేతృత్వంలో శివాజీ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, కేయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజుగౌడ్‌లు హాజరై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కుర్మా అధ్యక్షుడు ఉసెన్‌నాయక్, శృంగారపు విష్ణు, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు సుమన్‌రాజ్, ఉపాధ్యక్షుడు గణేశ్, తరుణ్, కోశాధికారి రవితేజ, సాయి, నితిన్, శివ, రోహిత్, రాజ్‌కుమార్, శిల్ప, ప్రీతి, పూజ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

శివాజీ ప్రతిమతో భారీ ఊరేగింపు

మడికొండ : ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని శివాజీ సేన ఆధ్వర్యంలో బుధవారం మడికొండ వినాయక్ నగర్ నుంచి మెట్టు రామలింగేశ్వర స్వామి అంగడి స్థలం వరకు శివాజీ ప్రతిమతో భారీ ఊరేగింపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ సేన సభ్యులు దువ్వ వేణు, గుడుగుల వినయ్‌కుమార్, దారంగుల ధనుంజయ్, దుప్పెల్లి అరవింద్, బండ రాజు, ఉద్దండి సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



మడికొండ వినాయక్ నగర్‌లో శివాజీ ప్రతిమతో ఊరేగింపు నిర్వహిస్తున్న శివాజీ సేన నేతలు

వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడండి

- వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి
- ధర్మసాగర్ రిజర్వాయర్ ఫిల్టర్‌బెడ్ల పరిశీలన



ధర్మసాగర్ ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. బుధవారం ధర్మసాగర్ రిజర్వాయర్ ఫిల్టర్‌బెడ్‌ను మేయర్ సందర్శించి ప్రస్తుత నీటి నిలువల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. సమర్థవంతంగా అక్కడి పనులు నిర్వహించడానికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వేసవి కాలం నేపథ్యంలో నగర అవసరాల కోసం 710 ఎఫ్ఎస్ఎఫ్‌టీసీ ధర్మసాగర్ రిజర్వాయర్‌లో అందుబాటులో ఉందని, ఈ నీటిని వచ్చే నాలుగు నెలల పాటు పొదుపుగా వాడుకోవాలని అన్నారు. నగరవాసులకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నామని, వేసవి కాలం ముగిసే వరకు ధర్మసాగర్ జలాశయంలో ఉన్న టీఎంసీ నీటి నిల్వలస్థాయి కొనసాగించేలా ఇరిగేషన్ అధికారులకు లేఖ రాయాలని అన్నారు. అనంతరం ధర్మసాగర్ 60 ఎంఎల్‌డీ ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలించారు. ఈ ఫిల్టర్‌బెడ్ నుంచి వరంగల్ నగరంతో పాటు బల్దియా పరిధిలోని 25 విలీన గ్రామాలతో పాటు 12 డివిజన్‌లకు నీటి సరఫరా జరుగుతుందన్నారు. వేసవి నేపథ్యంలో ఫిల్టర్‌బెడ్‌లో ఏమైనా సమస్యలు ఉంటే ముందస్తుగానే సరిచేసుకోవాలన్నారు. వేసవిలో ఎలాంటి నీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ఎండాకాలంలో నగర ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని మేయర్ గుండు సుధారాణి అన్నారు.

విద్యార్థిని దండించిన స్కూల్ యాజమాన్యంపై కేసు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థిని దండించిన ఘటనలో హసన్‌పర్తి మండలంలోని ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంపై యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ఆరె చంద్రుడు అనే విద్యార్థిని పాఠశాల వార్డెన్ అకారణంగా దాడి చేశాడని, కర్రతో చితక బాదాడని విద్యార్థి తండ్రి దేవేందర్ ఫిర్యాదు చేశాడన్నారు. ఆ ఫిర్యాదు మేరకు స్కూల్ వార్డెన్‌తో పాటు పాఠశాల యజమానిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ప్రచారం

హసన్‌పర్తి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తిలో బుధవారం బీజేపీ నాయకులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటర్లను కలిసి బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మారపల్లి రాంచంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు మారం తిరుపతి, మాజీ మార్కెట్ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు, డివిజన్ ప్రధాన కార్యదర్శి మట్టెడ సుమన్ తదితరులు పాల్గొన్నారు.



హసన్‌పర్తిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కేంద్ర బడ్జెట్‌పై విప్లవ పార్టీల నిరసన



వరంగల్ హెడ్‌పోస్టాఫీస్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

గిర్మాజిపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పెట్టుబడిదారులు, కార్పొరేట్ వర్గాలకు అనుకూల ఉందని ఆరోపిస్తూ వామపక్ష, విప్లవ పార్టీలు నిరసన తెలిపాయి. బుధవారం వరంగల్ హెడ్‌పోస్టాఫీస్ సెంటర్‌లో ఆయా పార్టీల నాయకులు ధర్నా నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తోందని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యం చేసిందని, విభజన హామీలను విస్మరించిందని విమర్శించారు. ఎల్ఐసీ ప్రైవేటీకరణను వెంటనే ఉపసంహరించుకోవాలని, గ్రామీణ ఉపాధిహామీ పథకానికి 50 శాతం నిధులు పెంచాలని, విభజన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు.

సీపీఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ)నాయకుడు రాచర్ల బాలరాజు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో సీపీఐ, సీపీఎం, ఎంసీపీఐ, ఎస్‌యూసీఐ నాయకులు మేకల రవి, నలిగంటి రత్నమాల, గంగుల దయాకర్, ఎ.యాదగిరి, జగదీశ్వర్, సత్యనారాయణ, ఎం.డి.బషీర్, ఎ.సదయ్య, పనాస ప్రసాద్, నగేష్, భవాని, దుర్గయ్య, ఇ.శ్రీనివాస్, రంజిత్, జి.రమేష్, హరిబాబు, ప్రశాంత్, మాలి ప్రభాకర్, సమ్మయ్య, మధు, సురేష్, వాణి, ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కేయూ ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ సురేశ్‌లాల్‌కు అభినందనలు



డైరెక్టర్ సురేశ్‌లాల్‌ను సన్మానిస్తున్న డాక్టర్ కొట్టే భాస్కర్, ఐలేశ్ తదితరులు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్‌కు శాలువా, పుష్పగుచ్ఛం అందచేసి బుధవారం అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేయూ దూరవిద్య కేంద్రం ఎస్డీఎల్‌సీఈ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టే భాస్కర్, డాక్టర్ మాచర్ల ఐలేశ్, ముత్యాల శ్రీసాయి, ప్రవీణ్, టి.సుకేందర్, పెరుమాండ్ల నరేశ్, బి.ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



సంకల్పం

మద్యంపై మహిళల పోరు

ఊరుకు పట్టిన 'మత్తు' వదిలించడానికి మహిళా లోకం కదిలింది. యువకుడి మరణానికి కారణమైన మద్యాన్ని... తమ గ్రామం నుంచి తరిమేయాలని సంకల్పించింది. బెల్టు షాపులను మూయించి... మద్యం అమ్మినా... తాగినా జరిమానా వేయాలని నిర్ణయించింది. ఒత్తిడులు ఎదురైనా... బెదిరింపులు వచ్చినా... మద్య నిషేధాన్ని కొనసాగించి తీరతామని... మరే కుటుంబాన్నీ అనాథ కానివ్వమని ప్రతిజ్ఞ పూనింది. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఏపూరు గ్రామ మహిళల మహాపోరాటం 'నవ్య'కు ప్రత్యేకం.

ఇది మహాసంగ్రామం. ఊరు కోసం... ఊళ్లోని ప్రతిఒక్కరి బాగు కోసం ఏపూరు మహిళలు భుజానికెత్తుకున్న ఉద్యమం... మద్య నిషేధం. ఏపూరుకు చెందిన మినీ లారీ డ్రైవర్ కూరాకుల ధనుంజయ ఇటీవల గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ధనుంజయకు భార్య శిల్ప, మూడేళ్ల కుమారుడు హర్షిత్, ఏడాదిన్నర కూతురు తేజస్వీ ఉన్నారు. వృద్ధులైన తల్లిదండ్రుల బాధ్యత కూడా అతడిదే. డ్రైవర్‌గా రోజంతా



కష్టపడి సంపాదిస్తేనే ధనుంజయ కుటుంబానికి పూట గడిచేది. అలాంటి కుటుంబం ధనుంజయ మరణంతో దిక్కులేనిదయింది. వారి పరిస్థితి గ్రామస్తులను కలచివేసింది. ఆ కుటుంబానికి వచ్చిన కష్టం... తమకొచ్చినట్లేనని గ్రామంలోని మహిళలంతా భావించారు. ఆ బాధను పంచుకోవాలని, ఈ మరణానికి కారణమైన మద్యం దెయ్యాన్ని గ్రామం నుంచి తరిమేయాలని కంకణబద్ధులయ్యారు.

అమ్మితే లక్ష జరిమానా...

గ్రామంలో ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోవడానికి, నైతికంగా పతనం కావడానికి కారణమైన మద్యాన్ని గ్రామం నుంచి పారదోలాలని సంకల్పించారు. ధనుంజయ అంత్యక్రియలు ముగిసేలోగానే మహిళలంతా సమావేశమై గ్రామంలో మద్య నిషేధం విధించారు. బెల్టు దుకాణాలు ఎత్తివేయాలని తీర్మానించారు. మద్యం అమ్మితే రూ.లక్ష, మద్యం సేవిస్తే రూ.20 వేల జరిమానా వేయాలని నిర్ణయించారు. అంతేకాదు... మద్యం అమ్మినవారిని పట్టిస్తే రూ.10 వేల నజరానా కూడా ఇస్తామని ప్రకటించారు. తామంతా కలిసి తీసుకున్న నిర్ణయానికి గ్రామంలోని మగవారంతా సహకరించాలని కోరారు. గత వారం రోజులుగా మద్య నిషేధం అమలు చేస్తుండడంతో గ్రామంలో కొత్త వాతావరణం నెలకొంది.

వెనక్కి తగ్గేది లేదు...

'మా ఊళ్లో మద్య నిషేధం కొనసాగించడానికి ఎంతవరకైనా పోరాడతాం. ఇందులో ఎలాంటి అనుమానం లేదు. ఎలాంటి ఒత్తిళ్లు ఎదురైనా వెనక్కి తగ్గేది లేదు. ఊళ్లో మళ్లీ బెల్టు షాపులు ఏర్పాటు చేసినా, అక్రమ మద్యం సిట్టింగులు కొనసాగించినా జరిమానాలు విధించడమే కాదు... వారిని పోలీసులకు పట్టిస్తాం. ఈ ఉద్యమానికి మా కుటుంబాల నుంచి కూడా సంపూర్ణ మద్దతు లభించింది. మా నిర్ణయాన్ని అందరూ స్వాగతిస్తున్నారు. ఇవన్నీ చూశాక గ్రామంలో మద్య నిషేధాన్ని అమలు చేయగలుగుతామన్న నమ్మకం కలిగింది" అంటారు ఈ ఉద్యమానికి శ్రీకారం చుట్టిన అనురాధ తదితర మహిళలు.

'కొనసాగించి తీరతాం..'

రాజకీయ, ఇతర కారణాలతో ఎవరూ బెల్టుషాపు నిర్వాహకులను వెనకేసుకురావద్దని మహిళలు గ్రామస్తులందరినీ హెచ్చరించారు. ప్రతి మహిళ తన ఇంట్లో ఎవరూ తాగకుండా చూడాలని సంకల్పించుకున్నారు. తమ భర్తలు, పిల్లలు మద్యం తాగవద్దని తాము చెప్పడమే కాకుండా, పిల్లలతోనూ చెప్పిస్తున్నారు. మహిళలే గ్రామంలో మద్య నిషేధం కోసం అందరినీ చైతన్య పరుస్తున్నారు. దాన్ని పక్కాగా అమలు చేసే బాధ్యత కూడా వారే తీసుకున్నారు. ప్రతి మహిళా తన ఇంటి నుంచే మార్పు రావాలని బలంగా సంకల్పించుకున్నారు. తమ ఇళ్లల్లోని మగవారిని మద్యం జోలికి వెళ్లకుండా నచ్చజెబుతున్నారు. ఆటంకాలు ఎన్ని ఎదురైనా... బెదిరింపులు వచ్చినా గ్రామంలో మద్య నిషేధం కొనసాగించి తీరతామని ప్రతిజ్ఞ చేశారు.

మంచి నిర్ణయం

"మద్య నిషేధం తర్వాత ఊళ్లో సాయంత్రమయ్యాక ఎవరింటికి వారు వెళుతున్నారు. అన్ని కుటుంబాలూ ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా నిద్రిస్తున్నాయి. ధనుంజయ మరణంతో ఊళ్లో కదలిక వచ్చింది. మహిళలందరూ కలిసి తీసుకున్న మద్య నిషేధ నిర్ణయాన్ని అందరూ స్వాగతించాలి. ఊళ్లో మద్యం విక్రయించకుండా అందరూ సహకరించాలి. వినకపోతే పోలీసులు జోక్యం చేసుకోవాలి" అంటారు గ్రామస్తుడైన వృద్ధుడు వీరయ్య యాదవ్.

ఒక్క సీసా కూడా రానిచ్చేదిలేదు...

గ్రామంలో ఉన్న 650 కుటుంబాలలో దాదాపు 2500 జనాభా ఉంది. ఈ గ్రామంలో 300 పైచిలుకు మంది డ్రైవర్లుగా పని చేస్తున్నారు. మరోవైపున గ్రామాన్ని ఆనుకొని ఉన్న ఒక ప్రైవేట్ పరిశ్రమలో మరో 150 మంది వరకు పని చేస్తున్నారు. కేవలం వ్యవసాయం, కులవృత్తులే కాకుండా ప్రతి కుటుంబానికి అదనంగా పని చేసే వనరుల ద్వారా అదనపు సంపాదన వస్తుండడంతో తేలిగ్గా మద్యం సేవించేందుకు అలవాటు పడిన ఘటనలే ఎక్కువగా ఉన్నాయనేది గ్రామస్తుల మాట. స్థానికంగా ఉన్న 13 బెల్టు షాపులను గుర్తించిన మహిళలు... వారందరినీ మద్యం అమ్మకుండా కట్టడి చేశారు. మరోవైపు గ్రామ సమీపంలో దాబాల ముసుగులో ఉన్న అక్రమ సిట్టింగులను కూడా నిషేధించారు. ప్రస్తుతం గ్రామంలో ఒక్క మద్యం సీసా కూడా కనిపించడంలేదు. బెల్టు షాపుల నిర్వాహకులు మహిళలపై రకరకాలుగా ఒత్తిళ్లు తెస్తున్నారు. కానీ వాటికి తాము లొంగేది లేదని, ఊళ్లోకి మద్యం సీసా రానిచ్చేది లేదని తెగేసి చెబుతున్నారు. వారి దృఢ సంకల్పానికి మహిళా లోకం జేజేలు పలుకుతోంది.

• **చల్లా సాంబశివారెడ్డి**, నల్లగొండ

స్ఫూర్తి

మైఖెల్ షూమాకర్, మ్యాక్స్ వెర్‌స్టాపెన్... ఈ పేర్లు వినగానే ఎఫ్1 రేసుల్లో విమాన వేగంతో దూసుకుపోయే కార్లు మన కళ్ల ముందు మెదులుతాయి. వారి స్ఫూర్తితో రేసుల్లో దూసుకుపోతోంది పదేళ్ల కశ్మీరు బాలిక ఆతికా మిర్. తాజాగా 'రోటాక్స్ ఛాలెంజ్ ఇంటర్నేషనల్ ట్రోఫీ' గెలిచి, ఈ ఘనత సాధించిన తొలి ఆడపిల్లగా చరిత్ర సృష్టించింది. 'వరల్డ్ సిరీస్ కార్టింగ్' ఛాంపియన్‌షిప్ కోసం సన్నద్ధమవుతున్న ఆతికా కథ ఇది.



రేస్‌లో సరికొత్త సంచలనం

గో కార్టింగ్... కారు రేసు ప్రేమికులను ఆకట్టుకునే క్రీడ. ప్రత్యేకించి వరల్డ్ కార్టింగ్ సిరీస్, ఉత్తమమైన డ్రైవర్లనూ, టాప్ కార్ట్, ఇంజన్ ఉత్పత్తిదారులనూ ఆకట్టుకుంటూ ఉంటుంది. ఇలాంటి ప్రతిష్ఠాత్మకమైన 'వరల్డ్ సిరీస్ కార్టింగ్' (డబ్ల్యుఎస్‌కె) ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనబోతున్న పదేళ్ల భారతీయ బాలికగా ఆతికా మిర్ చరిత్ర సృష్టించబోతోంది. తాజాగా దక్షిణ ఇటలీలోని, లా కొకా సర్క్యూట్‌లో చేపట్టిన టెస్ట్ సెషన్‌లో ఆతికా అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. జమ్ముకశ్మీరుకు చెందిన ఈ రేసర్, 60 కార్టులతో కూడిన విఎనీ క్లాస్‌లో పాల్గొన్న ఏకైక బాలిక కావడం విశేషం. ఈ



పాప ఈ ఏడాది జరగబోయే డబ్ల్యుఎస్‌కె సూపర్ మాస్టర్ సిరీస్, డబ్ల్యుఎస్‌కె యూరో సిరీస్, డబ్ల్యుఎస్‌కె ఫైనల్ కప్ పోటీల్లో పాల్గొనబోతోంది. ఈ పోటీల గురించి మాట్లాడుతూ... 'ఈ పోటీలో పాల్గొనే అవకాశం దొరకడం నా అదృష్టం. ఇది నేను నడపబోతున్న అత్యున్నతమైన కార్టింగ్ కాబోతోంది. ఈ పోటీ కోసం ఎన్నో సర్క్యూట్లలో నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. పైగా చలి కాలంలో డ్రైవ్ చేయడం చాలా కష్టం. అయినా నేనందుకు అన్ని విధాలా సిద్ధమయ్యాను' అంటూ మీడియాకు వివరించింది పాప. డబ్ల్యుఎస్‌కెలో ప్రారంభ రోజుల్లో రేసులో పాల్గొన్న ప్రముఖ డ్రైవర్లలో ఎఫ్1 డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ కూడా ఉన్నాడు. అతనిలాగే ఆతికా కూడా రేసింగ్ కుటుంబ నేపథ్యాన్ని కలిగి ఉంది. ఈ పాప తండ్రి ఆసిఫ్ నజీర్, భారత మొట్టమొదటి జాతీయ కార్టింగ్, ఫార్ములా ఆసియా ఛాంపియన్. ఆతికా పాల్గొనే ప్రతి పోటీలో కూతురి వెన్నంటి ఉంటూ, రేసింగ్ మెలకువలను నేర్పిస్తూ ఉంటారు ఆసిఫ్.

తండ్రి తోడుగా...

తన కూతురి ప్రతిభ గురించి మాట్లాడుతూ, 'ఆతికా తన అంకితభావంతో, ప్రతిభతో కార్టింగ్‌లో అత్యున్నత స్థానాన్ని అందుకోగలిగింది. అయితే తాజా రేసులో ఆమె కొన్ని మెలకువలను అలవరుచుకోక తప్పదు. కొత్త ట్రాక్స్, కొత్త పరిస్థితులు, కొత్త వాతావరణాలకు కూడా అలవాటు పడాలి. ఈ పోటీ ఆమెకొక పెద్ద సవాలుగా మారబోతోంది" అంటూ కూతురి ప్రతిభను ప్రశంసిస్తూనే, పోటీలో గెలుపు సాధ్యాసాధ్యాల గురించి ప్రస్తావించాడు ఆసిఫ్ నజీర్.

ఐదేళ్ల వయసులోనే...

ఐదేళ్ల వయసులోనే ఇండోర్ కార్టింగ్ మొదలుపెట్టిన ఆతికా, ఎంతో వేగంగా యుఎఇ జాతీయ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే స్థాయికి చేరుకుంది. ర్యాంకుల పరంగా కూడా వేగంగా ఎదిగింది. ఆ సందర్భం గురించి మాట్లాడుతూ... 'ప్రతి విజయం తరువాత మా నాన్న నాకు కొత్త లక్ష్యాలను ఇస్తూ ఉంటారు. ఆయన ప్రేరణతో నేను వాటిని అందుకుంటూ ఉంటాను. అలా క్రమేపీ నా వయసు విభాగంలో జాతీయ పోటీల్లో పాల్గొనే స్థాయికి ఎదగగలిగాను' అంటోంది ఆతికా. తన విజయాల గురించి వివరిస్తూ... 'నాకెంతో గర్వంగా ఉంది. మోటార్ స్పోర్ట్‌లో మహిళలకు అవకాశాలు తక్కువ. లె మ్యాన్స్ కార్ట్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో విజయం సాధించినందుకు, ప్రతిష్ఠాత్మకమైన వరల్డ్ సిరీస్ కార్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే అర్హత పొందినందుకూ నాకెంతో గర్వంగా ఉంది' అంటూ చెప్పుకొచ్చింది ఈ చిన్నారి.

ఆతికా మిర్ విజయ పరంపర

మెగా ఛాంపియన్‌షిప్ మీద గురి పెట్టిన ఆతికా ఇప్పటివరకూ పలు పోటీల్లో అత్యద్భుతమైన ప్రతిభ కనబరిచింది. ఆ వివరాలు...

- ప్రపంచవ్యాప్త జాతీయా కార్టింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో అత్యధిక ర్యాంకు సాధించిన తొలి మహిళా డ్రైవర్‌గా గుర్తింపు పొందింది
- డిఎఎమ్‌సి, మిడిల్‌ఈస్ట్ కప్ 2024లో మూడో స్థానం పొందింది
- ఎఫ్ఎమ్ఎస్ఐ జాతీయ నేషనల్ కార్టింగ్ ఛాంపియన్‌షిప్ రౌండ్ వన్‌లో మూడో స్థానం సాధించింది
- దుబాయిలోని ల్యాప్ రికార్డును బద్దలు కొట్టిన మొట్టమొదటి భారతీయురాలు
- లె మ్యాన్స్ కార్ట్ ఇంటర్నేషనల్ సర్క్యూట్ గెలిచిన తొలి మహిళా డ్రైవర్
- ఐరన్ డేమ్స్ యంగ్ టాలెంట్ ప్రోగ్రామ్‌కు ఎంపికైన తొలి ఆసియా వనిత
- రోటాక్స్ ఛాలెంజ్ అంతర్జాతీయ ట్రోఫీ రేసులో గెలిచిన తొలి భారతీయురాలు

మొక్కలను ఇలా సంరక్షించుకోండి...

బాల్కనీలో లేదా పెరట్లో పెంచుకునే మొక్కలకు ఒక్కోసారి పురుగులు, తెగుళ్లు పడుతుంటాయి. వీటిని నివారించడానికి నిపుణులు సూచిస్తున్న ఇంటి చిట్కాలు ఇవే...



- ఒక గిన్నెలో గ్లాసు నీళ్లు, రెండు చెంచాల డిష్ వాషింగ్ లిక్విడ్ వేసి బాగా కలపాలి. ఈ నీళ్లను ఒక స్ప్రే బాటిల్‌లో పోసి వారంపాటు మొక్కలపై పిచికారీ చేస్తే తెగుళ్లు, పురుగులు తొలగిపోతాయి.
- అరగ్లాసు నీళ్లలో ఒక చెంచా సబ్బు పొడి లేదా సర్ఫ్, రెండు చెంచాల వంట నూనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మొక్కల కొమ్మలకు కాండానికి పూయాలి. ఇలా మూడు రోజులు చేస్తే పురుగులన్నీ నశించిపోతాయి.
- ఒక గ్లాసు నీళ్లలో రెండు చెంచాల కారం వేసి బాగా కలిపి స్ప్రే బాటిల్‌లో పోయాలి. రెండు రోజులకు ఓసారి ఈ నీళ్లను మొక్కలపై పిచికారీ చేస్తే పురుగులు రావు. బజార్లో దొరికే పెప్పర్ స్ప్రే కూడా మంచి ఫలితాన్నిస్తుంది.
- ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లలో ఒక చెంచా వెనిగర్, అర చెంచా డిష్ వాషింగ్ లిక్విడ్ వేసి బాగా కలిపి స్ప్రే బాటిల్‌లో పోయాలి. దీనిని రోజుకు రెండుసార్లు మొక్కలపై పిచికారీ చేస్తే తెగుళ్లే మాయమవుతాయి. పురుగులు చేరవు.
- ఏడు వెల్లుల్లి రెబ్బలను మెత్తగా నూరి ఒక గ్లాసు నీళ్లలో కలపాలి. తరవాత వడబోసి ఒక చెంచా పసుపు కలిపి స్ప్రే బాటిల్‌లో నింపాలి. ప్రతి రోజూ ఉదయాన్నే ఈ నీటిని మొక్కలపై పిచికారీ చేస్తూ ఉంటే ఎటువంటి పురుగులైనా నశించిపోతాయి.

కౌన్సెలింగ్

మద్యం ప్రభావం ఏ మేరకు?

Q A

డాక్టర్! మా వారికి మద్యం అలవాటు ఉంది. మద్యాన్ని నాక్కూడా అలవాటు చేశారు. ఈ అలవాటు ప్రమాదకరం అని మా ఇద్దరికీ తెలుసు. కానీ వారానికి ఒక సారే కాబట్టి ప్రమాదం ఉండదని నాతో వాదిస్తున్నారు. పరిమితంగా తాగేవారికి మద్యంతో ఎలాంటి ప్రమాదం ఉండదా?

- ఓ సోదరి, హైదరాబాద్.

మద్యం ప్రభావానికి గురయ్యే తత్వం, మద్యం ప్రభావం తీవ్రతలు మనిషి మనిషికీ వేర్వేరుగా ఉంటాయి. అందరి శరీరాలూ ఒకే విధంగా మద్యాన్ని శక్తిగా మార్చుకోలేవు. జన్యుపరమైన అంశాలు, వయసు, లింగం, ఆరోగ్య పరిస్థితులు, ఎటువంటి దుష్ప్రభావాలకు లోను కాకుండా ఒక వ్యక్తి తీసుకోదగిన సురక్షిత మద్యం మోతాదును నిర్ణయిస్తాయి. ఉదాహరణకు...

- పురుషుల కంటే మహిళలకు మద్యాన్ని భరించే సామర్థ్యం తక్కువగా ఉంటుంది. స్త్రీపురుషుల శరీర పరిమాణం, ఎంజైమ్‌ల పనితీరుల్లోని వ్యత్యాసాలే ఇందుకు ప్రధాన కారణం.
- కుటుంబచరిత్రలో మద్యపాన వ్యసనపరులున్న వారిలో మద్యం సంబంధిత అవయవ నష్టం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

మద్యంతో కాలేయ నష్టం

మద్యం ఏ మోతాదులో తీసుకున్నా, ఎంత పరిమితంగా తీసుకున్నా కాలేయానికి కచ్చితంగా నష్టం జరుగుతుంది. దీర్ఘకాలంలో కాలేయం పలు రకాల రుగ్మతలకు గురవుతుంది.

- **కాలేయానికి కొవ్వు:** పరిమితంగా మద్యం తీసుకునేవారిలో కూడా కాలేయంలో కొవ్వు పేరుకుంటుంది. ఈ దశలో మద్యపానానికి స్వస్తి చెప్పగలిగితే తిరిగి కాలేయం పూర్తిగా కోలుకుంటుంది
- **మద్యం సంబంధిత కామెర్లు:** ఆల్కహాలిక్ హెపటైటిస్ అనే ఈ రుగ్మతలో తీవ్రమైన మద్యపాన సేవనం వల్ల, కాలేయంలో ఇన్‌ఫ్లమేషన్ తలెత్తి, నొప్పి, కామెర్లు మొదలై, కాలేయ పనితీరు అస్తవ్యస్థమై, చివరకు మరణం కూడా సంభవించవచ్చు



- **సిర్రోసిస్:** దీర్ఘకాలం పాటు యథేచ్ఛగా మద్యం తాగడం వల్ల, కాలేయం మీద శాశ్వత మచ్చలు ఏర్పడి, కాలేయం విఫలమవుతుంది. కాలేయం ఆరోగ్యంగా ఉండాలని కోరుకునే వారు మద్యపానానికి స్వస్తి చెప్పడం ఒక్కటే మార్గం. కాబట్టి ఈ అలవాటును వెంటనే మానుకోండి. మానేయలేని పక్షంలో వైద్య సహాయం తీసుకోవచ్చు.

డాక్టర్ కె.ఎస్. సోమశేఖర రావు
సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ అండ్ హెపటాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ, హైదరాబాద్.

పావురాలు రాకుండా ఉండాలంటే...

బాల్కనీ, కిటికీలు, వెంటిలేటర్ల వద్ద పావురాలు వచ్చి గూళ్లు కడుతూ ఉంటాయి. వీటి రెట్టల వల్ల శ్వాసకోశ సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. నెట్, మెష్ లాంటివి పెట్టకుండా ఇంట్లో దొరికేవాటితోనే కొన్ని చిట్కాలు పాటించి పావురాలు రాకుండా చేయవచ్చు.

- గుప్పెడు మిరియాలను తీసుకుని కొద్దిగా వేడి చేసి మెత్తగా నూరి పొడి చేయాలి. బాల్కనీ, కిటికీలతోపాటు పావురాలు వాలే ప్రదేశాల్లో ఈ పొడిని చల్లాలి. మిరియాల ఘాటుకి పావురాలు రావు.
- ఒక గ్లాసు నీటిలో ఒక చెంచా వెనిగర్ లేదా పుదీనా నూనె కలిపి పావురాలు తిరిగే చోట చల్లితే అవి వెళ్లిపోతాయి. ఏదైనా ఎస్సెన్షియల్ ఆయిల్ లేదా దాల్చిన చెక్క పొడి కలిపిన నీళ్లు చల్లినా ప్రయోజనం ఉంటుంది.
- పావురాలు వాలే ప్రదేశాల్లో విండ్ చైమ్స్ వేలాడదీయాలి. గాలి వీచినప్పుడు ఇవి చేసే శబ్దం వల్ల పావురాలు దూరంగా వెళ్లిపోతాయి. అద్దాల




తోపాటు మెరిసే గొట్టాలు ఉన్నవి అయితే మంచి ఫలితం కనిపిస్తుంది.
- బాల్కనీలో గద్ద, గుడ్లగూబ లాంటి పెద్ద పక్షుల బొమ్మలను వేలాడదీస్తే పావురాలు భయపడి రావు.
- సన్నని దారంతో పాత సీడీలను కట్టి వేలాడదీస్తే అవి ప్రతిబింబించే రంగుల కాంతికి పావురాలు రాకుండా ఉంటాయి. అల్యూమినియం ఫాయిలే లేదా ఏదైనా మెరిసే వస్తువును వేలాడదీసినా ఫలితం ఉంటుంది.
- పాత బ్యాగ్‌లు లేదా దుస్తులకు ఉండే జిప్‌లను తీసి బాల్కనీ, కిటికీల అరుగులపై అంటిస్తే వాటి గరుకుదనానికి పావురాలు వాలవు.
- ఇప్పటికే గూడు పెట్టివుంటే దాన్ని జాగ్రత్తగా మరో ప్రాంతానికి తరలిస్తే పావురాలు వెళ్లిపోతాయి.

వీటిని కలుపుకొని తాగితే...

ప్రతిరోజూ ఒక గ్లాసు పాలు తాగడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. వంటింట్లో ఉండే కొన్ని దినుసులను కలుపుకుని తాగితే మరిన్ని ప్రయోజనాలు సమకూరుతాయని సూచిస్తున్నారు. వాటి గురించి తెలుసుకుందాం.

- గోరువెచ్చని పాలలో చిటికెడు పసుపు కలుపుకొని తాగితే జీర్ణ సమస్యలు రావు. కీళ్ల నొప్పులు, వాపులు కూడా తొందరగా తగ్గుతాయి.
- గ్లాసు పాలలో ఒక చెంచా తేనె కలిపి తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. తేనెలోని యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు జీవక్రియలను వేగవంతం చేస్తాయి.
- ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో చిటికెడు యాలకుల పొడి కలుపుకుని తాగితే పేగుల్లో అనారోగ్య సమస్యలు రావు. మలబద్ధకం తీరుతుంది.
- చిన్న అల్లం ముక్కను తీసుకుని కచ్చాపచ్చాగా దంచి గ్లాసు పాలలో వేసి మరిగించాలి. ఈ పాలను రాత్రి పడుకునే ముందు తాగితే జలుబు, దగ్గు, ఇతర శ్వాసకోశ సమస్యలు, కీళ్లవాతం లాంటి సమస్యలు దరిచేరవు.
- ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో రెండు కుంకుమ పువ్వు రేకులు వేసి అయిదు నిమిషాలు నాననివ్వాలి. పాలు బంగారు వర్ణంలోకి మారినతరవాత తాగితే మానసిక ప్రశాంతత లభిస్తుంది. చర్మం మెరుపును సంతరించుకుంటుంది.



- గ్లాసు పాలలో పావు చెంచా మిరియాల పొడి వేసుకుని తాగితే గొంతు మంట, దగ్గు తగ్గుతాయి.
- ఒక అంగుళం పొడవున్న దాల్చిన చెక్క ముక్కను కచ్చాపచ్చాగా దంచి ఒక గ్లాసు పాలలో వేసి రెండు నిమిషాలు మరిగించి తాగితే అధిక బరువు తగ్గుతుంది. శరీరంలో పేరుకున్న కొవ్వు కరిగిపోతుంది.

ఈగలను తరిమికొట్టండి ఇలా...

వాతావరణం వేడెక్కే కొద్దీ ఈగల బెడద ఎక్కువవుతూ ఉంటుంది. ఈగలను తరిమికొట్టేందుకు కొన్ని చిట్కాలు...

- ఇంటి తలుపులు, కిటికీలు తెరచి ఉంచాలి. ఒక వెడల్పాటి గిన్నె లేదా మట్టి ప్రమిదను తీసుకుని అందులో అయిదు బిర్యానీ ఆకులు, రెండు చెంచాల వేప లేదా ఆవ నూనె, అయిదు కర్పూరం బిళ్లలు వేసి వెలిగించాలి. ఈ ప్రమిదని ప్రతి గదిలో కొంచెంసేపు ఉంచాలి. ఇందులో నుంచి వచ్చే పొగ వాసనకు ఈగలన్నీ బయటికిపోతాయి.
- వంటగది సింక్ లోపల, చెత్తబుట్ట చుట్టూ బేకింగ్ సోడా చల్లి దానిపై నిమ్మ రసాన్ని చుక్కలుగా పిండాలి. నిమ్మకాయ వాసనవల్ల ఈగలు దూరంగా వెళ్లిపోతాయి.
- ఒక పళ్లెంలో అయిదు మిరియాలు,




నాలుగు వెల్లుల్లి రెబ్బలు వేసి మెత్తగా నూరాలి. ఈ పేస్టుని ఒక స్ప్రే బాటిల్‌లో వేసి నిండుగా నీళ్లు పోయాలి. వంటగది కిటికీల దగ్గర, తలుపుల మీద, సింక్‌లో ఈ నీళ్లు పిచికారీ చేస్తే ఈగలు రావు.
- ఒక స్ప్రే బాటిల్‌లో ఉప్పు లేదా కర్పూరం పొడి కలిపిన నీళ్లు పోసి ఈగలు వాలే చోట పిచికారీ చేయాలి. ఈ నీళ్లతో ఇల్లంతా తుడిచినా మంచి ఫలితం కనిపిస్తుంది.

ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965

వరంగల్ ● గురువారం 20 ఫిబ్రవరి 2025

వెండితెర చెప్పిన బంగారు దర్శకుడి కథ



తెలుగు సినిమాకు గౌరవం, గుర్తింపు తెచ్చిన దర్శకుల్లో ముందు వరుసలో ఉంటారు కళాతపస్వి కె.విశ్వనాథ్. సినిమా అంటే కేవలం కమర్షియల్ హంగులు, డ్యాన్సులు, ఫైట్లు కావనీ, సంస్కృతి, కళలు, సంప్రదాయ విలువలు అని తన చిత్రాల ద్వారా చాటి చెప్పిన గొప్ప దర్శకుడాయన. మొత్తం 51 చిత్రాలకు దర్శకత్వం వహించిన ఈ కళాతపస్వి ఇప్పుడు మనమధ్య లేకపోయినా ఆయన చిత్రాలు ఏదో ఒక రూపంలో అలరిస్తూనే ఉన్నాయి. తెలుగు జాతి గర్వించదగ్గ ఇటువంటి దర్శకుడి జీవిత కథను డాక్యుమెంటరీ రూపంలో తీసుకువస్తోంది పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ. రచయిత, దర్శకుడు జనార్ధనమహర్షి రూపొందించిన ఈ డాక్యుమెంటరీకి విశ్వదర్శనం అనే పేరు పెట్టారు. విశ్వనాథ్ జయంతి సందర్భంగా దీనికి సంబంధించిన ప్రోమోను విడుదల చేశారు. తెలుగు చిత్ర పరిశ్రమలోని పలువురు ప్రముఖులు విశ్వనాథ్‌తో తమకున్న అనుబంధాన్ని ఈ డాక్యుమెంటరీలో వివరించనున్నారు. వెండితెర చెప్పిన బంగారు దర్శకుడి కథ ఇదనీ, త్వరలోనే ఓటీటీలో విడుదల చేస్తున్నామనీ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వెల్లడించింది.

ఆద్యంతం నవ్వుతూనే ఉంటారు



రీతూ వర్మ

'పెళ్లి చూపులు', 'స్వాగ్' చిత్రాల నటి రీతూ వర్మ తాజా చిత్రం 'మజాకా'. సందీప్ కిషన్ కథానాయకుడిగా త్రినాధరావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా, ఉమేశ్ కేఆర్ బన్సాల్ నిర్మించారు. ఈ నెల 26న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రవిశేషాలను మీడియాతో పంచుకున్నారు రీతూ వర్మ. "ఈ సినిమా కథ వినగానే బాగా నచ్చేసింది. వెంటనే ఓ.కే చేశా. ఇందులో మంచి వినోదంతో పాటు హృదయాన్ని బరువెక్కించే భావోద్వేగాలూ ఉన్నాయి. సినిమాలో కాలేజీ అమ్మాయిగా కనిపిస్తా. నా పాత్రకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. ఇంతవరకూ ఇటువంటి రోల్‌ని నేను చేయలేదు. సినిమాలోని ప్రతి పాత్రా చాలా కొత్తగా ఉంటుంది. దర్శకుడు త్రినాధరావు చాలా కూల్‌గా ఉంటారు. తను చేసే ప్రతీ సినిమాతో ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని అందివ్వాలని తపిస్తుంటారు. 'మజాకా' కథనాన్ని చాలా ఆసక్తికరంగా నడిపించారు. సినిమా ఆద్యంతం నవ్విస్తుంది. సందీప్, అన్షు, రావు రమేశ్‌లతో పనిచేయడం మర్చిపోలేని అనుభవం. కుటుంబ ప్రేక్షకులతో పాటు యువతరాన్ని కూడా ఆకట్టుకుంటుందీ చిత్రం. తప్పకుండా ఘనవిజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది" అని చెప్పారు.

జై భవానీ




'కాంతార' చిత్రంతో హీరోగా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు రిషబ్ శెట్టి. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహారాజ్'. మరాఠా యోధుడు శివాజీ జీవితం ఆధారంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో రిషబ్ టైటిల్ పాత్ర పోషిస్తున్నారు. సందీప్ సింగ్ దర్శకుడు. బుధవారం శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా చిత్రబృందం ప్రచార చిత్రాన్ని విడుదల చేసింది. ఖడ్గం చేతబూనిన శివాజీ భవానీ మాత విగ్రహం ముందు నిలబడి కనిపించారు. ఈ ఏడాది మేలో జరగనున్న కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయనున్నట్లు సందీప్ సింగ్ తెలిపారు. 2027 జనవరి 21న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

మహా కుంభమేళాలో టీజర్...



వశిష్ఠ ఎన్.సింహా, తమన్నా భాటియా, హెబ్బా పటేల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఓదెల 2'. 2022లో విడుదలైన 'ఓదెల రైల్వే స్టేషన్'కు ఇది కొనసాగింపు. దర్శకుడు సంపత్ నంది కథ అందించగా, అశోక్ తేజ తెరకెక్కిస్తున్నారు. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్ బ్యానర్‌పై డి.మధు నిర్మిస్తున్నారు. సినిమా టీజర్‌ను ఈ నెల 22న ప్రయాగరాజ్‌లోని మహా కుంభమేళాలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సూపర్ న్యాచురల్ థ్రిల్లర్‌లో తమన్నా నాగసాధువు పాత్రలో నటిస్తుండడం విశేషం.

భయపెట్టే 'శబ్దం'



ఆది పినిశెట్టి నటించిన 'వైశాలి' చిత్రం ఓ విభిన్న ప్రయత్నంగా ప్రశంసలు అందుకొంది. దర్శకుడు అరివళగన్ రూపొందించిన ఆ చిత్రం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్‌లో మరో సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా 'శబ్దం' చిత్రం రానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను బుధవారం విడుదల చేశారు. 'వెయ్యి గబ్బిలాలు చెవిలో అరుస్తున్నట్లు ఉంటోంది డాక్టర్' అనే డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. ఆది పినిశెట్టి అతీంద్రియ శక్తుల అన్వేషకుడిగా కనిపించారు. 'శబ్దం' చిత్రాన్ని ఈ నెల 28న ఆంధ్రాలో ఎన్ సినిమాస్, తెలంగాణలో మైత్రి సంస్థలు విడుదల చేస్తున్నాయి. సహ నిర్మాత: భానుప్రియ శివ, నిర్మాత: సెవెన్ జీ శివ.





ప్రేక్షకులే హౌస్‌ఫుల్ చేస్తారు

బ్రహ్మాజీ, అవసరాల శ్రీనివాస్, బలగం సుధాకర్, ఆమని కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'బాపు'. 'ఏ ఫాదర్స్ స్టోరీ' అనేది ఉప శీర్షిక. దయా దర్శకత్వంలో రాజు, సి.హెచ్.భానుప్రసాద్ రెడ్డి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శకుడు నాగ్ అశ్విన్ మాట్లాడుతూ "ఈ సినిమాకు పాజిటివ్ వైబ్స్ కనిపిస్తున్నాయి. సినిమా బాగుంటే మన తెలుగు ప్రేక్షకులు రెండో రోజు నుంచి హౌస్‌ఫుల్ చేస్తారు" అని అన్నారు. "ఈ సినిమాకు దర్శకుడు దయానే హీరో" అని బుచ్చిబాబు సాన చెప్పారు. "సినిమా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను" అని సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో అన్నారు. "ఇందులో ఓ గుర్తుండిపోయే పాత్ర చేశాను" అని నటుడు బ్రహ్మాజీ తెలిపారు. "బ్రహ్మాజీ నటించడం వల్లే ఈ సినిమాకు ఇంత బజ్ వచ్చింది. సినిమాను ఆదరించండి" అని చిత్ర దర్శకుడు దయ కోరారు. "ఈ సినిమా ఘనవిజయం సాధిస్తుంది" అని చిత్రనిర్మాత భానుప్రసాద్ రెడ్డి చెప్పారు.

డబ్బింగ్ పనుల్లో...



బాలీవుడ్ కథానాయకుడు సన్నీ డియోల్‌తో దర్శకుడు గోపీచంద్ మలినేని 'జాట్' చిత్రం తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. రణ్‌దీప్ హుడా, వినీత్‌కుమార్ సింగ్, రెజీనా కసాండ్ర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్లపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 10న పాన్ ఇండియా స్థాయిలో సినిమా విడుదలవుతోంది. ఇప్పటికే విడుదల చేసిన టీజర్ యాక్షన్ ప్రియులను అలరించింది. తాజాగా, ఈ సినిమా డబ్బింగ్ పనులను మొదలుపెట్టినట్టు మేకర్స్ తెలిపారు. సంగీతం: థమన్.ఎస్.


దుబాయ్‌లో గామా వేడుక



గామా అవార్డ్స్ (గల్ఫ్ అకాడమీ మూవీ అవార్డ్స్) 2025, ఐదో ఎడిషన్ కర్టెన్‌రైజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి సినీ ప్రముఖులతో పాటు చాలా మంది తెలుగువారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు రఘు కుంచె ఈ వేడుకను నిర్వహించే జ్యూరీ కమిటీని, తేదీని, వేదిక వివరాలను ఆవిష్కరించారు. జూన్ 7న దుబాయ్‌లో ఈ ఐదో ఎడిషన్ వేడుక నిర్వహించనున్నారు. గామా అవార్డు జ్యూరీలో ముఖ్య సభ్యులైన దర్శకులు ఏ.కోదండ రామిరెడ్డి, బి.గోపాల్, సంగీత దర్శకులు కోటి.. వివిధ రంగాలకు చెందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తారు. ఈ కార్యక్రమంలో గామా అవార్డుల చైర్మన్ కేసరి త్రిమూర్తులు మాట్లాడుతూ "ఈ సారి జరిగే గామా వేడుక చాలా అట్టహాసంగా ఉండబోతోంది" అని అన్నారు.









స్పోర్ట్స్

గిల్ @1



దుబాయ్: ఇటీవల ఇంగ్లండ్‌తో సిరీస్‌లో అదరగొట్టిన టీమిండియా వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. బుధవారం ప్రకటించిన వన్డే తాజా ర్యాంకింగ్స్ బ్యాటింగ్ జాబితాలో గిల్.. బాబర్ ఆజమ్‌ను దాటేసి నెంబర్‌వన్ స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. రోహిత్ శర్మ (761) మూడో స్థానంలో, క్లాసెన్, డారిల్ మిచెల్ వరుసగా 4, 5 ర్యాంకుల్లో కొనసాగుతున్నారు. వన్డే బౌలర్లలో మహేష్ తీక్షణ (శ్రీలంక), రషీద్ ఖాన్ (అఫ్ఘానిస్థాన్) తొలి రెండుస్థానాల్లో, కుల్దీప్ యాదవ్ నాలుగో స్థానంలో ఉన్నారు.

లిఫ్టింగ్ రాడ్డే కబళించింది!



బికనేర్ (రాజస్థాన్): ఓ పవర్ లిఫ్టర్‌ను రోజూ ఆమె సాధన చేసే లిఫ్టింగ్ రాడ్డే కబళించింది. ఈ విషాద ఘటన రాజస్థాన్‌లోని బికనేర్‌లో జరిగింది. 17 ఏళ్ల పవర్ లిఫ్టర్ యాస్తికా ఆచార్య జూనియర్ జాతీయ క్రీడల్లో చాంపియన్. రోజులాగే..కోచ్ ఆధ్వర్యంలో ఆమె జిమ్‌లో మంగళవారం సాధన చేస్తోంది. 270 కేజీల బరువెత్తుతుండగా..రాడ్డు ఒక్కసారిగా స్లిప్పవడంతో యాస్తిక పడిపోయింది. ఈక్రమంలో రాడ్డు యాస్తిక మెడపై పడిపోయింది. అంత భారీ బరువుకు ఆమె మెడ విరిగిపోయింది. ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయిందని ధ్రువీకరించారు.

పారా అథ్లెటిక్స్‌లో దీప్తికి స్వర్ణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ పారా అథ్లెటిక్స్‌లో తెలంగాణ అమ్మాయి దీప్తి జీవాంజి స్వర్ణం సాధించింది. చెన్నైలో బుధవారం జరిగిన టి-20 కేటగిరీ 400 మీటర్ల పరుగులో దీప్తి 57.82 సెకన్లలో రేసును ముగించి పసిడితో మెరిసింది. టి-11 కేటగిరీ 100 మీటర్ల పరుగులో హైదరాబాద్‌కు చెందిన శిరీష (13.37 సెకన్లు) కాంస్యం దక్కించుకుంది. ఇక, ఇదే క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ పారా క్రీడాకారులు రెండో రోజు పోటీల్లోనూ ఆరు పతకాలు కొల్లగొట్టారు.

ఆరంభం అదరాలని!



- టీమిండియా కూర్పుపై ఉత్కంఠ
- షమి, రోహిత్, కోహ్లీపై దృష్టి
- బంగ్లాతో భారత్ పోరు నేడు

దుబాయ్: పేస్ గన్ బుమ్రా గైర్హాజరీలో టీమిండియా బౌలింగ్ పరిస్థితేంటి? స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, కోహ్లీ మళ్లీ మునుపటి మెరుపులు మెరిపిస్తారా? గిల్ మెగా టోర్నీ ఒత్తిడిని అధిగవిస్తాడా? ఇలా అభిమానుల మదిలోని ఎన్నో సందేహాలను భారత జట్టు ఒక్క మ్యాచ్‌తో పటాపంచలు చేయాలనుకొంటోంది. చాంపియన్స్ ట్రోఫీ (సీటీ) గ్రూప్-ఎలో గురువారం జరిగే తమ తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో టీమిండియా తలపడనుంది. ఈ మ్యాచ్‌లో రోహిత్ సేన బలంగా కనిపిస్తున్నా.. బంగ్లాను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. భారత జట్టు కూర్పుపై ఇప్పటికీ సందేహాలున్నాయి. అయితే, ఇంగ్లండ్‌పై టీ20, వన్డే సిరీస్‌లు నెగ్గి జోష్‌లో ఉన్న టీమిండియా ఆత్మవిశ్వాసంతో కనిపిస్తోంది. రోహిత్ చాలాకాలం తర్వాత సెంచరీతో కదం తొక్కగా.. కోహ్లీ కూడా ఫిఫ్టీతో టచ్‌లోకి రావడం శుభపరిణామం. కానీ, రాహుల్ బ్యాటింగ్ స్థానం ఇప్పటికీ సస్పెన్సే. సాధారణంగా రాహుల్ ఐదో నెంబర్‌లో బరిలోకి దిగుతాడు. అయితే, మ్యాచ్ పరిస్థితినిబట్టి అతడి బ్యాటింగ్ ఆర్డర్‌పై నిర్ణయం తీసుకోవాలని మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్టు సమాచారం.

అర్ష్‌దీప్ లేదా హర్షిత్?

గాయంతో బుమ్రా దూరం కావడంతో.. బౌలింగ్ విభాగం కూర్పు పెద్ద సవాల్‌గా మారింది. షమి పేస్ దళాన్ని నడిపించనుండగా.. అర్ష్‌దీప్ సింగ్ లేదా హర్షిత్ రాణాల్లో తుది జట్టులో ఎవరుంటారో ఖరారుకాలేదు. అయితే, డెత్ ఓవర్లలో సత్తాచాటగల అర్ష్‌దీప్‌ను ఆడించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. హార్దిక్ పాండ్యాతోపాటు ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగాలన్న వ్యూహంపై కూడా మేనేజ్‌మెంట్ కసరత్తులు చేస్తోంది. ఈ క్రమంలో జడేజా, అక్షర్ పటేల్‌తోపాటు మూడో స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్‌ను తీసుకొనే అవకాశం ఉంది. మరోవైపు షకీబల్, తమీమ్ లాంటి మేటి ఆటగాళ్లు లేకుండా బరిలోకి దిగుతున్న బంగ్లా ఒకింత బలహీనంగా కనిపిస్తోంది. కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ షంటో ఫామ్ కోల్పోవడం ఆందోళన కలిగిస్తున్నా.. మిడిలార్డర్‌లో మహ్మదుల్లా, ముష్ఫికర్ ఆదుకొంటున్నారు. అయితే, స్పిన్‌తో ప్రత్యర్థిని దెబ్బతీయాలని బంగ్లా భావిస్తోంది. పేసర్లు నహీద్ రాణా, టస్కిన్ భారత బ్యాటర్లను కట్టడిచేస్తే.. గెలుపు అవకాశాలు మెరుగుపడతాయి.



బంగ్లా కెప్టెన్ షంటో

ఉన్నది ఇద్దరు స్పిన్నర్లే: రోహిత్

ఇద్దరు స్పెషలిస్ట్ స్పిన్నర్లను మాత్రమే జట్టులోకి తీసుకొన్నాం. మిగతా ముగ్గురూ ఆల్‌రౌండర్లు. బ్యాటింగ్‌తోపాటు బౌలింగ్ చేసే వాళ్లైతే ఎక్కువ ప్రయోజనం అని భావించాం. అన్ని ఐసీసీ టోర్నీల్లాగానే సీటీ కూడా ఎంతో ప్రత్యేకమైనది. ఈ ట్రోఫీ నెగ్గాలంటే ఎక్కడా పొరబాట్లకు తావివ్వకూడదు.

- ఇరు జట్ల మధ్య జరిగిన చివరి ఐదు వన్డేల్లో భారత్ 2 నెగ్గగా.. బంగ్లా 3 మ్యాచ్‌లు గెలిచింది. ఓవరాల్‌గా భారత్, బంగ్లా 41సార్లు తలపడితే.. టీమిండియా 32.. బంగ్లా 8 మ్యాచ్‌ల్లో విజయం సాధించాయి. ఒక మ్యాచ్‌లో ఫలితం తేలలేదు.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ, గిల్, కోహ్లీ, శ్రేయాస్, రాహుల్ (వికెట్ కీపర్), హార్దిక్, అక్షర్, జడేజా, అర్ష్‌దీప్/హర్షిత్, షమి, కుల్దీప్.

బంగ్లాదేశ్: తన్జిద్ హసన్, సౌమ్య సర్కార్, నజ్ముల్ హొస్సేన్ షంటో (కెప్టెన్), తౌహిద్ హ్రిదయ్, ముష్ఫికర్ రహీమ్ (వికెట్ కీపర్), మహ్మదుల్లా, మెహిదీహసన్, రిషద్ హొస్సేన్, టస్కిన్, ముస్తాఫిజుర్, నహీద్ రాణా.

పిచ్/వాతావరణం

దుబాయ్‌లో గత రెండు రోజులుగా వర్షం కురుస్తుండడంతో వికెట్ బౌలర్లకు సహకరించే అవకాశం ఉంది. మ్యాచ్ కోసం తాజాగా సిద్ధం చేసిన వికెట్‌లను ఉపయోగిస్తారని సమాచారం. ఆకాశం మేఘావృతమై ఉన్నా.. వర్ష ఛాయలు తక్కువని వాతావరణ శాఖ తెలిపింది. మంచు ప్రభావం కారణంగా టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకొనే అవకాశం ఉంది.

దిగొచ్చిన పాక్.. స్టేడియంలో భారత జెండా



కరాచీ: చాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా స్టేడియంలో భారత జెండా ఎగరేయకపోవడంపై విమర్శలు రావడంతో పాకిస్థాన్ దిగొచ్చింది. తాజాగా కరాచీ స్టేడియంలో భారత పతాకాన్ని ప్రదర్శించింది. టోర్నీకి ఆతిథ్యమిస్తున్న పాక్.. రెండ్రోజుల క్రితం స్టేడియంలో భారత జెండా మినహా అన్ని దేశాల జట్ల జెండాలను ఏర్పాటుచేసింది. దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తమవడంతో.. రోహిత్ సేన తమ దేశంలో మ్యాచ్‌లు ఆడడం లేదు కాబట్టే ఆ దేశ జాతీయ పతకాన్ని ప్రదర్శించలేదని పాక్ క్రికెట్ బోర్డు వివరణ ఇచ్చుకున్న సంగతి తెలిసిందే.

పాక్ చిత్తుగా..

- శతక్కొట్టిన లాథమ్, యంగ్
- న్యూజిలాండ్ బోణీ ఘనం
- చాంపియన్స్ ట్రోఫీ



కరాచీ: చాంపియన్స్ ట్రోఫీని న్యూజిలాండ్ ఘనంగా ఆరంభించింది. బుధవారం జరిగినప్రారంభ మ్యాచ్‌లో కివీస్ 60 పరుగులతో డిఫెండింగ్ చాంప్ పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. గ్రూప్-ఎ మ్యాచ్‌లో తొలుత న్యూజిలాండ్ 50 ఓవర్లలో 320/5 స్కోరు చేసింది. లాథమ్ (118 నాటౌట్), యంగ్ (107) సెంచరీలతో చెలరేగగా.. ఫిలిప్స్ (61) మెరుపు బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. నసీమ్ షా, హారిస్ రౌఫ్ చెరో రెండు వికెట్లు తీశారు. ఛేదనలో పాకిస్థాన్ 47.2 ఓవర్లలో 260 పరుగులకు ఆలౌటైంది. ఖుష్‌దిల్ షా (69), బాబర్ ఆజమ్ (64) అర్ధ శతకాలు సాధించారు. సల్మాన్ ఆఘా (42) పర్లేదనిపించాడు. ఒరౌర్క్, శాంట్నర్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. లాథమ్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

రెండు సెంచరీ భాగస్వామ్యాలు: టాస్ కోల్పోయి మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ ఓ దశలో 40/2, ఆపై 17 ఓవర్లో 73/3తో నిలిచింది. కానీ యంగ్, లాథమ్ శతకాలతోపాటు, ఫిలిప్స్ దూకుడైన ఇన్నింగ్స్‌తో 300కు పైగా స్కోరు చేసింది. ఎనిమిదో ఓవర్లోనే అబ్రార్ అహ్మద్ క్యారమ్ బాల్‌తో కాన్వే (10)ను బౌల్డ్ చేశాడు. విలియమ్సన్ (1)ను నసీమ్ షా క్యాచవుట్ చేశాడు. మిచెల్ (10)ను రౌఫ్ అవుట్ చేయడంతో మూడో వికెట్ కోల్పోయిన కివీస్ ఇబ్బందుల్లో పడింది. అయితే..యంగ్, లాథమ్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 118 రన్స్ జోడించాడు. శతకం సాధించిన కాసేపటికే యంగ్‌ను నసీమ్ పెవిలియన్ చేర్చాడు. అనంతరం లాథమ్, ఫిలిప్స్ బౌలర్లను ఆడేసుకున్నారు. ఐదో వికెట్‌కు లాథమ్, ఫిలిప్స్ 74 బంతుల్లోనే 125 రన్స్ జోడించడం విశేషం. ఫిలిప్స్ ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో నిష్క్రమించాడు. అంతకుముందు చాంపియన్స్ ట్రోఫీ టోర్నీని పాకిస్థాన్ అధ్యక్షుడు అసిఫ్ జర్దారీ ప్రారంభించారు.

సంక్షిప్తస్కోర్లు: న్యూజిలాండ్: 50 ఓవర్లలో 320/5 (లాథమ్ 118 నాటౌట్, యంగ్ 107, ఫిలిప్స్ 61, నసీమ్ షా 2/63, రౌఫ్ 2/83); **పాకిస్థాన్:** 47.2 ఓవర్లలో 260 ఆలౌట్ (ఖుష్‌దిల్ షా 69, బాబర్ 64, సల్మాన్ ఆఘా 42, ఒరౌర్క్ 3/47, శాంట్నర్ 3/66, హెన్రీ 2/25).

చికిత బృందానికి కాంస్యం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆసియా ఆర్చరీ కప్ స్టేజ్-1లో తెలంగాణ అమ్మాయి చికిత రావు నేతృత్వంలోని భారత జట్టు కాంస్యం సాధించింది. బుధవారం బ్యాంకాక్‌లో జరిగిన మహిళల కాంపౌండ్ విభాగం కాంస్య పతక పోరులో ఇరాక్‌పై గెలిచి భారత జట్టు పతకం సొంతం చేసుకుంది.

ఢిల్లీ ఉత్కంఠ గెలుపు

యూపీకి నిరాశ ● డబ్ల్యూపీఎల్



లానింగ్ (69)

వడోదర: తీవ్ర ఒత్తిడిలో అనబెల్ సదర్లాండ్ (41 నాటౌట్), మరిజానె కాప్ (29 నాటౌట్) నాలుగో వికెట్‌కు అజేయంగా 48 పరుగులు జోడించడంతో.. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్ రెండో విజయాన్ని నమోదు చేసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 7 వికెట్లతో యూపీ వారియర్స్‌పై గెలిచింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన యూపీ 20 ఓవర్లలో 166/7 స్కోరు చేసింది. కిరణ్ నవగిరె (51), శ్వేత సెహ్రావత్ (37), హెన్రీ (33 నాటౌట్) పోరాటాలు వృథా అయ్యాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ సదర్లాండ్ 2 వికెట్లు పడగొట్టింది. ఛేదనలో ఢిల్లీ 19.5 ఓవర్లలో 3 వికెట్లకు 167 పరుగులు చేసి నెగ్గింది. కెప్టెన్ మెగ్ లానింగ్ (69), షఫాలీ (26) మొదటి వికెట్‌కు 65 పరుగుల భాగస్వామ్యంతో అదిరే ఆరంభాన్నిచ్చారు. ఆ తర్వాత షఫాలీ, జెమీమా(0) వెనుదిరిగినా.. లానింగ్‌తో కలసి సదర్లాండ్ మూడో వికెట్‌కు 49 భాగస్వామ్యంతో జట్టును గెలుపు బాటలో నిలిపింది. లానింగ్‌ను హ్యారిస్ అవుట్ చేయడంతో.. యూపీ మ్యాచ్‌లోకి వచ్చే ప్రయత్నం చేసింది. 32 బంతుల్లో 48 రన్స్ కావాల్సిన దశలో.. కాప్ సహకారంతో సదర్లాండ్ జట్టును గెలిపించింది. కాగా, డబ్ల్యూపీఎల్‌కు గురువారం విరామం.

సంక్షిప్త స్కోర్లు

యూపీ: 20 ఓవర్లలో 166/7 (నవగిరె 51, శ్వేత 37; సదర్లాండ్ 2/26).

ఢిల్లీ: 19.5 ఓవర్లలో 167/3 (మెగ్‌లానింగ్ 69, సదర్లాండ్ 41 నాటౌట్; ఎకెల్‌స్టోన్ 1/31, గ్రేస్ హ్యారిస్ 1/11).

రిజ్వాన్ సేనకు పెనాల్టీ

కరాచీ: చాంపియన్స్ ట్రోఫీ నిబంధనల ప్రకారం 50 ఓవర్లను మూడున్నర గంటల్లోగా పూర్తి చేయాలి. కానీ న్యూజిలాండ్‌తో పోరులో పాకిస్థాన్ 4 గంటలకు పైగా తీసుకుంది. దాంతో చివరి పవర్‌ప్లేలో పెనాల్టీగా.. 30 గజాల సర్కిల్ వెలుపల ఐదుగురికి బదులు నలుగురు ఫీల్డర్లనే పాకిస్థాన్ మోహరించాల్సి వచ్చింది. ఈ పెనాల్టీకి తోడు..స్లో ఓవర్ రేట్ కారణంగా రిజ్వాన్ సేన జట్టులోని ఆటగాళ్లందరి మ్యాచ్ ఫీజులో ఐదు శాతం కోత విధించే అవకాశముంది.

భారత ఫార్మాకు ట్రంప్ సుంకాల ముప్పు





అమెరికాలోకి దిగుమతయ్యే ఔషధాలపై కనీసం 25% టారిఫ్

» మన జనరిక్ ఔషధ సంస్థలకు అమెరికానే అతిపెద్ద మార్కెట్

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో బాంబు పేల్చారు. యూఎస్‌లోకి దిగుమతయ్యే ఔషధాలు, సెమీకండక్టర్లపై 25 శాతం లేదా అంతకంటే అధిక సుంకం విధిస్తానని, ఆపై సుంకాన్ని మరింత పెంచుకుంటూ పోతానని హెచ్చరించారు. అదే గనక జరిగితే, భారత ఫార్మాస్యూటికల్స్ రంగం, ప్రధానంగా హైదరాబాద్‌కు చెందిన ఔషధ కంపెనీలపై అధిక ప్రభావం పడనుంది. దేశీయ ఫార్మా సంస్థల జనరిక్ ఔషధాలకు అమెరికా అతిపెద్ద మార్కెట్ కావడమే అందుకు కారణం.. ఫార్మా ఎగుమతుల ప్రోత్సాహక కౌన్సిల్ (ఫార్మెక్సిల్) లెక్కల ప్రకారం..2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత ఫార్మా కంపెనీలు అమెరికాకు 870 కోట్ల డాలర్ల (ప్రస్తుత మారకం విలువ ప్రకారం రూ.75,690 కోట్లు) ఔషధాలను ఎగుమతి చేశాయి. ఫార్మా ఎగుమతుల్లో అమెరికా వాటాయే 31 శాతంగా ఉంది.

అమెరికా వినియోగదారులకే నష్టం: ఫార్మెక్సిల్

అమెరికా చర్య ఆ దేశ వినియోగదారులకే నష్టమని ఫార్మెక్సిల్ అభిప్రాయపడింది. "అమెరికా టారిఫ్‌లతో తక్షణ ప్రభావమేమీ ఉండదు. ఒకవేళ సుంకం విధిస్తే, దిగుమతుల భారం పెరగడం వల్ల అమెరికా వినియోగదారులకే నష్టం. ప్రస్తుతం ఇండస్ట్రీ ఈ విషయంలో వేచి చూసే ధోరణిలో ఉంది. సాధారణంగా మన కంపెనీలు అత్యంత ఖరీదైన పేటెంట్ డ్రగ్స్‌కు జనరిక్ వెర్షన్లను యూఎస్‌కు సరఫరా చేస్తుంటాయి" అని ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ రాజ భాను అన్నారు. ప్రముఖ రీసెర్చ్ కంపెనీ ఐక్యూవీఐఏ ప్రకారం.. 2022లో అమెరికాలో డాక్టర్లు పేషెంట్లకు రాసిచ్చిన జనరిక్ ఔషధాల్లో దాదాపు సగం భారత కంపెనీలు సరఫరా చేసినవే. తద్వారా యూఎస్ హెల్త్‌కేర్ సిస్టమ్ ఆ ఏడాదిలో 21,900 కోట్ల డాలర్లు (రూ.19.05 లక్షల కోట్లు) ఆదా చేయగలిగిందని భాను అన్నారు. 2013-22 మధ్యకాలంలో ఏకంగా 1.3 లక్షల కోట్ల డాలర్లు (రూ.113 లక్షల కోట్లు) ఆదా జరిగిందన్నారు. వచ్చే ఐదేళ్లలో అమెరికా మరో 1.3 లక్షల కోట్ల డాలర్లు ఆదా చేసుకోగలిగే అవకాశం ఉందన్నారు.

ప్రస్తుత సుంకం సున్నా

అమెరికా ప్రస్తుతం భారత్ నుంచి దిగుమతి చేసుకునే ఔషధాలపై ఎలాంటి సుంకం విధించడం లేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2,900 కోట్ల డాలర్ల విలువైన ఔషధాలను అమెరికా సహా ఇతర దేశాలకు ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాజ భాను తెలిపారు. ఆర్థిక సంవత్సరంలో గడిచిన 10 నెలల్లో (ఏప్రిల్-జనవరి) ఫార్మా ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 7.84 శాతం వృద్ధితో 2,430 కోట్ల డాలర్లకు చేరుకున్నాయన్నారు.

అమెరికా ఎగుమతి చేస్తున్న ఔషధ కంపెనీలు..

సన్ ఫార్మా: దేశంలో అతిపెద్ద ఔషధ కంపెనీ సన్ ఫార్మాస్యూటికల్‌కు 2023-24 ఆర్థిక సంవత్సర ఆదాయంలో 32 శాతం అమెరికా మార్కెట్ నుంచే సమకూరింది. మన ఔషధాలపై ట్రంప్ అదనపు సుంకాలు విధిస్తే, ఆ భారాన్ని వినియోగదారుల పైకి బదిలీ చేయకతప్పదని కంపెనీ ఎండీ దిలీప్ సంఘ్వీ అన్నారు. సన్ ఫార్మా 100 దేశాలకు ఔషధాలను ఎగమతి చేస్తోంది. కంపెనీ వార్షికాదాయంలో ఎగుమతుల వాటాయే 72.7 శాతంగా ఉంది.

ఒత్తిడిలో ఫార్మా షేర్లు

ట్రంప్ సుంకాల హెచ్చరికతో భారత ఫార్మా రంగ కంపెనీల షేర్లు ఒత్తిడికి లోనయ్యాయి. డాక్టర్ రెడ్డీస్ స్టాక్ 2.63 శాతం క్షీణించగా.. జైడస్ లైఫ్ సైన్సెస్ 2.47 శాతం, అరబిందో ఫార్మా 2.41 శాతం, లుపిన్ 1.75 శాతం, సన్ ఫార్మా 1.46 శాతం, సిప్లా 1.21 శాతం, గ్లెన్‌మార్క్ 0.71 శాతం నష్టపోయాయి. నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ 0.71 శాతం తగ్గింది.

డాక్టర్ రెడ్డీస్: హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రెడ్డీస్‌కు ఉత్తర అమెరికానే అతిపెద్ద మార్కెట్. 2023-24 ఆర్థిక సంవత్సర అమ్మకాల్లో ఈ మార్కెట్ వాటాయే 47 శాతంగా ఉంది. కంపెనీ ఈ మార్కెట్‌కు అధికంగా ఆంకాలజీ, ఇమ్యూనాలజీ థెరపీలకు సంబంధించిన జనరిక్ ఔషధాలను సరఫరా చేస్తుంది. 2022-23తో పోలిస్తే వీటి విక్రయాలు 28 శాతం పెరిగాయి.

అరబిందో ఫార్మా: హైదరాబాద్‌కు చెందిన అరబిందో ఫార్మాకు గత ఆర్థిక సంవత్సరంలో అమెరికా మార్కెట్ నుంచి ఆదాయం వార్షిక ప్రాతిపదికన 24 శాతం వృద్ధితో రూ.13,867 కోట్లకు పెరిగింది. కంపెనీ మొత్తం రెవెన్యూలో ఈ మార్కెట్ వాటాయే 48 శాతంగా ఉంది. అంతేకాదు, కంపెనీకిదే అతిపెద్ద మార్కెట్ కూడా.

నాట్కో ఫార్మా: గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మొత్తం ఆదాయంలో 78 శాతం అంతర్జాతీయ వ్యాపారం ద్వారానే సమకూరింది. సంస్థకు అతిపెద్ద ఎగుమతి మార్కెట్లలో అమెరికా ఒకటి. ఈ దేశానికి కంపెనీ కేన్సర్ సహా పలు జనరిక్ ఔషధాలను ఎగమతి చేస్తోంది.

దివీస్ లేబరేటరీస్: గత ఆర్థిక సంవత్సరానికి అమెరికా మార్కెట్లో దివీస్ అమ్మకాలు రూ.1,310 కోట్లుగా నమోదయ్యాయి. కంపెనీ మొత్తం ఆదాయంలో ఈ వాటా 17.1 శాతంగా ఉంది. సంస్థకు యూరప్ తర్వాత అతిపెద్ద మార్కెట్ అమెరికాయే.

సిప్లా: గత ఆర్థిక సంవత్సరంలో సిప్లా ఆదాయంలో 30 శాతం ఉత్తర అమెరికా మార్కెట్ నుంచే సమకూరింది. కంపెనీకిది రెండో అతిపెద్ద మార్కెట్ కూడా. అమ్మకాలపరంగా అమెరికాలోని టాప్-15 ఔషధ కంపెనీల్లో సిప్లా ఒకటి.

బయోకాన్: 2023-24 ఆర్థిక సంవత్సరానికి బయోకాన్ ఆదాయంలో 44 శాతం అమెరికా మార్కెట్ నుంచే లభించింది. కంపెనీకిదే అతిపెద్ద మార్కెట్. ఈ కంపెనీ యూఎస్‌కు అధికంగా కీళ్లవాతం, కేన్సర్ చికిత్సలో ఉపయోగించే సంక్లిష్ట బయోలాజిక్స్‌కు కాపీ అయిన బయోసిమిలర్స్‌ను ఎగమతి చేస్తుంటుంది. ఐక్యూవీఐఏ ప్రకారం.. 2022లో అమెరికాలో అమ్ముడైన బయోసిమిలర్స్‌లో 15 శాతం భారత కంపెనీలు సరఫరా చేసినవే.

లుపిన్: 2022-23 ఆర్థిక సంవత్సరానికి లుపిన్ మొత్తం విక్రయాల్లో ఉత్తర అమెరికా మార్కెట్ వాటా 30 శాతంగా ఉండగా.. 2023-24లో 37 శాతానికి పెరిగింది. కంపెనీకి చెందిన యాంటీ రెట్రోవైరల్ తోపాటు శ్వాసకోస సమస్యలకు సంబంధించిన జనరిక్ ఔషధాలకు పెరిగిన డిమాండ్ పెరగడం ఇందుకు తోడ్పడింది.

గ్లెన్‌మార్క్ ఫార్మా: కంపెనీకి ఉత్తర అమెరికా రెండో అతిపెద్ద మార్కెట్. 2023-24లో సంస్థ ఆదాయంలో 26 శాతం ఈ మార్కెట్ నుంచే లభించింది.

జైడస్: అమెరికాకు జైడస్ 200కు పైగా జనరిక్ ఔషధాలను ఎగుమతి చేస్తోంది. కంపెనీకిదే అతిపెద్ద మార్కెట్ కూడా. గత ఆర్థిక సంవత్సర ఆదాయంలో 46 శాతం ఈ మార్కెట్ నుంచే సమకూరింది.

అదానీలపై దర్యాప్తులో సాయం చేయండి

భారత్‌కు ఎస్ఈసీ అభ్యర్థన

న్యూయార్క్: అదానీ గ్రూప్ ప్రధాన ప్రమోటర్లు గౌతం అదానీ, సాగర్ అదానీలపై వచ్చిన అవినీతి ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోందని, దర్యాప్తులో భారత ప్రభుత్వ అధికారుల సహాయం అభ్యర్థించామని అమెరికన్ స్టాక్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) న్యూయార్క్‌లోని ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ కోర్టు న్యాయమూర్తి నికోలస్ గరాఫిస్‌కు తెలిపింది. భారత్‌లో ఉంటున్న వీరిద్దరికి ఆరోపణల అభియోగ పత్రాన్ని అందజేసేందుకు చర్యలు చేపట్టినట్టు పేర్కొంది. దీంతో ఈ కేసులో అదానీలపై దర్యాప్తును తాత్కాలికంగా నిలిపి వేస్తూ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇటీవల తీసుకున్న నిర్ణయం అమలవుతుందా, లేదా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. సోలార్ విద్యుత్ ప్రాజెక్టుల కాంట్రాక్టుల కోసం అదానీ గ్రూప్ ప్రభుత్వ అధికారులు, రాజకీయ నేతలకు 26.5 కోట్ల డాలర్ల (సుమారు రూ.2,292 కోట్లు) ముడుపులు ముట్టచెప్పిందని గత ఏడాది బైడెన్ నాయకత్వంలోని అమెరికా ప్రభుత్వం ఆరోపించి, దర్యాప్తునకు ఆదేశించింది. ఈ విషయాన్ని కప్పిపెట్టి 2021లో అదానీ గ్రూప్ అమెరికా మార్కెట్‌లో రుణ పత్రాలు జారీ చేసి నిధులు సేకరించిందని ఆరోపణ.

షేర్లు ఢమాల్ : ఈ వార్తలతో అదానీ గ్రూపు కంపెనీల షేర్లు మళ్లీ బేర్ పట్టులోకి పోయాయి. 11 లిస్టెడ్ కంపెనీల్లో తొమ్మిది కంపెనీల షేర్లు బుధవారం నాలుగు శాతం వరకు నష్టపోయాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ 3.75 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 1.78 శాతం, అంబుజా సిమెంట్స్, సంఘీ ఇండస్ట్రీస్ 1.36 శాతం చొప్పున, ఏసీసీ 0.93 శాతం, అదానీ విల్‌మార్ 0.9 శాతం నష్టపోయాయి.



హోండా హార్నెట్ 2.0

న్యూఢిల్లీ: హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) సరికొత్త హార్నెట్ 2.0 బైక్‌ను మార్కెట్లోకి తెచ్చింది. మెరుగైన భద్రతా ఫీచర్లతో మరింత స్టైల్‌గా ఉండే ఈ బైక్ ఎక్స్ షోరూమ్ ధర రూ.1,56,953. దేశవ్యాప్తంగా హెచ్ఎంఎస్ఐ రెడ్ వింగ్, బిగ్ వింగ్ డీలర్‌షిప్‌లన్నింటి వద్ద ఇది అందుబాటులో ఉంటుంది.

రూ.500 చొప్పున నవ షేర్ల బైబ్యాక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్థానిక నవ లిమిటెడ్ కంపెనీ షేర్ల బైబ్యాక్ ప్రకటించింది. రూపాయి ముఖ విలువ ఉన్న 72 లక్షల షేర్లను ఒక్కోటి రూ.500 చొప్పున బైబ్యాక్ చేసేందుకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. బుధవారం నాటి ముగింపు ధరతో పోలిస్తే ఇది 32 శాతం ఎక్కువ. ఈ నెల 28వ తేదీ నాటికి కంపెనీ రికార్డుల్లో పేర్లున్న వాటాదారులందరికీ ఈ ఆఫర్ వర్తిస్తుంది. కంపెనీ ప్రమోటర్లుగానీ, వారి నిర్వహణలోని కంపెనీలు గానీ ఈ బైబ్యాక్‌లో పాల్గొనవు. ఈ వార్తలతో బీఎస్ఈలో నవ కంపెనీ షేర్లు 11.61 శాతం లాభంతో రూ.422.45 వద్ద ముగిశాయి.

బిజినెస్


డిపాజిట్ ఇన్సూరెన్స్ రూ.8-12 లక్షలకు పెంపు!?

న్యూఢిల్లీ: బ్యాంక్ డిపాజిట్‌దారులకు మరింత రక్షణ లభించనుంది. బ్యాంక్‌ల్లో జమ చేసే సొమ్ముపై ప్రస్తుతం రూ.5 లక్షల వరకు బీమా కవరేజీ లభిస్తుండగా.. కేంద్ర ప్రభుత్వం ఈ పరిమితిని రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు పెంచే అవకాశాలున్నాయి. ఇందుకు సంబంధించి ఈ నెలాఖరులోగా అధికారిక ప్రకటన వెలువడవచ్చని విశ్వసనీయవరాల సమాచారం. బ్యాంక్‌ల్లో, ముఖ్యంగా కో-ఆపరేటివ్ బ్యాంక్‌ల్లో అంతర్గత మోసాలు వెలుగు చూస్తుండటం.. తత్ఫలితంగా ఆ బ్యాంక్‌లు ఆర్థికంగా దివాలా తీస్తున్న కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

ముంబై: స్టాక్ మార్కెట్‌కు బుధవారం నాడు కూడా ఫ్లాట్‌గానే ముగిసింది. సెన్సెక్స్ 28.21 పాయింట్ల నష్టంతో 75,939.18 వద్ద, నిఫ్టీ 12.40 పాయిట్ల నష్టంతో 22,932.90 వద్ద ముగిశాయి. ఐటీ దిగ్గజాలు టీసీఎస్, ఇన్ఫోసిస్ కంపెనీల షేర్లు రెండు శాతానికిపైగా నష్ట పోవడం సూచీలను దెబ్బతీసింది. హెచ్‌యూఎల్, భారతీ ఎయిర్‌టెల్, సన్ ఫార్మా, పవర్‌గ్రిడ్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌సీఎల్ టెక్, ఎం అండ్ ఎం, టెక్ మహీంద్ర వంటి కంపెనీల షేర్లకూ బుధవారం నష్టాలు తప్పలేదు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



20వ తేదీ			
హైదరాబాద్	415	విజయవాడ	430
వరంగల్	417	గోదావరి	420
చిత్తూరు	493	విశాఖపట్నం	437
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	80	విజయవాడ	91
వరంగల్	80	గుంటూరు	80
కరీంనగర్	80	ఒంగోలు	80
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	85
కర్నూలు	80	నెల్లూరు	90
విశాఖపట్నం	83	అనంతపురం	90
గోదావరి	91		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,650 ▲	80,350 ▲	1,08,000 ▲
విజయవాడ	89,000 ▲	83,500 ▲	98,500 ▲
విశాఖపట్నం	86,410 ▲	79,210 ▲	97,570 ▲
రాజమండ్రి	87,650 ▲	80,350 ▲	99,800 ▲
ప్రొద్దుటూరు	88,750 ▲	82,180 ▲	98,500 ▲
ముంబై	86,730 ▲	79,450 ▲	97,570 ▲



మంత్రి దామోదరతో రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు

వైద్యుల సమస్యలు పరిష్కరించండి

» మంత్రికి వైద్యుల సంఘం వినతి

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య సంచాలకుల పరిధిలోని వైద్యులకు పదోన్నతులు కల్పించాలని, రాష్ట్ర వైద్య విధాన పరిషత్‌ను సెకండరీ గ్రేడ్ హెల్త్ సర్వీసెస్‌గా మార్చాలని ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం కోరింది. ఈ మేరకు బుధవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సంఘం ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పలు సమస్యలను వారు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. జీవో నంబరు 142లోని లోపాలను వెంటనే సరిదిద్దాలని కోరారు. అదే విధంగా ప్రతీ జిల్లాకు డీఎంహెచ్‌వో పోస్టును మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అయా విభాగాల పరిధిలో పోస్టుల సంఖ్యను పెంచాలని, దంత వైద్యులను ప్రజారోగ్య విభాగంలో కొనసాగించాలని విన్నవించారు. వైద్యుల సంఘం ప్రతినిధుల విజ్ఞప్తులపై మంత్రి సానుకూలంగా స్పందించారు. వారి సమస్యల పరిష్కారంపై నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు డాక్టర్ నరహరి, కోశాధికారి డాక్టర్ రవూఫ్‌తో పాటు పలువురు వైద్యులు ఉన్నారు.

దేశవ్యాప్తంగా కులగణన అసాధ్యం: ఈటల



వరంగల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేశవ్యాప్తంగా కులగణన సాధ్యం కాదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఒక కులం ఒక రాష్ట్రంలో ఒక క్యాటగిరీలో ఉంటే.. మరికొన్ని రాష్ట్రాల్లో వేరే క్యాటగిరీలో ఉంటుందని తెలిపారు. బుధవారం వరంగల్‌లో ఈటల మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని డిమాండ్ చేయడం రాహుల్ గాంధీ అవగాహన లేమి అని విమర్శించారు. తెలంగాణలో కులగణన చేశామని గొప్పలు చెబుతున్నారని, గత ప్రభుత్వం చేసిన కుల గణనలో బీసీలు 52శాతం ఉంటే, ఇప్పుడు 46శాతానికి ఎలా తగ్గారని ప్రశ్నించారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే రైతులకు పరిహారం కోసం ఆయా జిల్లాల కలెక్టర్లతో కమిటీలు వేసి ధరలు నిర్ణయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'ఆంధ్రజ్యోతి' రాసింది వాస్తవమే..

ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఈటల స్పందించారు. 'యథా రాజ.. తథా ప్రజ' అని.. సీఎం ఎలా ఉంటే ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు అలాగే ఉంటారని అన్నారు. చంద్రబాబు, వైఎస్ఆర్, కిరణ్ కుమార్‌రెడ్డి, రోశయ్య, కేసీఆర్ లాంటి వాళ్ల వద్ద పని చేసినప్పుడు ఏసీల్లో ఉండని అధికారులు.. రేవంత్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడే ఏసీలకు ఎందుకు పరిమితం అవుతున్నారో అర్థం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన అయ్యో.. ఎస్ కథనంపై ఈటల స్పందించారు. ఒక ఐఏఎస్ పని చేయకుంటే.. ఆయన స్థానంలో మరో ఐఏఎస్‌ను తెచ్చుకునికావాల్సిన పనులు చేయించుకుంటున్నారని అన్నారు.

బార్ కౌన్సిల్ పదవీకాలం ముగిసినా ఎలా కొనసాగుతారు?: హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బార్ కౌన్సిల్ పదవీకాలం చాలాకాలం క్రితమే ముగిసిపోయినా బార్ కౌన్సిల్ కార్యవర్గం సభ్యులు ఎలా పదవుల్లో కొనసాగుతారని హైకోర్టు ప్రశ్నించింది. బార్ కౌన్సిల్‌కు ఎప్పుడు ఎన్నికలు నిర్వహిస్తారని తెలంగాణ బార్ కౌన్సిల్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ)ని ప్రశ్నించింది. బార్ కౌన్సిల్ గడువు ముగిసినా ఎన్నికలు నిర్వహించడం లేదని పేర్కొంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం.. బార్ కౌన్సిల్ ఎన్నిక షెడ్యూల్ సమర్పించాలని ఆదేశాలు జారీచేసింది. ఈ ఆదేశాలు అమలుకాకపోవడంతో కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలైంది. దీనిపై బుధవారం విచారణ చేపట్టిన ధర్మాసనం.. బార్ కౌన్సిల్ సభ్యులు తమ పదవీకాలం పూర్తయినప్పటికీ ఫిర్యాదులు వచ్చిన అడ్వొకేట్లపై చర్యలు తీసుకుంటున్నారని.. అలా ఎలా చేస్తారని ప్రశ్నించింది. వచ్చే వాయిదాకు ప్రస్తుత అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి సైతం హాజరై ఎన్నికల నిర్వహణపై వివరణ ఇవ్వాలని ధర్మాసనం పేర్కొంది. అలాగే ప్రస్తుత కార్యవర్గాన్ని తప్పించి ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణకు ఆదేశిస్తామని వ్యాఖ్యానించింది. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తరఫున న్యాయవాది సమయం కోరడంతో కౌంటర్ దాఖలు చేయాలంటూ విచారణను ఈ నెల 25కు వాయిదా వేసింది.

సమ్మెకి దిగితే ఆర్టిజన్లపై వేటే: జెన్‌కో

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : సమ్మెకి దిగే ఆర్టిజన్లను తక్షణమే ఉద్యోగాల నుంచి తొలగించాలని తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ(జెన్‌కో) ఆదేశాలు జారీ చేసింది. సమ్మెకి దిగే ఆర్టిజన్లను గుర్తించి వారిని స్టాండింగ్ ఆర్డర్లలోని 37(2) రూల్ ప్రకారం ఉద్యోగాల నుంచి తొలగించాలని కోరింది. ఈమేరకు జెన్‌కో డైరెక్టర్ ఎ.అజయ్ బుధవారం రాష్ట్రంలోని అన్ని విద్యుదుత్పత్తి కేంద్రాలతో పాటు కార్పొరేట్ కార్యాలయం ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం ఆర్టిజన్లు గురువారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధను ముట్టడించాలని నిర్ణయం తీసుకోవడంపై అప్రమత్తమైన జెన్‌కో ఈమేరకు చర్యలకు ఉపక్రమించింది.

అక్రమంగా అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్

» ఎమ్మెల్సీ కవిత మరిదిపై సంగారెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత భర్త అనిల్‌కుమార్ తమ్ముడు అరుణ్‌కుమార్ గత ప్రభుత్వ హయాంలో అసైన్డ్ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని సంగారెడ్డి కలెక్టర్‌కు బుధవారం ఫిర్యాదు అందింది. సంగారెడ్డి జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, పటాన్‌చెరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి కలెక్టరేట్‌లో ఈ ఫిర్యాదు చేశారు. పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామం సర్వే నంబర్ 213/2లోని బీసీలకు చెందిన సుమారు రూ.60 కోట్ల విలువైన ఐదెకరాల అసైన్డ్ భూమిని అరుణ్ కుమార్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. రాత్రికి రాత్రే నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించి పట్టా భూములుగా మార్చారని పేర్కొన్నారు.

25 నుంచి ఈఏపీసెట్ దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఇంజినీరింగ్, అగ్రికల్చర్, వెటర్నరీ, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఈఏపీసెట్ ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్ గురువారం విడుదల కానుంది. ఈ నెల 25 మధ్యాహ్నం 2.30 గంటల నుంచి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఈఏపీసెట్ కన్వీనర్, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ బి.డీన్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విజయవాడ రూట్‌లో 8-10 % రాయితీ: ఆర్టీసీ

తెలంగాణ ఆర్టీసీ ప్రయాణికులకు విజయవాడ రూట్‌లో 8-10% రాయితీ ప్రకటించింది. హైదరాబాద్-విజయవాడ రూట్‌లో ప్రయాణించే వారిని తెలంగాణ ఆర్టీసీవైపు ఆకర్షించేందుకు అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ రూట్‌లో నడిచే లహరి నాన్ ఏసీ, సూపర్ లగ్జరీ బస్సుల్లో 10%, రాజధాని ఏసీ బస్సు చార్జీల్లో 8% రాయితీ వర్తిస్తుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. బడ్జెట్ ఫ్రెండ్లీగా ప్రయాణం చేసేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. కాగా తెలంగాణ ఆర్టీసీ ఇటీవలే హైదరాబాద్-బెంగళూరు రూట్‌లో అన్ని బస్సులకు 10% రాయితీ ప్రకటించింది.

కేసీఆర్ పగటి కలలు కంటున్నారు



» 14 నెలలుగా అజ్ఞాతంలో ఉన్న వ్యక్తికి అభివృద్ధి ఎలా కనిపిస్తుంది?: పొంగులేటి

» ఎవరి గ్రాఫ్ పడిపోయిందో ప్రజలకు తెలుసు: జూపల్లి

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉట్టికి ఎగరలేనమ్మ స్వర్గానికి ఎగిరిందన్నట్లు ఫాంహౌస్ దాటని కేసీఆర్... అధికారంపై పగటి కలలు కంటున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అధికారం కోల్పోగానే తనకు పదేళ్ల అధికారం కట్టబెట్టిన ప్రజలను మరిచి అజ్ఞాతంలోకి వెళ్లిన కేసీఆర్‌కు 14 నెలలుగా కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న అభివృద్ధి ఎలా కనిపిస్తుందని బుధవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కేసీఆర్ సీజనల్ రాజకీయ నాయకుడని, ఎన్నికల సమయంలోనే ఆయనకు ప్రజలు గుర్తుకొస్తారని దుయ్యబట్టారు. ఇప్పుడు స్థానిక ఎన్నికలు వస్తున్నందునే ప్రజల్లోకి వచ్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ భవిష్యత్తు గురించి చెప్పే కేసీఆర్... ముందు ఆయన భవిష్యత్తు, తన పార్టీ భవిష్యత్తు గురించి ఆలోచిస్తే బాగుంటుందని ఎద్దేవా చేశారు. పదేళ్లలో కేసీఆర్ చేసిన అప్పులకు తెలంగాణ సమాజం ఎప్పటికీ ఆయన్ను క్షమించదన్నారు. రాష్ట్రంలో ఎవరి గ్రాఫ్ పడిపోయిందో ప్రజలకు తెలుసునని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టడంతో ఇన్నాళ్లూ కేసీఆర్ మొహం చాటేశారన్నారు. ఇన్ని నెలల తర్వాత తెలంగాణ ప్రజలు ఆయనకు గుర్తుకు వచ్చారన్నారు. మునిగి పోతున్న బీఆర్ఎస్ నావను కాపాడుకునేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రతిపక్ష ఎమ్మెల్యేలను చేర్చుకున్నప్పుడు రాని ఉప ఎన్నికలు ఇప్పుడు ఎందుకు వస్తాయని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపుల గురించి మాట్లాడే నైతికత కేసీఆర్‌కు లేదన్నారు. కేసీఆర్‌కు 15 నెలల తర్వాత ప్రజలు గుర్తుకు వచ్చారా? అని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ ప్రశ్నించారు.

పాతాళంలోకి కాంగ్రెస్ గ్రాఫ్

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పాలన పూర్తిగా విఫలమైందని, ప్రజలకోసం పోరాటాలు చేయాల్సిన అవసరం ఏర్పడిందని పేర్కొన్నారు. గత గాయాల నుంచి కోలుకున్న తెలంగాణను మళ్లీ అదే స్థితికి తీసుకు వెళ్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. రాష్ట్రాన్ని మరోసారి దోపిడీ, వలసదారుల బారిన పడకుండా కాపాడుకోవాలని.. ఈ 25ఏళ్ల స్ఫూర్తితో కార్యకర్తలు మరో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలపై బీఆర్ఎస్ శ్రేణులు ముందుండి పోరాడాలని సూచించిన కేసీఆర్.. ప్రజల పక్షాన పోరాడాల్సిన బాధ్యతను కమ్యూనిస్టులు విస్మరిస్తున్నారని విమర్శించారు. వారు కాంగ్రెస్‌కు తొత్తులుగా మారిపోయారని ఆరోపించారు. ఎన్టీఆర్ హయాంలో టీడీపీ ఓటమి.. ఆ తర్వాత ప్రజల మద్దతుతో మళ్లీ ఆ పార్టీ అధికారం చేపట్టడం వంటి అంశాలను కేసీఆర్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. టీడీపీ ప్రస్థానం, కష్టనష్టాలు, ప్రజల మద్దతు పొందేందుకు పార్టీ కార్యకర్తలను ఎన్టీఆర్ ప్రోత్సహించిన తీరును బీఆర్ఎస్ శ్రేణులకు వివరించారు.

సొంత నేతలే..

ఎంపీ ఎన్నికల్లో ఓటమి చెందగానే పార్టీ పనైపోయిందని బీఆర్ఎస్ నేతలే ప్రచారం చేశారని.. అందుకే 10 మంది ఎమ్మెల్యేలు నైరాశ్యంతో పార్టీ మారారని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి ప్రచారాలు చేయడం సరైంది కాదని మండిపడ్డారు. బీఆర్ఎస్.. ఒక్కసారి ఓటమితో పడిపోయే పార్టీ కాదని, ప్రజల్లోకి వెళ్లి తిరిగి నిలబడగలుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికీ మించి పోయిందేమీలేదని.. స్థానిక ఎన్నికల్లో పార్టీ కోసం అంతా కష్టపడాలని సూచించారు. పార్టీ ఫిరాయించిన 10మంది ఎమ్మెల్యేలపై వేటు పడటం ఖాయమని.. ఈ అంశంపై తానే న్యాయవాదులతో మాట్లాడానని.. త్వరలోనే ఉప ఎన్నికలు కచ్చితంగా వస్తాయని అన్నారు. బీఆర్ఎస్ సిల్వర్‌జూబ్లీ వేడుకలను ఏడాది పొడవునా ఘనంగా నిర్వహించాలని కేసీఆర్ ఆదేశించారు. ఏప్రిల్ 10న పార్టీ ప్రతినిధుల సభ ఉంటుందని తెలిపిన ఆయన.. అదే నెల 27న భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 10 నుంచి 27 వరకూ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని, ప్రతి జిల్లా కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. బహిరంగ సభ తర్వాత పార్టీ సంస్థాగత కమిటీలను వేయాలని నిర్ణయించిన కేసీఆర్.. ఆ కమిటీల ఎంపికకు ఇన్‌చార్జిగా మాజీమంత్రి హరీశ్‌రావుకు బాధ్యతలు అప్పగించారు. అలాగే బీఆర్ఎస్ అనుబంధ సంఘాల పటిష్ఠతకు సీనియర్ నేతలతో కమిటీలు వేయనున్నట్లు ప్రకటించారు. అక్టోబర్‌లో పార్టీ అధ్యక్ష పదవికి ఎన్నికలు ఉంటాయని కేసీఆర్ ప్రకటించారు.



బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో కేసీఆర్, కేటీఆర్

మహిళలకు పెద్దపీట..

బీఆర్ఎస్ సంస్థాగత నిర్మాణంలో భాగంగా అన్ని రకాల కమిటీలతోపాటు మహిళా కమిటీలను కూడా ఏర్పాటు చేస్తామని కేసీఆర్ తెలిపారు. డీలిమిటేషన్‌తో అసెంబ్లీ స్థానాలు 160వరకు పెరిగే అవకాశం ఉందని.. అలా పెరిగితే మహిళలకు 53 సీట్లు కేటాయిస్తామని వెల్లడించారు.

ఒర్లకండిరా బాబూ.. దండం పెడుతా!

దాదాపు ఏడునెలల తర్వాత కేసీఆర్ తెలంగాణభవన్‌కు రావడంతో అక్కడంతా కోలాహల వాతావరణం నెలకొంది. కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆయన్ను చుట్టుముట్టి సీఎం.. సీఎం అంటూ నినాదాలు చేశారు. దీంతో ఆయన ఒకింత అసహనానికి లోనయ్యారు. "ఒర్లకండిరా బాబూ.. మీకు దండం పెడతా" అని వ్యాఖ్యానించారు.

సికింద్రాబాద్ పాస్‌పోర్టు కార్యాలయానికి కేసీఆర్

రెజిమెంటల్‌బజార్: మాజీ సీఎం, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, భార్య శోభతో కలసి పాస్‌పోర్టు రెన్యూవల్ కోసం బుధవారం సికింద్రాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయానికి వచ్చారు. కేసీఆర్ దంపతులను ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి స్నేహజ వారి వాహనం వద్దకు వెళ్లి ఆహ్వానించారు. అరగంటపాటు పాస్‌పోర్టు రెన్యూవల్ ప్రక్రియ పూర్తి చేసుకుని కేసీఆర్ తిరిగి వెళ్లిపోయారు.

ఎవర్నీ వదిలిపెట్టం

సిరిసిల్లలో టీ స్టాల్ వ్యాపారి పట్ల కలెక్టర్ అనుచిత వైఖరి ప్రదర్శించారని కేటీఆర్ ఎక్స్‌లో మండిపడ్డారు. టీ స్టాల్ వ్యాపారి వద్ద ట్రేడ్ లైసెన్స్ లేదనే కారణంతో అనుచితంగా వ్యవహరించిన కలెక్టర్‌కు వార్నింగ్ ఇస్తూ.. ప్రతిదీ గుర్తు పెట్టుకుంటామని స్పష్టం చేశారు. ఇక మరో ట్వీట్‌లో.. సింగపూర్ పార్లమెంట్‌లో రెండు అబద్ధాలు చెప్పిన ఎంపీకి 14 వేల డాలర్ల జరిమానా వేశారని, మరి కాళేశ్వరం ప్రాజెక్టు, రాష్ట్ర అప్పుల గురించి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి, రైతురుణమాఫీ, రైతుబంధు, రూ.4000ల పింఛన్, మహిళలకు రూ.2500ల పింఛన్ అని ఇట్లా 420 అబద్ధాలు చెప్పిన ముసలి నక్క కాంగ్రెస్ పార్టీకి, రేవంత్‌రెడ్డికి రూ.4.20 లక్షల కోట్ల జరిమానా వేసినా తప్పులేదని వ్యంగంగా వ్యాఖ్యానించారు.

ఏడాదంతా బీఆర్ఎస్ రజతోత్సవాలు

» నిర్వహణ కోసం ప్రత్యేక కమిటీలు: కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఏర్పడి 25 ఏళ్లు పూర్తిచేసుకోవడం తెలంగాణ సామాజిక చరిత్రలోనే ఒక ఉజ్వల ఘట్టమని, ఈ నేపథ్యంలో ఏడాదంతా పార్టీ రజతోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. విస్తృతస్థాయి సమావేశం తరువాత కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఏడాదంతా పార్టీ రజతోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తూనే ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. కృష్ణా జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలతో చెలగాటం ఆడుతోందన్నారు. కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో పోరాడకుంటే బీఆర్ఎస్ తరఫున తమ కార్యాచరణ ప్రకటించాలని నిర్ణయించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ ఎంత అవసరమో.. ఆయన తిరిగి ముఖ్యమంత్రి కావడం ఎంత ఆవశ్యకతనో.. పార్టీ అధినేత పుట్టినరోజు వేడుకలకు వెల్లువలా తరలివచ్చిన ప్రజలే సాక్ష్యమన్నారు. పార్టీ రజతోత్సవాల కోసం ఉద్యమకారులు, పార్టీ ముఖ్యులతో వారం రోజుల్లో కమిటీలను ప్రకటిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో సంక్షోభం తలెత్తిందని, తెలంగాణ కోసం జరిగిన త్యాగాలు వృథా కావద్దంటే ఈ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం అవసరమన్నారు. ఎనిమిది మంది చొప్పున బీజేపీ ఎంపీలు, కాంగ్రెస్ ఎంపీలున్నా.. కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు నయాపైసా రాలేదని, బీఆర్ఎస్ ప్రాతినిధ్యం ఢిల్లీలో ఉంటే గతంలోలాగా కేంద్రం మెడలు వంచేందుకు పోరాడేదన్నారు.

హరీశ్‌రావును ఇరికించే యత్నం

చెప్పినట్టు వినకపోతే నరకం చూపిస్తామంటూ బెదిరింపులు.. ట్యాపింగ్ కేసులో నిందితులపై పోలీసుల హింస

» హరీశ్ తరఫు లాయర్ల వాదన

» మా వద్ద ట్రిక్స్ ప్లే చేయొద్దు

» పోలీసులకు హైకోర్టు చురక

» దర్యాప్తుపై మార్చి 3 దాకా స్టే

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రధాన నిందితుడిగా ఉన్న చక్రధర్‌గౌడ్ ఫోన్‌ట్యాపింగ్ కేసు విచారణ సందర్భంగా బుధవారం హైకోర్టులో వాడీవేడి వాదనలు జరిగాయి. రెండో ఫోన్ ట్యాపింగ్ కేసును కొట్టేయాలని ఏ-1గా ఉన్న హరీశ్‌రావు, ఏ-2గా ఉన్న మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు హైకోర్టులో క్వాష్ పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లు జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం ఎదుట మరోసారి విచారణకు వచ్చాయి. పోలీసులు, ప్రభుత్వం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపిస్తూ.. సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా అందుబాటులో లేనందున మార్చి 3కు విచారణ వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. హరీశ్‌రావు తరఫున హాజరైన న్యాయవాది ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది దామ శేషాద్రి నాయుడు పీపీ వాదనను వ్యతిరేకించారు. పోలీసులు కుట్రపూరితంగా ఈ పిటిషన్లలో వాయిదా తీసుకుంటున్నారని.. మరోవైపు ఈ కేసులో మరో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారని తెలిపారు. హరీశ్‌రావును ఇరికించేలా కొత్తగా అరెస్ట్ చేసిన సంతోష్‌కుమార్, బండి పర్శురాములు, మరో నిందితుడి నుంచి నేరాంగీకార వాంగ్మూలాలు తీసుకుంటున్నారని చెప్పారు. దర్యాప్తు అధికారులు నిందితులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. 'చెప్పినట్టు చేయకపోతే నరకం అంటే ఏంటో చూస్తారు' అంటూ దారుణంగా హింసిస్తూ నిందితులను, వారి కుటుంబ సభ్యులను పోలీసులు వేధిస్తున్నారని పేర్కొన్నారు. హరీశ్‌ను అరెస్ట్ చేయరాదని మధ్యంతర ఉత్తర్వులు ఉండగా.. ఆయన్ను బలంగా కేసులో ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారని, అందుకే వాయిదాల మీద వాయిదాలు కోరుతున్నారని తెలిపారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. 'సిద్ధార్థ లూథ్రా వాస్తవాలపై వాదనలు పూర్తిచేశారు. ఇంకా కొన్ని జడ్జిమెంట్లపై వాదనలు వినిపిస్తా అన్నారు. ఈలోగా పోలీసులు మరో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారిలో కొందరు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుత క్వాష్ పిటిషన్లు పెండింగ్‌లో ఉండగా మీరు (పోలీసులు) ప్రధాన నిందితులను ఇరికించేలా ఎందుకు వ్యవహరిస్తున్నారు? ఇది పిటిషనర్ల ప్రధాన అభ్యంతరం. దీనికి మీ సమాధానం ఏంటి?' అని ప్రశ్నించింది. పీపీ స్పందిస్తూ.. 'ఇది కేవలం పిటిషనర్ల ఆందోళన మాత్రమే. హరీశ్, రాధాకిషన్‌రావును అరెస్ట్ చేయరాదని ఈ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. వారి జోలికి వెళ్లడం లేదు. అదేసమయంలో కోర్టు దర్యాప్తును నిషేధించలేదు. అందుకే దర్యాప్తు కొనసాగిస్తున్నాం' అని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. 'ఆందోళన కాదు. పిటిషనర్ల నుంచి కచ్చితమైన సూచనలు తీసుకుని వారి న్యాయవాదులు వాదిస్తున్నారు. ఓ వైపు వాయిదాలు తీసుకుంటూ అరెస్ట్‌లు కొనసాగిస్తామంటారా? మా వద్ద ట్రిక్స్ ప్లే చేయొద్దు. మార్చి 3 వర కు సమయం ఇస్తున్నాం. అప్పటివరకు దర్యాప్తుపై ముందుకు వెళ్లకుండా ఎలాంటి చర్యలు, అరెస్టులు చేపట్టకుండా స్టే విధిస్తున్నాం' అని ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణ మార్చి 3కు వాయిదా పడింది.



షీల్డ్ సదస్సులో మాట్లాడుతున్న జయేశ్‌రంజన్

పెద్ద కంపెనీలకే కాదు.. స్టార్టప్‌లకూ సైబర్ ముప్పు

» డిజిటల్ లావాదేవీలకు రెండంచెల ధ్రువీకరణ ఉత్తమం

» షీల్డ్ సదస్సులో జయేశ్‌రంజన్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సైబర్ సెక్యూరిటీ ముప్పు బడా కంపెనీలకు మాత్రమే కాదని, స్టార్టప్‌లకూ ఉంటుందని రాష్ట్ర ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. వ్యాపార సంస్థలు, స్టార్టప్‌లు కూడా సైబర్ సెక్యూరిటీపై దృష్టి సారించాలన్నారు. డేటా భద్రతపరంగా ఏర్పడే లోపాలు.. వ్యాపారాలకు గొడ్డలిపెట్టుగా మారుతాయని హెచ్చరించారు. ప్రభుత్వం కూడా ఇందుకు మినహాయింపు కాదని, అందుకే ప్రభుత్వ ఆన్‌లైన్ ఆస్తుల పరిరక్షణకు 2017లో 'సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్'ను ప్రారంభించామని గుర్తుచేశారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ), సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్(ఎస్‌సీఎస్‌సీ) సంయుక్తంగా హెచ్ఐసీసీలో రెండ్రోజుల పాటు నిర్వహించిన 'షీల్డ్ - షీల్డింగ్ ద వల్నరబుల్ సెక్యూరింగ్ డిజిటల్ ఫ్యూచర్- సైబర్ సెక్యూరిటీ కాంక్లేవ్-2025' ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెద్దనోట్ల రద్దు(డీమానిటైజేషన్), కొవిడ్ కల్లోలం తర్వాత డిజిటల్ లావాదేవీలు గణనీయంగా పెరిగాయని, అదే స్థాయిలో సైబర్ సెక్యూరిటీ ముప్పు ఎక్కువైందని ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ బాధితులుగా మారకుండా ఉండాలంటే.. డిజిటల్ లావాదేవీలకు రెండంచెల భద్రతను ఎంచుకోవడం ఉత్తమమన్నారు. సైబర్ సెక్యూరిటీలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. షీల్డ్‌లో భాగంగా ఐఐటీ, ఐఎస్‌బీ, నల్సార్ వంటి విద్యాసంస్థలతో ఒప్పందాలు చేసుకోవడం అభినందనీయమని చెబుతూ.. సీ-డాక్, సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ వంటి సంస్థలను కూడా భాగస్వాములుగా చేసుకోవాలని సూచించారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, రోజూ వందల కేసులు నమోదవుతున్నాయని గుర్తుచేశారు. ప్రజలను సైబర్ ముప్పు నుంచి కాపాడేందుకు పోలీసు శాఖ పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో సీఐడీ చీఫ్ శిఖాగోయల్, సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మొహంతి, ఎస్‌సీఎస్‌సీ సెక్రటరీ జనరల్ రమేశ్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్య

రాత్రి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళుతుండగా వెనుక నుంచి ఆటోలో వచ్చి అడ్డగించిన దుండగులు

» కత్తులతో దాడి.. అక్కడికక్కడే మృతి

» భూపాలపల్లిలో ఘటన.. దాడిలో ఐదారుగురు దుండగులు?

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలో దారుణహత్య జరిగింది. ప్రజావేగు, సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తిని బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు కత్తులతో విచక్షణారహితంగా పొడిచి చంపారు. ఆయన హత్యకు కారణాలు తెలియరాలేదు. పలు భూ, ప్రజా సమస్యలపై కోర్టుల్లో కేసులు వేసిన ఆయన, 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ ఏడో బ్లాకు కుంగుబాటుపై అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ప్రాజెక్టు ఇంజనీర్లపై భూపాలపల్లి జిల్లా కోర్టులో పిటిషన్ వేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి భూపాలపల్లి పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి రాజలింగమూర్తి ద్విచక్రవాహనంపై తన నివాసానికి బయలుదేరారు. పూర్తి నిర్మానుష్యంగా ఉండే టీబీజీకేఎస్ కార్యాలయ సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి ఆటోలో వచ్చిన దుండగులు రాజలింగమూర్తిని అడ్డగించారు. అనంతరం ఆయనపై కత్తులతో మూకుమ్మడిగా దాడి చేశారు. పొట్టలోంచి పేగులు బయటపడి.. ముఖంపై తీవ్రగాయాలై ఆయన అక్కడికక్కడే కుప్పకూలారు. దుండగులు తామొచ్చిన ఆటోలోనే అక్కడి నుంచి పరారయ్యారు. అటుగా వచ్చిన కొందరు రక్తపుమడుగులో పడివున్న రాజలింగమూర్తిని చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. వారొచ్చి ఆయన్ను పట్టణంలోని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు చెప్పారు. ఘటనాస్థలి వద్ద సీసీ ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు. దాడిలో ఐదారుగురు పాల్గొన్నట్టు సమాచారం. భూపాలపల్లి పట్టణంలోని రెడ్డికాలనీ చెందిన రాజలింగమూర్తి సతీమణి సరళ స్థానిక మునిసిపల్ 15వ వార్డు కౌన్సిలర్‌గా బీఆర్ఎస్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పలు రాజకీయ కారణాలతో ఆమె, రాజలింగమూర్తి పార్టీకి దూరంగా ఉంటున్నారు. ప్రస్తుతం వారు ఏ పార్టీలో లేరని తెలుస్తోంది. రాజలింగమూర్తి తొలి నుంచి ప్రజాసమస్యల పేరుతో పలు అంశాలపై కోర్టులో కేసులు వేశారు. భూపాలపల్లిలో పలు భూ ఆక్రమణలు జరిగాయని, అక్రమంగా భూములు కేటాయించారని ఆరోపణలు చేశారు. భార్య సరళ బీఆర్ఎస్‌లో ఉన్నప్పటికీ 2023 అక్టోబరు 23న మేడిగడ్డ 7వ బ్లాక్ కుంగిన ఘటనపై కేసీఆర్, హరీశ్‌రావు, ప్రాజెక్టు ఇంజనీర్లపై భూపాలపల్లి జిల్లా కోర్టులో ఆయన పిటిషన్ వేయడం సంచలనమైంది. ఆ కోర్టులో రాజలింగమూర్తికి అనుకూలంగా తీర్పువచ్చింది. 2024 సెప్టెంబరులో కోర్టు కేసీఆర్, హరీశ్, ఇంజనీర్లకు సమన్లు జారీచేసింది. కేసీఆర్, హరీశ్, ఇంజనీర్లు హైకోర్టును ఆశ్రయించారు. జిల్లా కోర్టు తీర్పుపై స్టే విధించిన హైకోర్టు, తుదితీర్పును గురువారం వెలువరించనుంది. ఇక భూపాలపల్లి శివారులోని సర్వే నెం 171లో విలువైన అటవీ భూమిని అప్పటి కలెక్టర్ భవేశ్ మిశ్రా అక్రమంగా ఇతరులకు కేటాయించారని హైకోర్టులో పిటిషన్ వేశారు. కాగా పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో బాధిత కుటుంబసభ్యులు ఆందోళన నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరామిరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



రోడ్డుపై బైఠాయించి రోదిస్తూ నిరసన తెలుపుతున్న రాజలింగమూర్తి భార్య

16వేల మెగావాట్లు దాటిన విద్యుత్ డిమాండ్

» తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఇదే అత్యధికం

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పరుగులు పెడుతోంది. బుధవారం ఉదయం 7:55 గంటలకు రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 16,058 మెగావాట్లుగా నమోదైంది. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఇదే అత్యధిక డిమాండ్ కావడం గమనార్హం. ఈనెల 10వ తేదీన 15,998 మెగావాట్ల డిమాండ్ నెలకొనగా... తొమ్మిది రోజుల్లోనే ఆ రికార్డు చెరిగిపోయింది. యాసంగి సీజన్ నేపథ్యంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని, దీనికితోడు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గృహ, వాణిజ్య వినియోగం భారీగా పెరగడం వల్లే అత్యధిక డిమాండ్ ఏర్పడిందని అధికారులు వెల్లడించారు. విద్యుత్ డిమాండ్ పెరిగిన నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, విద్యుత్ సంస్థల సీఎండీలతో మాట్లాడారు. డిమాండ్‌కు తగ్గట్లుగా విద్యుత్‌ను అందించాలని, సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని సూచించారు.

'గోదావరి-బనకచర్ల' పనులను అడ్డుకోండి

» గోదావరి బోర్డు చైర్మన్‌కు తెలంగాణ ఈఎన్‌సీ లేఖ

గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు పనుల్లో ఏపీ సర్కారు ఎట్టి పరిస్థితుల్లోనూ ముందుకెళ్లకుండా అడ్డుకోవాలని తెలంగాణ కోరింది. ఈ మేరకు గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) చైర్మన్ ఏకే ప్రధాన్‌కు తెలంగాణ ఈఎన్‌సీ(జనరల్) అనిల్‌కుమార్ బుధవారం లేఖ రాశారు. నాగార్జునసాగర్ నుంచి కృష్ణా జలాలను సాగర్ కుడికాలువ ద్వారా ఎత్తిపోయడానికి వీలుగా పోలవరం-బనకచర్ల అనుసంధానం తొలి దశను 2014-19లో ఏపీ చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. తాజాగా ఆ పనులను పునః ప్రారంభించారని, దీని కింద పల్నాడు జిల్లా క్రోసూరులో మూడో పంప్‌హౌస్ పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే గోదావరి-బనకచర్ల అనుసంధానంలో భాగంగా చేపడుతున్న మొత్తం ప్రాజెక్టు పనులను అడ్డుకోవాలని నివేదించారు.

తెలంగాణ పోలీస్‌లకు స్కోచ్ అవార్డు

రాష్ట్ర పోలీస్‌లకు ప్రతిష్ఠాత్మక స్కోచ్ అవార్డు లభించింది. ఎలక్ట్రానిక్ ఈ-పెట్టీ కేసు మొబైల్ అప్లికేషన్, ఇంటిగ్రేటెడ్ పెట్రోల్ మెనేజ్‌మెంట్ సిస్టం, స్మార్ట్ పోలీస్ స్టేషన్లు, స్మార్ట్ పోలీసింగ్, సేఫ్ సిటీ సీసీ ప్రాజెక్టుల అంశాల్లో స్కోచ్ అవార్డుకు తెలంగాణ పోలీస్‌లు ప్రతిపాదనలు పంపించారు. రాష్ట్ర పోలీస్‌లకు ఎలక్ట్రానిక్ పెట్టీ కేసు మొబైల్ అప్లికేషన్‌కు రజత పతకం, మరో రెండు విభాగాలకు మెరిట్ సర్టిఫికెట్‌ను ప్రకటించింది. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పోలీసుల తరఫున ఐటీ సెల్ డీఎస్పీ రవిచంద్ర అవార్డు స్వీకరించారు. జాతీయ స్థాయిలో సత్తా చాటిన సిబ్బంది పనితీరును ఈ సందర్భంగా డీజీపీ అభినందించారు.

ప్రమాదంలో శ్రీశైలం ప్రాజెక్టు

» జోక్యం చేసుకోండి: తెలంగాణ

శ్రీశైలం ప్రాజెక్టు ప్రమాదంలో ఉందని, ఈ వ్యవహారంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ)ను తెలంగాణ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్‌కు తెలంగాణ రాష్ట్ర డ్యామ్ సేఫ్టీ కమిటీ చైర్మన్, ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్ కుమార్ లేఖ రాశారు. 1981లో కృష్ణా నదిపై నిర్మించిన శ్రీశైలం ప్రాజెక్టుకు 2009లో వచ్చిన వరదతో స్పిల్‌వే దిగువ భాగంలో నీరు పడే ప్రాంతంలో భారీగా గుంత(ప్లంజ్ పూల్) ఏర్పడిందని, మరమ్మతులు చేయకపోవడంతో అది క్రమంగా విస్తరించుకుంటూ పోతూ కట్ట భద్రతకు ప్రమాదకరంగా మారిందని ఆ లేఖలో వివరించారు. జాతీయ ఓషనోగ్రఫీ సంస్థ అధ్యయనం ప్రకారం దీన్ని పూడ్చకపోతే కట్ట భద్రత కే ప్రమాదం అని నివేదికలు వెలువరించాయని, కట్ట గనుక తెగితే తెలుగు రాష్ట్రాలకు ప్రమాదకరమని అనిల్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు.

తెలంగాణకు రూ.231.75 కోట్లు

» వరదలు, విపత్తు సాయం కింద కేంద్రం ఆర్థిక సాయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణకు వరదలు, విపత్తు సాయం కింద కేంద్రం రూ.231.75 కోట్లను విడుదల చేసింది. బుధవారం ఢిల్లీలో కేంద్రం హోంశాఖ మంత్రి అమిత్ షా నేతృత్వంలో జరిగిన ఉన్నత స్థాయి కమిటీ సమావేశంలో 2024లో వరదలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, తుపానులు సంభవించిన ఐదు రాష్ట్రాలకు అదనపు ఆర్థిక సాయం అందించడంపై చర్చించారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి(ఎన్డీఆర్ఎఫ్) ద్వారా ఆ రాష్ట్రాలకు రూ.1554.99 కోట్ల అదనపు ఆర్థిక సాయం అందించడానికి కమిటీ ఆమోదం తెలిపింది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు రూ. 608.08 కోట్లు, త్రిపురకు రూ.288.93 కోట్లు, ఒడిశాకు రూ.255.24 కోట్లు, తెలంగాణకు రూ. 231.75 కోట్లు, నాగాలాండ్‌కు రూ.170.99 కోట్లును కేంద్రం విడుదల చేసింది.

నేటి నుంచి చర్లపల్లి-దానాపూర్ మధ్య ప్రత్యేక రైలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని చర్లపల్లి-దానాపూర్ మార్గంలో ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. గురువారం నుంచి ఈ నెల 28 వరకు (07791/07792) ఈ రైలు రోజూ నడుస్తుందని సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. చర్లపల్లి నుంచి ఉదయం 9.30గంటలకు, తిరుగు ప్రయాణంలో దానాపూర్ నుంచి ఉదయం 4.45గంట లకు ప్రత్యేక రైలు బయలుదేరుతుంది. కాగా, సికింద్రాబాద్ -దానాపూర్ మధ్య (వయా కాజీపేట, బల్లార్ష) నడిచే దానాపూర్ ఎక్స్‌ప్రెస్ (12791/12792) రైలును గురువారం నుంచి ఈ నెల 28వ వరకు రద్దు చేసినట్లు రైల్వే ప్రకటించింది.

హెర్మిటేజ్ కాంప్లెక్స్‌లోకి హెచ్‌ఎండీఏ ఆఫీసు!

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీకి ఎదురుగా ఉన్న హెర్మిటేజ్ బిల్డింగ్ కాంప్లెక్స్‌ను త్వరలో హెచ్‌ఎండీఏ స్వాధీనం చేసుకోనుంది. ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ గడువు తీరడంతో.. పదేళ్ల క్రితం ఏపీకి కేటాయించిన హెర్మిటేజ్ బిల్డింగ్ కాంప్లెక్స్‌ను తమకు అప్పగించాలంటూ ఆ రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. హెర్మిటేజ్ బిల్డింగ్ కాంప్లెక్స్‌లో ఏపీకి చెందిన జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ (జీఏడీ), ఏపీ ఆర్ అండ్ బీ ఆఫీసులున్నాయి. తెలంగాణ ప్రభుత్వం లేఖ నేపథ్యంలో ఈ ఆఫీసులను ఏపీ అధికారులు ఖాళీ చేస్తే, ఆ హెర్మిటేజ్ బిల్డింగ్ కాంప్లెక్స్‌లోకి హెచ్‌ఎండీఏకు చెందిన పలు విభాగాలను తరలించే అవకాశాలున్నాయి.

పెద్దగట్టు అభివృద్ధికి రూ.60కోట్లు

రైతుల ఉసురుతోనే కవిత జైలుకు.. బీఆర్ఎస్ ఇంటికి

బీసీల గురించి బీజేపీ మాట్లాడటం విడ్డూరం: మంత్రి వెంకట్‌రెడ్డి


పెద్దగట్టుపై డోలు వాయిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పదేళ్ల తర్వాత ప్రజా ప్రభుత్వం వచ్చిందని, పేదలకు ఇళ్లు కట్టించే శక్తిని ప్రసాదించాలని లింగమంతుల స్వామి, అమ్మవార్లకు మొక్కుకున్నానని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతరకు బుధవారం వెంకట్ రెడ్డి వెళ్లారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రూ.60కోట్లతో పెద్దగట్టుకు ఘాట్ రోడ్డు, గెస్ట్ హౌస్‌లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు జాతరకు దాదాపు 40 లక్షల మంది వచ్చారని తెలిపారు. రైతుల ఉసురు తగిలే ఎమ్మెల్సీ కవిత జైలు పాలైందని, బీఆర్ఎస్ ఓటమి పాలైందని విమర్శించారు. పదేళ్లు కల్వకుంట్ల కుటుంబం అధికారంలో ఉన్నపుడు ఆస్ట్రేలియా, అమెరికా, లండన్‌లో కాకుండా.. దురాజ్‌పల్లిలో ఎందుకు బోనం ఎత్తలేదని ప్రశ్నించారు. అధికారంలో కోల్పోయాక దురాజ్‌పల్లి గుర్తుకు వచ్చిందా..? అని ప్రశ్నించారు. జగన్‌కు బిర్యానీ పెట్టి శ్రీశైలం, సాగర్‌ను ఎండబెట్టింది కేసీఆర్ అని మండిపడ్డారు. బీసీ అధ్యక్షుడిని తొలగించి బీసీల గురించి బీజేపీ నాయకులు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. .

ఏడాది అభివృద్ధిని ప్రజలకు వివరించండి

» ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

» ఎమ్మెల్సీ ఎన్నికలకు కాంగ్రెస్ సన్నాహం

» పార్టీ నాయకులతో జూమ్ సమావేశం నిర్వహించిన పీసీసీ చీఫ్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలని సీఎం రేవంత్ రెడ్డి పార్టీ నాయకులకు సూచించారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన బుధవారం కాంగ్రెస్ పార్టీ జూమ్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, సీతక్క, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలో ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటూనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. 55 వేల ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ మంజూరు చేసి పనులు చేపట్టామని, దాదాపు రెండు లక్షల కోట్ల పెట్టుబడులు తేవడం జరిగిందని, ఇవన్నీ యువతకు వివరించాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి విజయావకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు. తెలంగాణ ఇన్చార్జ్‌గా నియామకమైన తర్వాత తొలిసారిగా మీనాక్షి నటరాజన్ జూమ్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణను దేశానికి ఒక మోడల్ రాష్ట్రంగా తీర్చిదిద్దామని అన్నారు. అంతా కలిసికట్టుగా పనిచేయాలని, పట్టభద్రుల ఎన్నికలను క్యాడర్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో గెలిచి తీరాలని సూచించారు.


శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్, మంత్రి దుద్దిళ్ల

ఛత్రపతి శివాజీకి సీఎం రేవంత్ నివాళి

ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బుధవారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు వాకాటి శ్రీహరి, బండ్ల కృష్ణమోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం ఎలా?

ఇరిగేషన్, ప్లానింగ్, రెవెన్యూ సంయుక్త తనిఖీలకు అడ్డంకులు

» ఏకకాలంలో జరిపే వీల్లేకుండా పలు సమస్యలు

» శాఖలవారీగా దస్త్రాలు పంపి క్లియర్ చేసే యోచన



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్)-2020లోని దరఖాస్తుల పరిష్కారంపై మున్సిపల్ శాఖ అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్లియరెన్స్‌లో ఎల్1 కేటగిరీ (స్థలం టైటిల్, ఇరిగేషన్, రెవెన్యూ చిక్కులు లేకపోవడం) కీలకం. అక్రమ లేఅవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించే క్రమంలో క్షేత్రస్థాయిలో తనిఖీలు ముఖ్యం. కానీ ఇరిగేషన్, రెవెన్యూ, ప్లానింగ్ విభాగం అధికారులు సంయుక్తంగా తనిఖీలు జరిపేందుకు పలు అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఆయా విభాగాల అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేపడదామంటే.. ఆయా శాఖలకు అప్పటికే ఉన్న పనుల కారణంగా కుదరట్లేదు. దీంతో ఎల్1 క్లియరెన్స్ రాక దరఖాస్తులు పరిష్కారం కావట్లేదు. ఈ నేపథ్యంలో.. సంయుక్త తనిఖీలకు బదులుగా, ఆయా శాఖలవారీగా దస్త్రాలను పంపి, పరిష్కరించే దిశగా యోచిస్తున్నారు. ఎల్ఆర్ఎస్-2020 దరఖాస్తుల స్వీకరణ సందర్భంలోనే ఎక్కడికక్కడే పరిష్కారం చేసేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చిన సంగతి తెలిసిందే. ఆ ప్రక్రియలో అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఉన్నాయి. డీటీసీపీ కూడా ఉంది. కానీ హెచ్ఎండీఏ లేదు. దాని పరిధిలో ఉన్న 32 మున్సిపాలిటీలు, ఎనిమిది కార్పొరేషన్ల పరిధిలోని దరఖాస్తులను పరిష్కారం చేయడానికి ఆయా స్థానిక సంస్థల్లో పట్టణ ప్రణాళిక విభాగాలున్నాయి. కానీ హెచ్ఎండీఏ పరిధిలోని గ్రామ పంచాయతీల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కారం చేసే వ్యవస్థ లేదు. దాంతో 719 గ్రామ పంచాయతీలకు చెందిన సుమారు 4లక్షల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కారం చేసే బాధ్యతలను హెచ్ఎండీఏకు అప్పగించారు. ఈమేరకు హెచ్ఎండీఏ పరిధిలో ఇప్పటికే అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకున్నారు. హెచ్ఎండీఏ పరిధిలోని మొత్తం 1337 దరఖాస్తుల్లో అక్రమ లేఅవుట్ల దరఖాస్తుదారులకు సమాచారమిచ్చి, వారి నుంచి సంబంధిత పత్రాలను పరిశీలించారు. అందులో 400 నుంచి 600 వరకూ దరఖాస్తులు తిరస్కరించారు. మిగతా దరఖాస్తులను అనుమతించి.. ఫీజు చెల్లించాలని దరఖాస్తుదారులకు సమాచారమిచ్చారు. ఆ ప్రక్రియ సాగుతోంది. అదే తరహాలో ప్లాట్ల క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టారు.

ఇదీ లెక్క...

హెచ్ఎండీఏలో ప్రస్తుతం ఎల్ఆర్ఎస్-2020కి సంబంధించిన ప్లాట్ల దస్త్రాలు 3.44 లక్షలున్నాయి. ఇందులో దాదాపు లక్ష దరఖాస్తుల ప్రాసెసింగ్ మొదలైంది. చెరువులు, నిషేధిత జాబితాలో ఉన్న భూముల సర్వే నెంబర్ల సమీపంలోని ప్లాట్లు మినహా ఇతర ప్లాట్ల ప్రాసెసింగ్ ప్రక్రియను మాత్రమే చేపట్టారు. చెరువులు, నిషేధిత జాబితాలో ఉన్న భూముల సర్వే నెంబర్ల సమీపంలోని ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఎల్1 క్లియరెన్స్ చేసేందుకు ఇరిగేషన్, రెవెన్యూ, ప్లానింగ్ విభాగం అధికారులు సంయుక్తంగా తనిఖీలు జరపాలని నిర్ణయించారు. కానీ ఈ మూడు శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీ చేయడం సాధ్యపడడం లేదు. సంయుక్త తనిఖీకి ఏదైనా తేదీని నిర్ణయించినా.. ఆ సమయానికి రావడం అందరు అధికారులకూ కుదరట్లేదు. ఇక.. చెరువులు, నిషేధిత జాబితాలో ఉన్న భూముల సర్వే నెంబర్ల సమీపంలోని ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఎల్1 క్లియరెన్స్ చేసేందుకు వివిధ శాఖల వారిగా దస్త్రాలను పంపే యోచనలో ఉన్నారు. చెరువుకు చుట్టుపక్కల సర్వే నంబర్లలో గల ప్లాట్లకు ఇరిగేషన్ క్లియరెన్స్ ఇచ్చేందుకు ఆ శాఖకు సంబంధిత దరఖాస్తులు పంపాలని, చెరువుతో పాటు నిషేధిత జాబితాలో ఉన్న భూముల వెంట గల సర్వే నెంబర్లలో ప్లాట్ల వివరాలను రెవెన్యూ విభాగానికి పంపాలని భావిస్తున్నారు. దీనిపై మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు చర్చించి త్వరలోనే ఓ నిర్ణయాన్ని తీసుకునే అవకాశాలున్నాయి.

మార్చి 31లోపు ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేస్తే.. 25% రాయితీ

(మొదటిపేజీ తరువాయి)

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు రాగా.. వాటిలో 9 లక్షల దరఖాస్తులనే పరిష్కరించారు. అందులో కూడా క్రమబద్ధీకరణకు అనుమతించిన దరఖాస్తులు కేవలం 1,70,000 మాత్రమే. వాస్తవానికి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ద్వారా రూ.8 వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జించాలని ప్రభుత్వం భావించినా ఆశించిన పురోగతి కనిపించలేదు. గత ఏడాది ఆగస్టులో ఈ పథకం అమలుకు ప్రభుత్వం ప్రకటన చేసినా.. ఇప్పటి వరకు కేవలం రూ.120 కోట్ల ఆదాయం మాత్రమే సమకూరింది. దరఖాస్తుల పరిష్కారంలో అనుకున్నంత వేగం లేకపోవడంతో ఈ పథకం అమలుపై రోజువారీ సమీక్ష జరపాలని మంత్రులు నిర్ణయించారు. ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటు దుర్వినియోగం కాకుండా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల విషయంలో నిషేధిత జాబితాలో ఉన్న భూములు, ఇతర ప్రభుత్వ భూముల్లో ఉండే అనధికారిక లేఅవుట్ల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దరఖాస్తుల పరిశీలన సులభతరం చేయాలని ఆదేశించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద కూడా రిజిస్ట్రేషన్‌కు వెళ్లి ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించవచ్చని సూచించారు.

ముందుకొచ్చేనా?

ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయాలతో.. దరఖాస్తుదారుల స్పందన ఎంతమేరకు ఉంటుందనే చర్చ జరుగుతోంది. ఏడు నెలల క్రితం ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ప్రక్రియను అమలు చేయడానికి నిర్ణయం తీసుకున్నా దరఖాస్తుదారుల నుంచి ఆశించిన స్పందన కనిపించలేదు. 60 శాతం దరఖాస్తులకు.. అవసరమైన అన్ని రకాల పత్రాలూ జత చేయకపోవడం, ఇప్పుడు వాటిని అప్‌లోడ్ చేయాలని అధికారులు సూచించినా పెద్దగా స్పందించకపోవడంతో ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. తాజాగా 25 శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం, ఈ రాయితీ కూడా మార్చి 31 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని స్పష్టం చేయడంతో ప్రస్తుతం విగిలి ఉన్న 39 రోజుల వ్యవధిలోనే వీలైనన్ని దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉంది. రాయితీ ప్రకటించిన నేపథ్యంలో దరఖాస్తుదారులు ముందుకు వస్తే అందుకు తగిన ఏర్పాట్లు చేసి, స్పెషల్ డ్రైవ్ చేపట్టే యంత్రాంగం ప్రస్తుతం అందుబాటులో లేదని పురపాలక శాఖ అధికారులు చెబుతున్నారు.

అత్యాశ కాదు.. అవసరాలు తీర్చాలి

» ఒక్క ఆరుతడి పంటకైనా నీళ్లివ్వండి

» కృష్ణా ట్రైబ్యునల్‌లో తెలంగాణ వాదన

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నీటి కేటాయింపులు అవసరాలు తీర్చే విధంగా జరగాలి తప్ప అత్యాశ తీర్చడానికి కాదని తెలంగాణ అభిప్రాయపడింది. తెలంగాణలోని కృష్ణా పరీవాహక ప్రాంతంలో కనీసం ఒక ఆరుతడి పంటకు అవసరమైన సాగునీరు అందేలా చూడాలని కోరింది. కృష్ణా బేసిన్ వెలుపలి ప్రాంతాలకు ఏపీ జలాలను తరలించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. అంతర్రాష్ట్ర నదీ జలాల వివాద చట్టంలోని సెక్షన్-3 ఆధారంగా నీటి కేటాయింపులపై జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్‌లో బుధవారం వాదనలు ప్రారంభమవ్వగా.. తెలంగాణ ఈ మేరకు వాదనలు వినిపించింది. రాష్ట్రం తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదనలు వినిపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు నికర జలాలు కేటాయిస్తే కృష్ణా బేసిన్ పరిధిలో 25 లక్షల కుటుంబాలకు దాదాపుగా 80 లక్షల మందికి జీవనోపాధి లభిస్తుందని తెలిపారు. శాస్త్రీయ లెక్కల ప్రకారం సమర్థవంతంగా నీటి వినియోగంతో కృష్ణా డెల్టాలో నీటి అవసరాలు తగ్గుతాయన్నారు. తద్వారా పొదుపు చేసిన నీటిని బేసిన్‌లోని ఇతర ప్రాంతాలకు కేటాయించాలని కోరారు. బేసిన్ లోపలి ప్రాంతాలకు నీరు అందిన తర్వాతే ఇతర బేసిన్‌లకు నీటిని తరలించాలని గతంలో వివిధ కేసుల్లో తీర్పులను సవివరంగా గుర్తు చేశారు. తెలంగాణలో కృష్ణా బేసిన్ లోపల సాగునీటి సౌకర్యం లేని ప్రాంతాలున్నాయని, కృష్ణా జలాలను బేసిన్ లోపలి ప్రాంతాలకే కేటాయించాలని కోరారు. ఏపీ ఏటా 323 టీఎంసీల కృష్ణా జలాలను ఇతర బేసిన్లకు తరలిస్తోందని వివరించారు. ఏపీలో కృష్ణా పరీవాహకం పరిధిలోని ప్రాంతాలకు సాగునీటి సరఫరాపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. కానీ, తెలంగాణలో పరీవాహకం పరిధిలోని ప్రాంతాల్లో కనీసం ఒక ఆరుతడి పంటకు కూడా సాగునీరు అందడం లేదని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఏపీలోని ఇతర బేసిన్(పరీవాహకం వెలుపలి) ప్రాంతాలు నీళ్ల వాడుకోవడాన్ని అనుమతించరాదని కోరారు. ప్రస్తుతం తెలంగాణలో ఎత్తిపోతల పథకాలు నిర్మించుకోవడం తప్ప మరో గత్యంతరం లేదని వైద్యనాథన్ పేర్కొన్నారు. గోదావరి జలాల మళ్లింపునకు ఏపీ చేస్తున్న ప్రయత్నాలను ట్రైబ్యునల్ దృష్టికి తీసుకెళ్లారు. ఏపీలో రాజధాని ప్రాంత అభివృద్ధితో కృష్ణా డెల్టా, నాగార్జునసాగర్ కింద తగ్గిన నీటి వినియోగాన్ని తెలంగాణకు కేటాయించాలని ట్రైబ్యునల్‌కు నివేదించారు.

పెట్టుబడుల గమ్యస్థానం తెలంగాణ

» మూడేళ్లలో రాష్ట్రానికి 3.25 లక్షల కోట్లు

» ఎంఎస్ఎంఈ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్

పెట్టుబడులకు తెలంగాణ గమ్యస్థానంగా మారుతోందని, రాష్ట్రంలో కొత్త పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీలు ప్రత్యేక ఆసక్తి చూపిస్తున్నాయని ఎంఎస్ఎంఈ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ చైర్మన్ డీఎస్.రావత్ తెలిపారు. గత మూడేళ్లలో తెలంగాణ రూ. 3.25 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించిందని పేర్కొన్నారు.

అదనపు రుణం రూ.1,474 కోట్లు

అంచనా కంటే ఎక్కువగా తీసుకున్న రాష్ట్రం.. బడ్జెట్ అంచనాల్లో మార్కెట్ రుణాలు రూ.57,112 కోట్లు

» జనవరి నాటికి తీసుకున్న రుణం రూ.58,586 కోట్లు: కాగ్



హైదరాబాద్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో రూ.1,474 కోట్ల బహిరంగ మార్కెట్ రుణం తీసుకుంది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా వేలం పాటల ద్వారా సేకరించే రుణాల్లో భాగంగా దీనిని సేకరించింది. ఈసారి రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి(జీఎస్‌డీపీ) పెరుగుతుందంటూ కేంద్ర ప్రభుత్వానికి వివరించి, ఈ అదనపు రుణం తీసుకుని ఉంటుందని తెలుస్తోంది. ఆర్థిక శాఖ అధికారులు మాత్రం దీనిపై ఎలాంటి స్పష్టత నివ్వడం లేదు. ఈమేరకు రాష్ట్ర ఆదాయ, వ్యయాలకు సంబంధించి 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్)' బుధవారం జనవరి నెల నివేదికను విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అంచనా వేసిన మార్కెట్ రుణాల కంటే అదనంగా రూ.1,474 కోట్లను అప్పుగా తీసుకున్నట్లు తేలింది. 2024-25 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ.57,122 కోట్ల మార్కెట్ రుణాలు తీసుకుంటామని అంచనా వేసింది. ఇవి కాకుండా జీఎస్టీ పరిహారం కింద మరో రూ.3,900 కోట్ల రుణాన్ని రాష్ట్రానికి ఇస్తామని కేంద్రం ప్రకటించింది. ఇతర రుణాల కింద రూ.1000 కోట్లను తీసుకుంటామని రాష్ట్రం బడ్జెట్‌లో తెలిపింది. ఇలా మొత్తం రూ.62,012 కోట్ల రుణాలు వస్తాయని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.3,900 కోట్ల రుణాలకు మార్కెట్ రుణాలతో సంబంధం లేదు. అవి ఎలాంటి వడ్డీ లేని రుణాలు. 50 ఏళ్ల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అసలు(ప్రిన్సిపల్) మొత్తాన్ని మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. మిగతా రూ.1000 కోట్లు రిజర్వు బ్యాంకు ద్వారా కాకుండా బడ్జెట్‌కు ఆవల తెచ్చుకునే రుణాలు. ఈ దృష్ట్యా మార్కెట్ రుణాలను మాత్రమే పరిగణలోకి తీసుకుంటే రూ.57,112 కోట్ల అంచనాలకుగాను కేంద్ర ప్రభుత్వం రూ.49,255 కోట్లకు మాత్రమే అనుమతి ఇచ్చింది. అయినా రాష్ట్ర ప్రభుత్వం ఈ జనవరి నాటికి రూ.58,586.64 కోట్ల మార్కెట్ రుణాలు తీసుకున్నట్లు 'కాగ్' వెల్లడించింది. ఇది 118 శాతమని తెలిపింది. బడ్జెట్‌లో అంచనా వేసిన రూ.57,112 కోట్లను పరిగణలోకి తీసుకున్నా రాష్ట్ర ప్రభుత్వం రూ.1,474 కోట్ల అప్పును అదనంగా తీసుకున్నట్లయింది. అయితే జీఎస్‌డీపీ పెరుగుతుందన్న ధీమాతో, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ఈ అదనపు రుణాలు తీసుకుని ఉంటుందని భావిస్తున్నారు.

మొత్తం రాబడులు రూ.1,83,437 కోట్లు

జనవరి నాటికి రాష్ట్ర రాబడుల కింద మొత్తం రూ.1,83,437 కోట్లు సమకూరాయి. అంచనా వేసిన రాబడులు రూ.2,74,057 కోట్లలో ఇది 66.57 శాతమే. ఈసారి అంచనా వేసిన వ్యయం రూ.2,54,431 కోట్లలో సంక్షేమ పథకాలు, జీతభత్యాలు, వడ్డీ చెల్లింపులు, సబ్సిడీల కోసం జనవరి నాటికి రూ.1,78,947 కోట్ల(70.33%)ను వ్యయం చేసినట్లు వెల్లడించింది.

నెల రోజుల్లోగా 'సీతారామ'కు సాంకేతిక అనుమతులు

» మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ హామీ


కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో రాష్ట్ర మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన సాంకేతిక అనుమతులు నెల రోజుల్లోగా జారీ అయ్యేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డికి హామీ ఇచ్చారు. అలాగే, మేడిగడ్డ కుంగుబాటుపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) నివేదిక నెలాఖరులోగా రాష్ట్రానికి అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరుగుతున్న అఖిలభారత నీటిపారుదల శాఖ మంత్రుల సదస్సుకు విచ్చేసిన కేంద్ర మంత్రి పాటిల్‌తో ఉత్తమ్ బుధవారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీతారామ, కాళేశ్వరం ప్రాజెక్టులతోపాటు వివిధ అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ డిజైన్లు/డ్రాయింగ్‌లు పరిశీలించాకే సీతారామకు సాంకేతిక అనుమతులు ఇస్తామని సాంకేతిక సలహామండలి(టీఏసీ) చెప్పిందని, అన్నిరకాల అనుమతులు వచ్చిన తర్వాత ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతులు ఇవ్వడం లేదని కేంద్ర మంత్రికి తెలియజేశారు. ఇందుకు స్పందించిన కేంద్ర మంత్రి నెలరోజుల్లోగా సాంకేతిక అనుమతి వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇక, మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు జరిగి ఏడాదైందని ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ నివేదిక అందిస్తే తమ ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందని ఉత్తమ్ కేంద్ర మంత్రికి తెలియజేశారు. నిపుణుల కమిటీ నివేదికను నెలాఖరులోగా అందిస్తామని కేంద్ర మంత్రి బదులిచ్చారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలని ఉత్తమ్ కోరారు. ఈ సందర్భంగా కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ కల్పించుకొని.. 50 ఏళ్ల కాలానికి వడ్డీ లేకుండా రుణాలు చెల్లించేలా ప్రాజెక్టుల నిర్మాణానికి రుణాలు లభించేలా చేస్తామని తెలిపారు. కాగా, మూసీ పునరుజ్జీవన పథకానికి కేంద్రం సహాయం అందించాలని ఉత్తమ్ కోరగా.. ఆ విషయాన్ని పరిశీలిస్తామని మంత్రి బదులిచ్చారు.

జేఎన్‌టీయూలో ఇకపై వారానికి 5 పనిదినాలే!

ఉద్యోగుల కోరిక మేరకు కొత్త వీసీ నిర్ణయం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ నూతన ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన రెండో రోజే డా. కిషన్‌కుమార్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. వర్సిటీకి అనుబంధంగా ఉన్న కళాశాలల్లో పనిదినాలను వారానికి ఆరు రోజుల నుంచి ఐదు రోజులకు తగ్గించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆయన ఉద్యోగుల నుంచి వచ్చిన ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించారు. బుధవారం నూతన వీసీ కిషన్‌కుమార్ రెడ్డిని కలిసి పలువురు ఉద్యోగ, అధికారుల సంఘాల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. 2008 తర్వాత జేఎన్‌టీయూకు వీసీలుగా వచ్చిన ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు కొందరు జేఎన్‌టీయూ విధానాలను తుంగలోకి తొక్కి, అక్కడి విధానాలను అమలు చేసిన విషయాన్ని కొత్త వీసీ దృష్టికి తెచ్చారు. ఉద్యోగుల ప్రతిపాదనలను పరిశీలించి 2008కి ముందు ఉన్న వారానికి ఐదు రోజుల పనిదినాల విధానాన్ని అమలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని వర్సిటీ రిజిస్ట్రార్‌కు నూతన వీసీ కిషన్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. ఈ విధానం వల్ల యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న పాలేరు, మహబూబాబాద్, వనపర్తి, సిరిసిల్ల, సుల్తాన్‌పూర్ కళాశాలల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి తమ కుటుంబాలతో ఎక్కువ సమయం గడిపేందుకు వీలవుతుందని, దీంతో ఉద్యోగులు మెరుగైన సేవలు అందిస్తారని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. దాదాపు 16 ఏళ్ల తర్వాత జేఎన్‌టీయూ ప్రొఫెసరే వీసీగా రావడంతో తమకు మరింత మేలు జరుగుతుందని ఉద్యోగులు, ఆచార్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

» రూ. 1.20 కోట్ల విలువైన 60 టన్నుల ఇసుక స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను విక్రయిస్తున్న వ్యక్తిని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రూ. 1.20లక్షల విలువైన 60 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని నాంపల్లి మండలం పరిధిలో కొంతమంది ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు నాంపల్లి మండల రెవెన్యూ అధికారులతో కలిసి సౌత్‌వెస్టు టాస్క్‌ఫోర్స్ పోలీసు బృందం రంగంలోకి దిగింది. ధూల్‌పేటకు చెందిన సంతోష్ సింగ్ అనే వ్యక్తి పురానాపూల్‌లో ఇసుక, ఇతర నిర్మాణ సామగ్రి వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించి ఆ ప్రాంగణంపై ఆకస్మికంగా దాడి చేశారు. ఎలాంటి వే బిల్లులు, రెవెన్యూ మైనింగ్ అధికారుల అనుమతి లేకుండా అతను అక్రమంగా ఇసుకను అమ్ముతున్నట్లు అధికారులు గుర్తించారు. అక్కడ అక్రమంగా డంప్ చేసిన రూ. 1.20లక్షల విలువైన 60 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు.

శివాజీ జయంతి వేడుకల్లో ప్రమాదం

» జెండా ఎగరేస్తుండగా కరెంట్ షాక్‌తో ఒకరి మృతి

» ఒకరి పరిస్థితి విషమం.. ఆరుగురికి తీవ్ర గాయాలు

వర్గల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో కరెంట్ షాక్ తగిలి ఒకరు చనిపోయారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. శివాజీ జయంతిని పురస్కరించుకుని బుధవారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం జెబ్బాపూర్ గ్రామంలో వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా గ్రామ కూడలి వద్ద కాషాయ జెండా ఎగరవేసే క్రమంలో జెండాకు ఉన్న ఇనుప పైపునకు విద్యుత్ వైర్లు తగిలి షాక్ వచ్చింది. దీంతో పైపును పట్టుకుని ఉన్న లింగ ప్రశాంత్‌తో పాటు మరికొందరు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. వీరిని చికిత్స కోసం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా లింగ ప్రశాంత్(22) మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దేశెట్టి కరుణాకర్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

నేడు టీజీ ఎప్‌సెట్-2025 నోటిఫికేషన్

» నాన్‌లోకల్ కేటగిరీ ప్రవేశాలపై స్పష్టత ఇవ్వని సర్కారు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీజీ ఎప్‌సెట్-2025 నోటిఫికేషన్ గురువారం విడుదల చేయనున్నట్లు సెట్ కన్వీనర్ వెల్లడించారు. నాన్‌లోకల్ కేటగిరీ ప్రవేశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో కొన్ని షరతులకు లోబడి నోటిఫికేషన్ జారీ చేసేందుకు అధికారులు సిద్ధమైనట్లు తెలిసింది. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయిన నేపథ్యంలో తెలంగాణ ఎప్‌సెట్‌కు ఏపీ విద్యార్థులను నాన్‌లోకల్ కేటగిరీలో అనుమతించాలా? లేదా? అనే అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జారీ చేయబోయే ఉత్తర్వుల మేరకే నాన్‌లోకల్ కేటగిరీ ప్రవేశాలుంటాయని నోటిఫికేషన్‌లో పేర్కొనే అవకాశం ఉంది. మరోవైపు రాష్ట్ర అటవీశాఖ ఆధ్వర్యంలోని కళాశాల్లో బీఎస్సీ ఫారెస్ట్రీ కోర్సులో ప్రవేశాలపైనా అయోమయ పరిస్థితి నెలకొంది. గతేడాది వరకు ఈ కోర్సులో ప్రవేశాలను ఎప్‌సెట్ ర్యాంకుల ఆధారంగా చేపట్టగా, ఈ ఏడాది అటవీశాఖే స్వయంగా ప్రవేశపరీక్ష నిర్వహించాలని భావించింది. అయితే ఈ మేరకు బుధవారం వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాలేదు. ఎప్‌సెట్‌లో బీఎస్సీ ఫారెస్ట్రీ ప్రవేశాల అంశాన్ని ప్రస్తావిస్తారా, లేదా అనే దానిపై అయోమయం నెలకొంది.

దిగొచ్చిన 'గోకరాజు' ఇంజనీరింగ్ కాలేజీ

» విద్యార్థుల చేతికి ధ్రువపత్రాలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గోకరాజు రంగరాజు ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యం ఎట్టకేలకు మెట్టు దిగింది. ప్రభుత్వ నిబంధనలు, వర్సిటీ ఆదేశాలను బేఖాతరు చేసిన కారణంగా గోకరాజు కాలేజీ యాజమాన్యంపై జేఎన్‌టీయూ అధికారులు కొరడా ఝుళిపించిన సంగతి తెలిసిందే. ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరైనా పలువురు విద్యార్థులకు చెందిన ఒరిజినల్ ధ్రువపత్రాలను వెనక్కి ఇవ్వకపోవడంతో వారంతా జేఎన్‌టీయూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కళాశాలకు జేఎన్‌టీయూ అఫిలియేషన్‌ను ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలంటూ వర్సిటీ రిజిస్ట్రార్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీంతో కళాశాల యాజమాన్యం కలవరపాటుకు గురైంది. ప్రిన్సిపాల్‌తోసహా డైరెక్టర్, డీన్ తదితరులు జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి బాధిత విద్యార్థులను, వర్సిటీ ఉన్నతాధికారులను క్షమాపణలు కోరారు. అప్పటికప్పుడే బాధిత విద్యార్థులను వెంటబెట్టుకొని కళాశాలకు తీసుకెళ్లిన గోకరాజు యాజమాన్య ప్రతినిధులు వారి సర్టిఫికెట్లను వెనక్కి ఇవ్వడంతో సమస్య పరిష్కారమైంది. కాగా, వర్సిటీ ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించడంలో నిర్లక్ష్యం వహించిన కళాశాల ప్రిన్సిపాల్‌కు యూనివర్సిటీ రిజిస్ట్రార్ మెమో జారీ చేశారు.

ఏపీలో మరో రెండు జీబీఎస్ కేసులు

» గుంటూరులో పదికి చేరిన బాధితులు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో కొత్తగా మరో రెండు గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసులు నమోదయ్యాయి. దీంతో జీబీఎస్‌తో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి న్యూరాలజీ విభాగంలో చేరిన రోగుల సంఖ్య పదికి చేరింది. గత వారం ఎనిమిది మంది చికిత్స పొందగా, తాజాగా మంగళ, బుధవారాల్లో మరో రెండు కొత్త కేసులు నమోదయ్యాయి. సత్తెనపల్లికి చెందిన 58 ఏళ్ల వ్యక్తికి జీబీఎస్ సోకగా, చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్చారు. గత నెలలో జీబీఎస్ బారిన పడి.. నెల్లూరు నారాయణ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మరో రోగిని కూడా మెరుగైన వైద్యం కోసం బుధవారం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. దీంతో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు గుంటూరు జీజీహెచ్‌లో చేరిన జీబీఎస్ రోగుల సంఖ్య పదికి చేరింది. ఇందులో ప్రకాశం జిల్లాకు చెందిన కమలమ్మ అనే మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే జీబీఎస్ లక్షణాలతో వివిధ ప్రాంతాలకు చెందిన మరో ముగ్గురు అనుమానిత రోగులు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. కాళ్లు, చేతులు చచ్చుబడటం, ఇతర లక్షణాలు కూడా జీబీఎస్ మాదిరిగానే ఉన్నాయి. వీరికి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు.

సౌరశక్తి, బ్యాటరీ, పెట్రోల్‌తో నడిచే సైకిల్

» బల్మూరు విద్యార్థికి బండారు దత్తాత్రేయ ప్రశంసలు

హైదరాబాద్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండల కేంద్రానికి చెందిన 14 ఏళ్ల విద్యార్థి గగన్‌చంద్ర చండీగఢ్‌లో జరుగుతున్న జాతీయస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ చాటాడు. సౌరశక్తి, బ్యాటరీ, పెట్రోల్‌తో నడిచే హైబ్రిడ్ త్రీ-ఇన్-వన్ సైకిల్‌ను ఇతడు అభివృద్ధి చేశాడు. ఇది బ్యాటరీ శక్తితో 35 కి.మీ వరకు, సౌరశక్తితో రోజంతా ప్రయాణించగలదు. సైన్స్ ఫెయిర్లో గగన్ చంద్ర ఆవిష్కరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ మేరకు హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ గగన్‌చంద్రకు ఫోన్ చేసి.. అభినందించారు.

దేవాదాయశాఖ అదనపు కమిషనర్‌గా శ్రీనివాస్‌రావు

దేవాదాయ శాఖలో అదనపు కమిషనర్ స్థాయి అధికారుల బదిలీలు జరిగాయి. ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్‌గా ఈ. శ్రీనివాస్‌రావు నియమితులయ్యారు. ఆయన ఇప్పటి వరకు దేవాదాయ శాఖ ట్రైబ్యునల్ సభ్యుడిగా కొనసాగారు. ఆయన స్థానంలో ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్‌గా ఉన్న కె.జ్యోతి నియమితులయ్యారు. ఈ మేరకు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, దేవాదాయశాఖ ప్రధాన కార్యాలయంతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ కీలక పోస్టులు సుదీర్ఘకాలంగా ఇన్‌చార్జీల పాలనలోనే కొనసాగుతున్నాయి. కమిషనర్ తర్వాత అత్యంత కీలకమైన రీజనల్ జాయింట్ కమిషనర్ (ఆర్‌జేసీ) పరిపాలన పోస్టును సుమారు 7 సంవత్సరాలుగా ఇన్‌చార్జీతోనే నెట్టుకొస్తున్నారు.

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కొన్నాళ్లుగా తీవ్రమైన దగ్గుతో బాధపడుతున్న ఓ యువకుడు, బాగా బరువు తగ్గి పీలగా అయ్యాడు. కుటుంబసభ్యులు అతడిని ఆస్పత్రికి తీసుకొస్తే పరీక్షించిన వైద్యులు ఊపిరితిత్తుల్లో ఏదైనా సమస్య ఉందేమోనని సీటీ స్కాన్ చేయించారు. రిపోర్టును చూసి లోపల ఏదో కణితి ఉన్నట్లు గుర్తించారు. తొలగించేందుకు శస్త్రచికిత్స చేస్తుండగా వైద్యులే ఆశ్చర్యపోయారు. ఊపిరితిత్తుల్లో కణితి లేదు ఏమీ లేదు.. కణితి మాదిరిగా రిపోర్టులో కనిపించింది ఓ పెన్ క్యాప్! దాన్నే ఊపిరితిత్తుల్లోంచి బయటకు తీశారు. కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రిలో బుధవారం ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ శుభకర్ నాదెళ్ల వివరాలను వెల్లడించారు. బాధితుడు కరీంనగర్ ప్రాంతానికి చెందిన 26 ఏళ్ల యువకుడు. మూడు

21 ఏళ్లుగా ఊపిరితిత్తుల్లో పెన్ క్యాప్!

యువకుడికి కొన్నాళ్లుగా తీవ్ర దగ్గు, బరువు తగ్గుదల

సీటీ స్కాన్ రిపోర్టు చూసి కణితిగా భావించిన వైద్యులు

శస్త్రచికిత్స చేసి తొలగింపు.. కొంత దెబ్బతిన్న ఊపిరితిత్తులు

మందులతో స్వస్థత.. వివరాలు వెల్లడించిన కిమ్స్ వైద్యులు



గంటలపాటు శస్త్రచికిత్స నిర్వహించారు. ఫ్లెక్సిబిల్ బ్రాంకోస్కోపీ సాయంతో తొలుత ఊపిరితిత్తుల్లో క్యాప్‌చుట్టూ పేరుకుపోయిన కణజాలాలు, లింఫ్ నోడ్, కండలను తొలగించి.. పెన్ క్యాప్‌ను బయటకు తీశారు. ఇంతకీ పెన్‌క్యాప్ ఊపిరితిత్తుల్లోకి ఎలా వెళ్లినట్లు? ఇదే విషయాన్ని బాధితుడి కుటుంబసభ్యులను వైద్యులు అడిగారు. బాధితుడు ఐదేళ్ల వయసున్నపుడు పెన్ క్యాప్‌ను నోట్లో పెట్టుకొని ఆడుకుంటుండగా అది గొంతులోంచి లోపలికి జారిపోయినట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు. ఆ మర్నాడు వైద్యుడి దగ్గరకు తీసుకెళితే.. పరీక్షించిన వైద్యులు కడుపులో ఏమీలేదని.. మలంతో పాటు క్యాప్ వెళ్లిపోయి ఉంటుందని చెప్పారని వెల్లడించారు. తర్వాత ఎలాంటి సమస్యా లేకపోవడంతో ఆ విషయాన్నే మరిచిపోయినట్లు చెప్పారు. అంటే.. 21ఏళ్లుగా ఆ పెన్‌క్యాప్ ఊపిరితిత్తుల్లోనే ఉండిపోయిందన్నమాట. ఏళ్లుగా పెన్‌క్యాప్ ఉండటంతో యువకుడి ఊపిరితిత్తులు కొంత దెబ్బతిన్నాయని వైద్యులు చెప్పారు. యాంటీబయాటిక్స్ వాడటంతో యువకుడు కోలుకున్నాడని వెల్లడించారు. సమస్య గుర్తించకపోతే ఊపిరితిత్తులు పూర్తిగా పాడైపోయేవని.. అదృష్టవశాత్తు ముందే గుర్తించడంతో క్యాప్‌ను తొలగించి.. మందులతో సమస్యను సరిచేయగలిగామని వివరించారు. చిన్న పిల్లలు ఆడుకునేటప్పుడు.. పెద్దలు ఓ కంట గమనిస్తూ ఉండాలని.. నోట్లో ఏ వస్తువులు పెట్టుకోకుండా చూడాలని డాక్టర్ శుభకర్ సూచించారు.

డుమ్మా డాక్టర్లకు చెక్

(మొదటిపేజీ తరువాయి)

పరిధిలోని 868 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైద్య విధాన పరిషత్ పరిధిలోని 156 ఆస్పత్రులు, ఆయుష్ పరిధిలోని 845 ఆస్పత్రుల్లో ఈ విధానాన్ని అమలు చేయబోతున్నారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. పీహెచ్‌సీలకు వైద్యులు సకాలంలో రావడం లేదనే విషయాన్ని వెలుగులోకి తెస్తూ సోమవారం 'ఆంధ్రజ్యోతి' "పీహెచ్‌సీలకు చుట్టాలుగా వైద్యులు" అన్న కథనం ఇచ్చింది. వైద్యులు ఆస్పత్రులకు రాని విషయాన్ని సర్కారు చాలా సీరియస్‌గా తీసుకుంది. బుధవారం వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దీనిపై సమీక్ష నిర్వహించారు. డీఎంఈ, డీహెచ్, టీవీవీపీ, ఆయుష్ విభాగాధిపతులతో సమావేశయ్యారు. ఆస్పత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బంది హాజరుపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

టీజీటీఎస్ సహకారంతో బయోమెట్రిక్ హాజరు

సర్కారు ఆస్పత్రుల్లో వైద్యులు లేకపోవడంతో పేదలు ప్రైవేటుకు వెళ్తున్నారు. ఇటీవల విభాగాధిపతుల వరుస తనిఖీల్లో చాలా ఆస్పత్రుల్లో వైద్యులు ఇలా వచ్చి అలా వెళ్తున్నట్లు వెల్లడైంది. దీనికితోడు ప్రజాప్రతినిధులు నుంచి కూడా వైద్య శాఖ మంత్రికి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో అన్ని ఆస్పత్రుల్లోనూ ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని అమలు చేయాలని నిర్ణయానికి వచ్చినట్లు



తెలుస్తోంది. ఈ విధానాన్ని వైద్యులకే కాకుండా ఇతర పారామెడికల్ సిబ్బంది అందరికీ వర్తింపజేయనున్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వైద్యులు, సిబ్బందిని కూడా దీని పరిధిలోకి తీసుకురాబోతున్నారు. ఇప్పటికే ఖమ్మం జిల్లాలో ప్రవేశపెట్టిన ఈ విధానం విజయవంతం కావడంతో రాష్ట్రమంతా దీనిని అమలు చేయాలన్న నిర్ణయానికి సర్కారు వచ్చినట్లు తెలుస్తోంది. రూ.కోట్లు వెచ్చించి మౌలిక సదుపాయాలు కల్పించి.. పరికరాలు, ఔషధాలు అందుబాటులో ఉంచినా.. వైద్యులు లేకపోవడం, ఆస్పత్రులకు రాకపోవడంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. వైద్యులు లేక రోగులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. కాగా, ఇప్పటికే సచివాలయంతో పాటు పలు ప్రభుత్వ శాఖల్లో ఆధార్ ఆధారిత ఫేషియల్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఇందుకు తెలంగాణ స్టేట్ టెక్నికల్ సర్వీసెస్(టీజీటీఎస్) సాంకేతిక సహకారం అందిస్తోంది. వైద్య ఆరోగ్యశాఖ సైతం టీజీటీఎస్ సహకారం తీసుకోనుంది. ఒక ఉద్యోగి నెల హాజరు నిర్వహణ వ్యయం సుమారు రూపాయిన్నర వరకు అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఆ లెక్కన డీహెచ్ విభాగంలో సుమారు 18 వేల మంది, టీవీవీపీ పరిధిలో 13వేల మంది, ఆయుష్‌లో సుమారు 3 వేల మంది వరకు ఉన్నారు. వీరందరికీ నెలకు సగటున రూ.25-30 లక్షల ఖర్చు అవుతుందని అంచనా వేశారు.

మంత్రితో పాటు హెచ్‌వోడీలందరికీ యాక్సెస్

టీజీటీఎస్ సహకారంతో రూపొందించే యాప్‌లో ప్రతీ ఉద్యోగికి ఒక ఐడీని కేటాయిస్తారు. దాని ద్వారా వారి అటెండెన్స్ వివరాలను చెక్ చేసుకోవచ్చు. అలాగే ఇప్పటి వరకు ఎన్ని సెలువులు పెట్టారు..? ఇంకెన్ని ఉన్నాయి..? అనే విషయాలను తెలుసుకోవచ్చు. ఉద్యోగి హాజరు శాతం ఆధారంగా వేతనాలు ఇచ్చేలా ప్లానింగ్ చేస్తున్నారు. ఇక ఈ యాప్ యాక్సెస్‌ను వైద్య శాఖ మంత్రితో పాటు ఆ శాఖ సెక్రటరీ, విభాగాధిపతులతో పాటు జిల్లా కలెక్టర్లు, డీఎంహెచ్‌వోలు, డీసీహెచ్ఎస్‌లకు ఇస్తారు. దాంతో రాష్ట్రంలోని ఏ ఆస్పత్రికి సంబంధించిన వైద్యులు, వైద్య సిబ్బంది హాజరునైనా ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ విధానం ద్వారా కచ్చితంగా సర్కారీ దవాఖానల్లో సిబ్బంది హాజరు శాతం మెరుగవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. తద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయని ధీమాగా ఉంది.

మార్కెట్లోకి ఐఫోన్ 16 ఈ

ప్రారంభ ధర రూ.59,900



న్యూఢిల్లీ: అమెరికన్ టెక్నాలజీ దిగ్గజం ఆపిల్ తన ఐఫోన్ 16 సిరీస్‌లో కొత్త మోడల్ 'ఐఫోన్ 16ఈ'ని విడుదల చేసింది. 6.1 అంగుళాల స్క్రీన్, 48 మెగాపిక్సెల్ కెమెరాతోపాటు పలు ప్రీమియం ఫీచర్లతో కూడిన ఈ ఫోన్‌ను రూ.59,900 ప్రారంభ ధరతో అందుబాటులోకి తెచ్చింది. ఈ ఫోన్ నలుపు, తెలుపు రంగుల్లో.. 128, 256, 512 స్టోరేజ్ సామర్థ్యంతో కూడిన వేరియంట్లలో లభించనుంది. ఈనెల 21 నుంచి బుకింగ్ ప్రారంభం కానుంది. 28 నుంచి మార్కెట్లోకి అందుబాటులోకి రానుంది.

భూ భారతి.. క్షేత్ర స్థాయి సమస్యలపై

మేధోమథనం

» సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంపై సుదీర్ఘ చర్చ

» క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా

» త్వరగా చట్టాన్ని అమల్లోకి తేవాలన్న మంత్రి పొంగులేటి

హైదరాబాద్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): భూ భారతి నిబంధనల రూపకల్పనలో భాగంగా మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ కార్యాలయంలో జరిగిన వర్క్‌షాప్‌లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. కొత్త చట్టం విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుని నిబంధనలు రూపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి సిబ్బందితోపాటు కలెక్టర్లు పలు సందేహాలను లేవనెత్తారు. సాదాబైనామా, భూధార్ కార్డుల జారీ, సర్వే మ్యాపింగ్, గ్రామ స్థాయి రికార్డులు, హక్కుల రికార్డులో తప్పులు, చేరికలు వంటి సవరణలకు ఎవరిని బాధ్యులను చేయాలనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

వీలైనంత త్వరగా అమల్లోకి

వీలైనంత త్వరగా భూభారతి చట్టాన్ని అమల్లోకి తెస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో భూమికి సంబంధించి అనేక సమస్యలు ఉన్నా గత ప్రభుత్వ నిర్వాకం వల్ల సరైన పరిష్కారం దొరకలేదన్నారు. ధరణి వల్ల రైతులు తమ భూములు కోల్పోయే పరిస్థితి తలెత్తిందన్నారు. తొందరపాటు నిర్ణయాలతో రెవెన్యూ వ్యవస్థ భ్రష్టుపట్టిపోయిందని, సామాన్యులకు రెవెన్యూ సేవలు దూరమయ్యాయని చెప్పారు. ఈ సమస్యలన్నింటికీ భూ భారతి పరిష్కారం చూపుతుందన్నారు. సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్, భూ చట్టాల నిపుణుడు భూమి సునీల్, సీఎంఆర్‌వో మకరంద్, పలు జిల్లాల కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

కోట్లు పెట్టి విమానం కొనుగోలు

» విదేశాలకు రూ.వందల కోట్ల తరలింపు

» అమాయకుల డబ్బుతో విదేశాల్లో జల్సాలు

» ఫాల్కన్ నిందితుల విచారణలో వెలుగులోకి విస్తుపోయే విషయాలు

» 7 వేల మంది బాధితులున్నట్లు అంచనా

» క్రెడిట్ కార్డుతోనే 60% మంది పెట్టుబడులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఫాల్కన్ ఇన్వాయిస్ కుంభకోణం కేసులో విస్తుబోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. రూ.850 కోట్ల ఈ స్కామ్‌లో ప్రధాన సూత్రధారులు అమన్‌దీప్ కుమార్(మేనేజింగ్ డైరెక్టర్), ఆర్యన్‌సింగ్(సీవోవో), యోగేందర్ సింగ్(సీఈవో) విదేశాల్లో జల్సాలకు, విలాసవంతమైన జీవితం కోసం ఏకంగా ఓ చార్టెడ్ విమానాన్ని కొనుగోలు చేసినట్లు సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం(ఈవోడబ్ల్యూ) గుర్తించింది. అమాయకుల నుంచి కొల్లగొట్టిన డబ్బులోంచి.. రూ. కోట్లు వెచ్చించి, ఈ విమానాన్ని కొన్నారని దర్యాప్తు అధికారులు తెలిపారు. అంతేకాదు.. ఈ స్కామ్‌లో దోచుకున్న మొత్తాన్ని షెల్ కంపెనీల ద్వారా దుబాయ్, ఇతర దేశాలకు తరలించినట్లు గుర్తించామన్నారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన ఓదేల పవన్‌కుమార్, నల్లూరి కావ్యల విచారణ సందర్భంగా ఈ వివరాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. అమన్‌దీప్, ఆర్యన్, యోగేందర్‌లు తొలుత తాము కొల్లగొట్టిన డబ్బును క్రిప్టో కరెన్సీ, హోటల్ వ్యాపారం, పాడి ఉత్పత్తులు, హెర్బల్ వ్యాపారం, సాఫ్ట్‌వేర్ కంపెనీ, ఫార్మా కంపెనీల్లో పెట్టుబడుల రూపంలో విదేశాలకు తరలించారు. సింహభాగం డబ్బు దుబాయ్‌కి వెళ్లినట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఈ ముగ్గురూ దుబాయ్‌లో ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

క్రెడిట్‌కార్డుంటే.. బుట్టలో పడ్డట్లే?

ఫాల్కన్ మోసగాళ్లు క్రెడిట్‌కార్డుదారులను సులభంగా బుట్టలో వేసుకునేవారని పోలీసులు గుర్తించారు. మొత్తం బాధితుల సంఖ్య 1,700గా ఉంటుందని అంచనా వేస్తుండగా.. వీరిలో 60% మంది క్రెడిట్ కార్డులతో పెట్టుబడి పెట్టారు. నిజానికి క్రెడిట్ కార్డు ద్వారా ఏదైనా కొనుగోళ్లు జరిపితే.. 45 రోజులలోపు బ్యాంకుకు తిరిగి చెల్లించే వెసులుబాటు ఉంటుంది. కేటుగాళ్లు దీన్నే తమ స్కామ్‌లో ఓ ఆయుధంగా మార్చుకున్నారు. రూ.25 వేల నుంచి రూ.9 లక్షల వరకు పెట్టుబడులకు అవకాశం కల్పించారు. మెచ్యూరిటీ సమయాన్ని 45 రోజులు, అర్ధవార్షికం, వార్షికంగా నిర్ణయించారు. క్రెడిట్‌కార్డుదారులు చాలా మంది త్రైమాసిక స్కీమ్‌వైపు ఆకర్షితులయ్యారు. ఫాల్కన్ ఇచ్చే 11% వడ్డీకి ఆశపడి.. క్రెడిట్‌కార్డులతో రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెట్టుబడులు పెట్టారు. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టినవారు కూడా ఉన్నారని.. ఓ డాక్టర్ ఏకంగా రూ.2 కోట్లు పోగొట్టుకున్నాడని వివరించారు.

శాటిలైట్ టౌన్‌షిప్‌లు!

» మళ్లీ ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీలు

» ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్య నిర్మాణాలు

» 'అఫర్డబుల్ హౌసింగ్ పాలసీ'కి సర్కార్ యోచన

» టెండర్లు ఆహ్వానించిన హౌసింగ్ బోర్డు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఆర్థిక సాయం అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. అల్పాదాయ వర్గం (ఎల్ఐజీ), మధ్య తరగతి వర్గం (ఎంఐజీ), ఎక్కువ ఆదాయ వర్గం (హెచ్ఐజీ) వారికి కూడా ఇళ్లను సరసమైన ధరలకు అందించాలని సంకల్పించింది. ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్) - రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) మధ్యన శాటిలైట్ టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేయాలని, వీలైనచోట.. స్థలం అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఏకంగా కొత్త గ్రామాలనే సృష్టించాలనే యోచనలో ఉంది. మొదటి దశలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఫ్యూచర్ సిటీ ప్రాంతాల్లో, ఆ తరువాత హైదరాబాద్ చుట్టు పక్కల, అనంతరం వివిధ ప్రాంతాల్లో ఇళ్లను నిర్మించాలని ప్రాథమికంగా నిర్ణయించింది. తద్వారా ఈ ప్రాంతాలన్నీ భవిష్యత్తులో అధిక డిమాండ్ ఉన్న ఏరియాలుగా మారుతాయని సర్కారు అభిప్రాయపడుతోంది. ఈ సందర్భంగా ఉమ్మడి ఏపీ హయాంలో నిర్మించిన కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు సహా ఇతర ప్రాంతాల్లో నిర్మించిన ఇళ్ల నిర్మాణాలను పరిగణనలోకి తీసుకోనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీలకు కూడా ఇళ్లను అందించాలనే నిర్ణయం నేపథ్యంలో అందుకనుగుణంగా కొత్తగా ఇళ్ల పాలసీని తీసుకురానుంది. ఇందుకోసం 'అఫర్డబుల్ హౌసింగ్ పాలసీ'ని రూపొందించాలని నిర్ణయించింది. తాజాగా పాలసీ రూపకల్పనకు అర్హతలున్న కంపెనీలకు తెలంగాణ హౌసింగ్ బోర్డు పిలుపునిచ్చింది. ఈ మేరకు బుధవారం టెండర్లను ఆహ్వానించగా.. ఈ నెల 25 మధ్యాహ్నం 3 గంటలకు వరకు టెండర్ల దాఖలకు గడువు ఇచ్చింది. అదేరోజు సాయంత్రం 5 గంటలకు సాంకేతిక బిడ్‌ను తెరవనుండగా, అందులో అర్హత సాధించిన కంపెనీల టెండర్లకు సంబంధించిన కమర్షియల్ బిడ్‌ను ఈనె 28న తెరవనున్నట్లు టెండర్ డాక్యుమెంట్‌లో పొందుపర్చింది. ఈ అఫర్డబుల్ హౌసింగ్ పాలసీ అమలు కోసం తెలంగాణ హౌసింగ్ బోర్డును నోడల్ ఏజెన్సీగా నియమిస్తూ ప్రభుత్వం 2025 జనవరి 31న ఉత్తర్వులు జారీ చేసింది.

హౌసింగ్ డెవలప్‌మెంట్ ఫండ్ ఏర్పాటు!

పాలసీ రూపకల్పనకు ముందుకొచ్చే కంపెనీలకు హౌసింగ్ బోర్డు పలు సూచనలు చేసింది. నిర్మాణాలకు అవసరమయ్యే నిధుల కోసం హౌసింగ్ డెవలప్‌మెంట్ ఫండ్ (హెచ్‌డీఎఫ్)ను ఏర్పాటుచేస్తే ఎలా ఉంటుంది? వివిధ ప్రైవేటు కంపెనీల నుంచి కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ ఫండ్స్ (సీఎస్ఆర్)ను దీనికి మళ్లించే అంశంపైనా సమగ్ర వివరాలను ఇవ్వాలని సూచించింది. అయితే.. కొత్త పాలసీ విజయవంతం అవుతుందా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి.

1 నుంచి 5 వరకు ప్రత్యేక అసెంబ్లీ!?

(మొదటిపేజీ తరువాయి)

యోచిస్తోంది. అధికారులు కూడా ఆ మేరకే ముసాయిదాలు రూపొందించనున్నట్లు సమాచారం. అయితే బీసీలకు రిజర్వేషన్లను పెంచుతూ చేసే చట్టాన్ని రాష్ట్ర అసెంబ్లీ ఆమోదిస్తే సరిపోదని న్యాయనిపుణులు చెబుతున్నారు. పెంచిన రిజర్వేషన్లు అమలు కావాలంటే మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయించాలి. లేదా పార్లమెంటులో ఈ చట్టాన్ని ఆమోదింపజేసి, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలి. ఈ చట్టానికి కేంద్రం ఆమోదం తెలపకపోతే పోరాటం చేయాలని రేవంత్ సర్కారు భావిస్తోంది. ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొనిపోవాలని యోచిస్తోంది. అన్ని పార్టీలకు త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి లేఖలు రాయనున్నట్లు తెలిసింది. ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో బీసీలకు రిజర్వేషన్‌ను పెంచే బిల్లుకు చట్టబద్ధత కల్పించి, దాన్ని కేంద్రానికి పంపనున్నారు. మార్చి 10 నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభమవనున్నాయి. అదే రోజు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ ప్రతినిధులు ఢిల్లీ వెళ్లి బీసీలకు రిజర్వేషన్ పెంపు అంశాన్ని ఆమోదించాలని కేంద్రాన్ని కోరనున్నారు. మిగిలిన రాజకీయ పార్టీలను కూడా ఢిల్లీకి రావాలని కోరనున్నట్లు తెలిసింది. అలాగే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కూడా డిమాండ్ చేయనున్నారు.

మార్చి మూడో వారంలో ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలను నిర్వహించనుంది. 2025-26 ఏడాదికి సంబంధించిన బడ్జెట్‌పై ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే కీలక శాఖలతో బడ్జెట్ కేటాయింపులు, గతంలో కేటాయించిన నిధుల ఖర్చు సహా అన్ని అంశాలపై సమీక్షలు నిర్వహించింది. ఈ క్రమంలోనే మార్చి 15 నుంచి 30 వరకు బడ్జెట్ సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది.

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు తథ్యం: కేంద్ర మంత్రి బండి



భగత్‌నగర్ (కరీంనగర్), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడడం తథ్యమని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లో తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ, పది సీట్లలో ఉప ఎన్నికలు వస్తే ఏడిట్లో బీజేపీ గెలవడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూ దొందే అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల్లో అసమ్మతి సమావేశాలు రహస్యంగా జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వానికి నూకలు చెల్లబోతున్నాయని, ఎప్పుడు ఊడుతుందో తెలియని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. కులగణన పేరుతో 60 లక్షల మంది బీసీలను తగ్గించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. హిందూ జాతిలో ముస్లింలను ఎలా కలుపుతారని ప్రశ్నించారు. ముస్లింలకు 4% రిజర్వేషన్ ఇస్తేనే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీలు గెలవాల్సిన చోట ఎంఐఎం గెలిచిందని, పది శాతం ఇస్తే పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం పీఆర్సీ సహా ఏ సమస్యనూ పరిష్కరించలేదని విమర్శించారు.

దేవాదాయశాఖ అదనపు కమిషనర్‌గా శ్రీనివాస్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖలో అదనపు కమిషనర్ స్థాయి అధికారుల బదిలీలు జరిగాయి. ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్‌గా ఈ. శ్రీనివాస్‌రావు నియమితులయ్యారు. ఆయన ఇప్పటి వరకు దేవాదాయ శాఖ ట్రైబ్యునల్ సభ్యుడిగా కొనసాగారు. ఆయన స్థానంలో ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్‌గా ఉన్న కె.జ్యోతి నియమితులయ్యారు. ఈ మేరకు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దేవాదాయశాఖ ప్రధాన కార్యాలయంతోపాటు ఇతర ప్రాంతాల్లోనూ కీలక పోస్టులు సుదీర్ఘకాలంగా ఇన్‌చార్జీల పాలనలోనే కొనసాగుతున్నాయి. కమిషనర్ తర్వాత అత్యంత కీలకమైన రీజనల్ జాయింట్ కమిషనర్ (ఆర్‌జేసీ) పరిపాలన పోస్టును సుమారు 7 సంవత్సరాలుగా ఇన్‌చార్జీతోనే నెట్టుకొస్తున్నారు. వాస్తవానికి దేవాదాయ శాఖకు మొత్తం ఐదు ఆర్‌జేసీ పోస్టులు ఉండగా.. ప్రస్తుతం అవన్నీ ఖాళీగానే ఉన్నాయి. దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో మరో కీలక పోస్టు డిప్యూటీ కమిషనర్(డీసీ) హైదరాబాద్.. కొన్ని నెలలుగా ఖాళీగా ఉంది. డీసీ సర్వీసెస్ పోస్టులో ఇన్‌చార్జిని నియమించారు. అసిస్టెంట్ కమిషనర్ హెడ్ ఆఫీస్ (ఏసీహెచ్‌వో) పోస్టునూ ఇన్‌చార్జితోనే నెట్టుకొస్తున్నారు. హైదరాబాద్ అసిస్టెంట్ కమిషనర్ పోస్టులోనూ పూర్తి స్థాయి అధికారి లేరు. ఏసీ రంగారెడ్డికి హైదరాబాద్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఏసీ రంగారెడ్డి అత్యంత కీలకమైంది కావడం, రెవెన్యూ విషయాలు రోజుకొకటి తెరపైకి వస్తున్న నేపథ్యంలో హైదరాబాద్ ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించాలని సదరు అధికారి ఉన్నతాధికారుల వద్ద మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. ఇలా దేవాదాయ శాఖలో మరీ ముఖ్యంగా అధికారి స్థాయిలో పోస్టింగుల విషయంలో చిత్రవిచిత్ర పరిస్థితి నెలకొంది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.